www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# విశ్వంభర

అక్షరం సాక్షిగా..

శనివారం
17-08-2024

సంపుటి : 01 | సంచిక : 105 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్




## ఆ సత్తా హైదరాబాద్‌కు ఉంది

**పరిశ్రమలు, సేవారంగాలతో పాటు అన్ని సెక్టార్లలో విస్తరిస్తుంది**

**ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ**

**ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డితో కంపెనీ ప్రతినిధి బృందం భేటీ**



**విశ్వంభర, హైదరాబాద్:** పారిశ్రామిక, సేవరంగాలతో పాటు అన్ని సెక్టార్లలో విస్తరించే సత్తా హైదరాబాద్ నగరానికి ఉందని అంతర్జాతీయ దిగ్గజ పారిశ్రామిక సంస్థ ఫాక్స్‌కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ అన్నారు. త్వరలోనే తన బృందంతో కలిసి హైదరాబాద్‌ను సందర్శిస్తానని తెలిపారు. ఫోర్త్‌సిటీపై రేవంత్‌రెడ్డి విజన్‌ను యాంగ్ లియూ కొనియాడారు. ఫాక్స్ కాన్ ఛైర్మన్ యాంగ్ లియూ నేతృత్వంలోని ఆ కంపెనీ ప్రతినిధి బృందం దిల్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఆయన అధికారిక నివాసంలో శుక్రవారం ఉదయం సమావేశమైంది. హైదరాబాద్ చరిత్ర, పారిశ్రామిక సంస్థల విస్తరణకు ఉన్న అనుకూలతను సీఎం రేవంత్‌రెడ్డి ఫాక్‌స్‌కాన్ బృందానికి వివరించారు. 430 ఏళ్ల కింద పునాదిరాయి పడిన హైదరాబాద్ కాలక్రమంలో మూడు నగరాలుగా అభివృద్ధి చెందిన తీరును తెలిపారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక అభివృద్ధిలో వైరుధ్యాలు లేకపోవడంతోనే హైదరాబాద్ వేగంగా పురోగతి చెందుతోందన్నారు. అంతర్జాతీయ విమానాశ్రయం, మిగతా2లో...

## ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం

- నింగిలోకి దూసుకెళ్లిన వాహన నౌక
- 17 నిమిషాల పాటు సాగిన ప్రయోగం
- విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఉపయోగపడనున్న ఉపగ్రహం
- శాస్త్రవేత్తలను అభినందించిన , ఇస్రో చైర్మన్ సోమనాథ్, ఏపీ సీఎం చంద్రబాబు


2

భారతీయ చలనచిత్ర రంగంలో ప్రతిష్టాత్మకంగా భావించే 70వ జాతీయ చలన చిత్ర అవార్డులను కేంద్ర ప్రభుత్వం శుక్రవారం ప్రకటించింది.ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్' ను వరించగా.. ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకుగాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్ (తిరుచిత్రాంబళం తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్సప్రెస్ గుజరాతి)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగానూ ఈ అవార్డులను ప్రకటించారు.ప్రాంతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తెలుగు చిత్రంగా 'కార్తికేయ 2' నిలిచింది. ఉత్తమ కన్నడ చిత్రంగా కేజీఎఫ్-2 అవార్డు దక్కించుకుంది. ఉత్తమ హిందీ చిత్రంగా గుల్మెహర్ నిలిచింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకు పురస్కారాలు అందిస్తున్నారు.2022లో దేశవ్యాప్తంగా సుమారు 28 భాషల్లో విడుదలైన 300కు పైగా చిత్రాల నుంచి అందిన నామినేషన్లను 11 మందితో కూడిన జ్యూరీ పరిశీలించి ఈ అవార్డులను వెల్లడించింది. హీరో నిఖిల్ కార్తికేయ 2 సినిమాకి ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా జాతీయ అవార్డు వరించింది. ఈ ఒక్కటి మినహా తెలుగు ఇండస్ట్రీకి మరే అవార్డు రాకపోవడంతో..తెలుగు సినిమాకు నిరాశే ఎదురైంది.ఈ సారి జాతీయ అవార్డుల్లో మలయాళం, కన్నడ, తమిళ సినిమాలు ఎక్కువగా అవార్డులను గెలుచుకున్నాయి. ఈ అవార్డుల కోసం పలు భాషల సినిమాలు పోటీ పడగా..ఏఏ రంగాలలో ఎవరెవరికి పురస్కారాలు వరించాయో తెలుసుకుందాం.








# తెలుగు సినిమాకు నిరాశే

**ఉత్తమ ప్రాంతీయ చిత్రంగా కార్తికేయ 2**

ఈ ఒక్కటి మినహా తెలుగు ఇండస్ట్రీకి దక్కని మరే అవార్డు

70వ జాతీయ చలనచిత్ర పురస్కారాల ప్రకటన

ఉత్తమ నటుడు రిషబ్ శెట్టి, ఉత్తమ్ నటి నిత్యామేనన్

9




## చంద్రబాబు ఢిల్లీ టూర్

- కేంద్ర జలశక్తి శాఖ మంత్రితో భేటీ
- నేడు ప్రధాని మోదీతో సమావేశం కానున్న బాబు


2

## కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యం

**కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్**

బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ తహతహలాడుతోంది.. త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యం..త్వరలో రాజ్యసభ ఎన్నికలొస్తున్నందున కవితను కాంగ్రెస్ పక్షాన రాజ్యసభకు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదు.. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారు..కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కాళేశ్వరం సహా అనేక అంశాల్లో వేల కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపాలి అంటూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ విమర్శలు గుప్పించారు.


2

## కోదండరాం, అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా ప్రమాణం

హైకోర్టు ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధించడంతో మార్గం సుగమం

ప్రమాణం చేయించిన మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి


హాజరైన మంత్రులు, ప్రజా ప్రతినిధులు



**విశ్వంభర, హైదరాబాద్:** గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా ఆచార్య కోదండరాం, జర్నలిస్టు అమీర్ అలీఖాన్ లు ప్రమాణం చేశారు. మండలి సభ్యుల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై సుప్రీం కోర్టు స్టే విధిస్తూ తీర్పును వెలువరించడంతో ఎట్టకేలకు సందిగ్ధం వీడింది. ఈ మేరకు టీజేఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం, సియాసత్ పత్రిక రెసిడెంట్ ఎడిటర్ జావెద్ అలీఖాన్ కుమారుడు మిగతా2లో...

## మరోసారి తెరపైకి రాహుల్ గాంధీ పౌరసత్వం

- రద్దు చేసేలా ఆదేశాలివ్వాలని ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ దాఖలు
- బ్రిటిష్ పౌరుడని ఆరోపిస్తున్న సుబ్రహ్మణ్య స్వామి
- వచ్చే వారం విచారణకు వచ్చే అవకాశం



**ఢిల్లీ:** లోక్‌సభలో విపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వం అంశం మరోసారి తెరపైకి వచ్చింది. ఆయన భారతదేశ పౌరసత్వంపై భారతీయ జనతా పార్టీ నేత సుబ్రహ్మణ్య స్వామి ఢిల్లీ హైకోర్టును మిగతా2లో...

## బెయిల్ నిరాకరించొద్దు

- నిరాకరించాల్సి వస్తే.. కారణాలను బోర్డు రికార్డు చేయాలి
- జువెనైల్ బెయిల్‌కు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు


2

మరిన్ని తాజా వార్తల కోసం **స్కాన్** చేయండి



## నేటి చికెన్ ధరలు

| | |
|---|---|
| ఫామ్ ధర ₹ 90 | రిటైల్ ₹ 112 |
| స్కిన్ ₹ 162 | స్కిన్ లెస్ ₹ 185 |

## అయిదు బాధ్యతలతో ఆగమాగం

**సమయం ఇవ్వలేకపోతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి**

**నిర్ణయాలపై తర్జనభర్జన**



**విశ్వంభర బ్యూరో, హైదరాబాద్:** రాష్ట్రంలోని అత్యధిక జనాభాకు పౌర సేవలతో పాటు అత్యవసర సేవలందిస్తున్న జీహెచ్ఎంసీకి కమిషనర్ గా వ్యవహరిస్తున్న అమ్రపాలి అయిదు కీలకమైన బాధ్యతలతో ఆగమాగమవుతున్నట్లు సమాచారం. గతంలో ఆమె జీహెచ్ఎంసీలో అదనపు కమిషనర్ (ఐటీ)గా విధులు నిర్వహించి నప్పటికీ ప్రస్తుతం జీహెచ్ఎంసీలో నెలకొన్న ఆర్థిక స్థితిగతులతో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలన్న అంశంపై ఆమె తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. మిగతా2లో...



## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయాల్లో మార్పులు

**విశ్వంభర, హైదరాబాద్:** తెలంగాణలో గ్రూప్-1 మెయిన్స్ పరీక్షా సమయాల్లో మార్పు చోటుచేసుకుంది. అక్టోబర్ 21 నుంచి 27 వరకు జరగాల్సిన ఈ పరీక్ష సమాయంలో టీజీపీఎస్సీ మార్పు చేసింది. గతంలో నిర్ణయించిన సమయం కన్నా అరగంట ముందుగానే నిర్వహించనుంది. తొలుత ప్రకటించిన మిగతా2లో...

## నిత్య విద్యార్థి..మంత్రి సీతక్క

- ఎల్ఎల్ఎం పరీక్షకు హాజరు
- అధ్యయనం,పోరాటం అనే సూత్రంతో ముందుకు
- ప్రజాసేవను, చదువును సమన్వయం చేస్తూ రాజకీయాల్లో తనదైన ముద్ర



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాజకీయాలలో ప్రజా సమస్యలు తీర్చడం నియోజక వర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు , అధికారులతో సమీక్షలు, జిల్లా పర్యటనలు, సమావేశాలు, సభలలో పాల్గొనడం సర్వసాధారణం . వీటితో పాటు అదనంగా చదువును కొనసాగించడం కత్తి మీద సాము లాంటిదే . ఇలా రెండింటినీ సమన్వయం చేసుకుంటూ రాజకీయాల్లో తనదైన ముద్ర వేస్తున్నారు మంత్రి సీతక్క. మంత్రిగా , నిత్యవిద్యార్థినిగా ఆమె రాణిస్తున్నారు. అధ్యయనం, పోరాటం అనే సూత్రాన్ని అనుసరిస్తూ ముందుకు సాగుతున్నారు. అధికార బాధ్యతలు నిర్వర్తిస్తూనే చదువుకు ప్రాధాన్యమిస్తున్నారు. ప్రజా సేవలోనే ఉంటూ ఎల్ఎల్ బీ, రాజనీతి శాస్త్రంలో పీహెచ్ డీ పూర్తి చేసిన సీతక్క తాజాగా శుక్రవారం నుంచి ప్రారంభమైన ఎల్.ఎల్.ఎం. రెండో సంవత్సర పరీక్షలకు హాజరయ్యారు. తన అధికార నివాసమైన ప్రజాభవన్లో ఎల్.ఎల్.ఎం పుస్తకాలను చదువుతున్న ఫోటోలు ఇప్పుడు నెట్టింట్లో చక్కర్లు కొడుతున్నాయి.

## ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతం

**శ్రీహరికోట:** ఇస్రో చేపట్టిన ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయవంతమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని షార్ లోని మొదటి లాంచ్ ప్యాడ్ నుంచిఈ వాహక నౌక నింగిలోకి దూసుకెళ్లింది. ఈ ప్రయోగం ద్వారా 175 కిలోల ఈవోఎస్-08 ఉపగ్రహాన్ని విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టారు. మొత్తం 17 నిమిషాల పాటు ఈ ప్రయోగం సాగింది. చిన్న చిన్న శాటిలైట్లను అభివృద్ధి చేయటం, అందుకు అనుకూలమైన పేలోడ్ పరికరాలను రూపొందించే లక్ష్యంలో భాగంగా ఇస్రో ఈ ప్రయోగాన్ని చేపట్టింది.విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుంది. పర్యావరణం, ప్రకృతి విపత్తులు, అగ్ని పర్వతాలపై ఇది పర్యవేక్షించనుంది.ఇస్రోకు చెందిన యూఆర్ రావు శాటిలైట్ సెంటర్ ఈవోఎస్ ను అభివృద్ధి చేశారు. ఇందులో ఉండే ఎలక్ట్రో ఆప్టికల్ ఇన్ఫ్రారెడ్ (ఈవోఐఆర్) పేలోడ్ మిడ్-వేవ్, లాంగ్ వేవ్ ఇన్ఫ్రా-రెడ్లో చిత్రాలను క్యాప్చర్ చేస్తుంది. 'ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్' ఈవోఎస్-08ను తక్కువ ఎత్తులోని భూ కక్ష్యలోకి ప్రవేశపెట్టడం ఈ మిషన్ లక్ష్యం. దాదాపు 6 నెలల తర్వాత ఇస్రో చేపట్టిన రాకెట్ ప్రయోగమిది. కేవలం రెండు రోజుల ప్రణాళికతో చిన్న చిన్న శాటిలైట్స్‌ను తక్కువ ఖర్చుతో భూ కక్ష్యలోకి చేర్చేందుకు ఎస్ఎస్ఎల్వీ-డీ3 రాకెట్‌తో సాధ్యమవుతుందని ఇస్రో అధికారులు వివరించారు. విపత్తు నిర్వహణలో సమాచారం ఇచ్చేందుకు ఈ ఉపగ్రహం ఉపయోగపడనుందని ఇస్రో చైర్మన్ ఎస్ సోమ్‌నాథ్ వెల్లడించారు. విపత్తు నిర్వహణలో ఈ సమాచారం ఉపయోగపడుతుందని ఇస్రో పేర్కొంది. ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలను ఇస్రో చైర్మన్ అభినందించారు.ఎస్ఎస్ఎల్వీ-డీ3 ప్రయోగం విజయంవతం పట్ల ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు. భారత అంతరిక్ష నైపుణ్య కీర్తి మరోసారి సత్తా చాటిందని పేర్కొన్నారు. ఇస్రో బృందం భవిష్యత్ ప్రయత్నాలకు శుభాకాంక్షలు తెలిపారు.

## చంద్రబాబు ఢిల్లీ టూర్

**ఢిల్లీ:** ఢిల్లీ పర్యటనలో భాగంగా ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ తో సమావేశమయ్యారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ పనులపై కేంద్ర మంత్రితో చర్చించారు. సీఎంతో పాటు కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పలువురు ఎంపీలు సమావేశంలో పాల్గొన్నారు. రెండ్రోజుల ఢిల్లీ పర్యటనలో భాగంగా శనివారం సాయంత్రం ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చంద్రబాబు భేటీ కానున్నారు. ఆ తర్వాత హోం, ఆర్థికశాఖ మంత్రులతో విడివిడిగా సమావేశమవుతారు. కేంద్ర బడ్జెట్ తర్వాత తొలిసారి ప్రధానితో భేటీ అవుతున్న నేపథ్యంలో సీఎం పర్యటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## మరోసారి తెరపైకి రాహుల్ గాంధీ పౌరసత్వం

(మొదటి పేజీ తరువాయి)
శుక్రవారంనాడు ఆశ్రయించారు. రాహుల్ భారతదేశ పౌరసత్వాన్ని రద్దు చేయాల్సిందింగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ కు ఆదేశాలివ్వాలని హైకోర్టును ఆయన కోరారు.ఇదే విషయమై తాను గతంలో చేసిన ఫిర్యాదు స్థితిని తెలియజేసేలా హోంశాఖకు ఆదేశాలు ఇవ్వాలన్నారు. సుబ్రహ్మణ్య స్వామి తరపున అడ్వొకేట్ సత్యా సబర్వాల్ ఈ పిటిషన్ దాఖలు చేశారు. వచ్చే వారం ఈ పిటిషన్ విచారణకు వచ్చే అవకాశం ఉంది.లోక్ సభలో ప్రతిపక్ష నేతగా ఉన్న రాహుల్ గాంధీ బ్రిటిష్ పౌరుడని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా ఆరోపిస్తున్నారు. లీగల్ వెబ్‌సైట్ బార్ అండ్ బెంచ్ సమాచారం ప్రకారం, 2003లో యునైటెడ్ కింగ్‌డమ్‌లో రిజిస్టర్ అయిన బ్యాకప్స్ లిమిటెడ్ డైరెక్టర్లు, సెక్రటరీలలో రాహుల్ గాంధీ ఒకరని పేర్కొంటూ 2019లో హోం శాఖకు సుబ్రహ్మణ్య స్వామి లేఖ రాశారు. 2005 అక్టోబర్ 10, 2006 అక్టోబర్ 31 తేదీల్లో ఆ సంస్థ దాఖలు చేసిన రిటర్న్స్‌లో రాహుల్ గాంధీని బ్రిటిష్ పౌరుడిగా డిక్లేర్ చేసినట్టు స్వామి ఆ లేఖలో పేర్కొన్నారు. 2009 ఫిబ్రవరి 17న ఆ కంపెనీ రద్దు చేసినప్పుడు చేసుకున్న దరఖాస్తులోనూ రాహుల్ బ్రిటిష్ జాతీయతను మరోసారి ప్రకటించినట్టు ఆయన ఎంహెచ్ఏ దృష్టికి తెచ్చారు.

**రాజ్యాంగ ఉల్లంఘన..**
భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారత పౌరసత్వ చట్టం 1955ను రాహుల్ గాంధీ ఉల్లంఘించినట్టు స్వామి ఆరోపించారు. కాగా, దీనిపై 15 రోజుల్లోగా తమకు సమాచారం ఇవ్వాలని కోరుతూ 2019 ఏప్రిల్ 29న రాహుల్ గాంధీకి హోం మంత్రిత్వ శాఖ లేఖ రాసినట్టు చెబుతున్నారు. ఎంహెచ్ఏ లేఖ రాసి ఐదేళ్లయినా ఇంతవరకూ రాహుల్ నుంచి ఎలాంటి సమాధానం లేదని బీజేపీ ఆరోపిస్తోంది. కాగా, రాహుల్ గాంధీ ఇంతవరకూ ఐదుసార్లు ఎంపీగా ఉన్నారు. 2004-2019 మధ్య మూడుసార్లు అమేథీకి ఎంపీగా ప్రాతినిధ్యం వహించారు. 2019లో బీజేపీ నేత స్మృతి ఇరానీ చేతిలో ఓటమి చవిచూసినప్పటికీ కేరళలోని వయనాడ్ నుంచి ఎంపీగా గెలిచారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ఉత్తరప్రదేశ్‌లోని రాయబరేలి నియోజకవర్గం నుంచి ఆయన ఎంపీగా ఎన్నికయ్యారు. వయనాడ్ నుంచి కూడా ఎన్నికైనప్పటికీ ఆ నియోజకవర్గాన్ని ఆయన వదులుకున్నారు. పదేళ్ల తర్వాత కాంగ్రెస్ పార్టీకి లోక్‌సభలో విపక్ష నేత హోదా దక్కింది.

## గ్రూప్-1 మెయిన్స్ పరీక్షల సమయాల్లో మార్పులు

(మొదటి పేజీ తరువాయి)
షెడ్యూల్ ప్రకారం నిర్ణీత తేదీల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30గంటల వరకు ఈ పరీక్ష నిర్వహించాల్సి ఉండగా ఆ సమయాన్ని మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటలకు మార్పు చేసింది. రాష్ట్రంలో 563 గ్రూప్-1 ఉద్యోగాల భర్తీకి జూన్ 9న నిర్వహించిన ప్రిలిమ్స్ పరీక్ష ఫలితాలను ఇటీవల విడుదల చేసిన టీజీపీఎస్సీ మెయిన్స్ పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు చేస్తోంది. గ్రూప్-1 పరీక్షకు రాష్ట్ర వ్యాప్తంగా 4.03 లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, ప్రిలిమ్స్ పరీక్షకు 3.02 లక్షల మంది అభ్యర్థులు హాజరయ్యారు. అయితే, గత నెలలో విడుదలైన ప్రిలిమ్స్ ఫలితాల్లో 31 వేల మందికి పైగా అభ్యర్థులు మెయిన్స్ పరీక్షకు అర్హత సాధించారు. ఈ పరీక్షలు అక్టోబర్ 21 నుంచి 27 వరకు నిర్వహిస్తారు.

**జాబ్ క్యాలెండర్ ప్రకారం పరీక్షలు..**
తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగుల గురించి జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే ఈ జాబ్ క్యాలెండర్ ప్రకారం తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆధ్వర్యంలో గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షలు జరుగుతాయి. గ్రూప్-1 పరీక్షలను అక్టోబర్‌లో నిర్వహిస్తామని, గ్రూప్-2 పరీక్షలను డిసెంబర్‌లో, గ్రూప్-3 పరీక్షలు నవంబర్‌లో నిర్వహిస్తామన్నారు. కాగా ఈ ఖాళీలకు ఇప్పటికే నోటిపికేషన్లు విడుదలై పరీక్షలు మాత్రమే నిర్వహించాల్సి ఉంది. గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించి మెయిన్స్‌కు అర్హత పొందిన వారి జాబితాను ఇప్పటికే విడుదల చేశారు. ఈ ఏడాది అక్టోబర్‌లోనే మరోసారి గ్రూప్-1 నోటిఫికేషన్ ఇచ్చి 2025 ఫిబ్రవరిలో ప్రిలిమ్స్ నిర్వహిస్తామని ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌లో తెలిపింది. గ్రూప్-1 మెయిన్స్‌ను 2025 జులైలో నిర్వహిస్తామని పేర్కొంది.



# అయిదు బాధ్యతలతో ఆగమాగం

(మొదటి పేజీ తరువాయి)
ప్రస్తుతం ఆమె జీహెచ్ఎంసీ కమిషనర్, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్, ఔటర్ రింగ్ రోడ్డు ప్రాజెక్టు ఆఫీసర్, హైదరాబాద్ గ్రోత్ కారిడార్ మేనేజింగ్ డైరెక్టర్, మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ బోర్డు ఎండీ అనే అయిదు కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ అయిదు పోస్టుల్లో జీహెచ్ఎంసీ కమిషనర్ మినహా మిగిలిన నాలుగు పోస్టులకు సంబంధించిన విధుల నిర్వహణ ఒక లెక్క, జీహెచ్ఎంసీ కమిషనర్ గా సక్సెస్ గా పని చేయటం మరో లెక్కగా భావించవచ్చు. దాదాపు రెండు నెలల క్రితం జీహెచ్ఎంసీ కమిషనర్ గా బాధ్యతలు స్వీకరించిన అమ్రపాలి తొలుత శానిటేషన్ పై దృష్టి సారించారు. మార్నింగ్ వాక్ లో భాగంగా శానిటేషన్ పనులను తనిఖీ చేశారు. వరుసగా పరిశీలించిన ఆమె విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించిన 11 మంది డిప్యూటీ కమిషనర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేసి షాక్ ఇచ్చారు. ఆ తర్వాత సీఎం రేవంత్ వద్ద మూసీ ప్రక్షాళన సుందరీకరణ పై జరిగిన రెండు సమీక్ష సమావేశాల్లో జీహెచ్ఎంసీలో నెలకొన్న ఆర్థిక స్థితిగతులను వివరించటంతో గతంలో ఎన్నడూ లేని విధంగా స్టేట్ బడ్జెట్ లో ఈ సారి సర్కారు రూ. 3065 కోట్లు కేటాయించింది. కమిషనర్ మార్నింగ్ వాక్ అబ్జర్వేషన్ కేవలం శానిటేషన్ వరకే పరిమితమైంది. ఆమె జీహెచ్ఎంసీ కమిషనర్ గా వచ్చిన తర్వాత మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్ మెంట్ బోర్డు మీటింగ్ లు మినహా మిగిలిన హైదరాబాద్ గ్రోత్ కారిడార్, ఔటర్ రింగు రోడ్డు, హెచ్ఎండీఏ జాయింట్ మెట్రోపాలిటన్ కమిషనర్ గా ఆశించిన స్థాయిలో సాధించిన సక్సెస్ అంటూ ఏమీ లేదనే చెప్పవచ్చు. సర్కారు ఆదేశం మేరకు ఆర్కిటెక్, అర్బన్ బయోడైవర్శిటీ, మహిళా



ఉద్యోగుల భద్రత అనే మూడు అంశాల ప్రాతిపదికన అభివృద్ధి ప్రతిపాదనల రూపకల్పన కోసం గత నెల 27న అదనపు కమిషనర్లు, జోనల్ కమిషనర్లతో ప్రత్యేకంగా కమిటీలను నియమించారు. ఒక్కో కమిటీలో ముగ్గురు చొప్పున మూడు కమిటీలకు కలిపి ఎనిమిది మంది అధికారులకు ప్రతిపాదనలు తయారు చేసి, తుది నిర్ణయం కోసం చర్చించేందుకు కమిషనర్ అపాయింట్ మెంట్ కోసం ఛాంబర్ చుట్టూ ప్రదక్షిణలు చేసినా, వారికి సమయం కేటాయించలేకపోయారు. క్షేత్ర స్థాయిలో కూడా ఆమె శానిటేషన్ కు సంబంధించి కొన్ని రోజులు తనిఖీలు నిర్వహించారు. భారీ వర్షాలు కురిసినపుడు క్షేత్రస్థాయిలో సహాయక చర్యల పరిశీలన, ఏదైనా విపత్తు జరిగినపుడు రెస్క్యూ ఆపరేషన్ పర్యవేక్షణ వంటి అంశాలకు సంబంధించిన ఆమె ఫీల్డుకు రావల్సిన అవసరం ఇప్పటి వరకైతే రాలేదనే చెప్పవచ్చు.

**సర్వేపై స్పెషల్ ఫోకస్...**
జీహెచ్ఎంసీ పరిధిలో పౌర సేవల నిర్వహణ మొదలుకుని ఆధునిక సంస్కరణలు తెచ్చేందుకు ప్రస్తుతం నగరంలో నిర్వహిస్తున్న జీఐఎస్ సర్వే ఫర్ అర్బన్ ప్లానింగ్ పై ఆమె ఎక్కువగా ఫోకస్ పెట్టారు. 18 నెలల పాటు కొనసాగనున్న ఈ సర్వే ప్రస్తుతం తొలి దశగా చేపట్టిన అయిదు ప్రాంతాల్లో దాదాపు 160 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో పూర్తయినట్లు సమాచారం. ఈ సర్వే మొత్తం పూర్తయి డేటా స్వీకరించిన తర్వాత, ఆ డేటాతో హర్యానాలోని గుర్గావ్ లో ప్రతి ఇంటికి ఓ డిజిటల్ డోర్ నెంబర్ల ద్వారా కేటాయించిన క్యూ ఆర్ కోడ్ తోనే అన్ని రకాల సేవలు ప్రజలకు ఇంటిలోనే అందుబాటులోకి రానున్నాయి. దీనికి తోడు నగరం గ్రేటర్ గా రూపాంతరం చెందిన తర్వాత 2007 నుంచి ఇప్పటి వరకు నగరాన్ని భౌగోళికంగా ఎపుడు స్కాన్ చేయలేదు. ప్రస్తుతం కొనసాగుతున్న ఈ సర్వేతో నగరంలోని భవన నిర్మాణల కోసం తీసుకున్న అనుమతులు, ఉల్లంఘించి చేసిన నిర్మాణాల వివరాలన్నీ బయట పడుతాయి. దీంతో ప్రాపర్టీ ట్యాక్స్ పరిధిలోకి రాని నిర్మాణాలను ట్యాక్స్ పరిధిలోకి తీసుకువస్తే, జీహెచ్ఎంసీకి ప్రస్తుతం ప్రతి ఏటా వసూలవుతున్న రూ.1900 కోట్ల నుంచి రూ.2 వేల కోట్ల ట్యాక్స్ అదనంగా వెయ్యి కోట్లకు పెరిగి రూ.3 వేల కోట్లకు దాటే అవకాశాలున్నట్లు అంచనాలున్నాయి.

### కమిషనర్ గా కొనసాగుతారా?

రెండు నెలల క్రితం అప్పటి కమిషనర్ రోనాల్డ్ రోస్ సెలవులపై వెళ్లటంతో 13 రోజుల పాటు ఇన్ ఛార్జి కమిషనర్ గా బాధ్యతలు నిర్వర్తించిన అమ్రపాలి, ఆ తర్వాత పూర్తి స్థాయి అదనపు బాధ్యతలతో కమిషనర్ పదవీ చేపట్టారు. ఇతర కమిషనర్ల మాదిరిగా ఆమె మూడేళ్ల పాటు కొనసాగుతారా? అంటే కొనసాగుతారనే సమాధానం లేదు. కొన్ని సందర్భాల్లో ఆమె సైతం నేను ఉంటానో, వెళ్లిపోతానోనంటూ వ్యాఖ్యానించటం ఆమె ఎక్కువ కాలం కమిషనర్ గా కొనసాగకపోవచ్చుననే వాదనకు బలాన్ని చేకూరుస్తుంది.

# కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యం

**విశ్వంభర, హైదరాబాద్:** బీఆర్ఎస్‌ను విలీనం చేసుకోవాలని కాంగ్రెస్ తహతహలాడుతోందని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పథకం ప్రకారమే ఆ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారని ఆయన ఆరోపించారు. అతి త్వరలోనే కాంగ్రెస్‌లో బీఆర్ఎస్ విలీనమవడం తథ్యమని జోస్యం చెప్పారు. కేసీఆర్‌ను ఏఐసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, కేటీఆర్‌ను పీసీసీ చీఫ్, హరీశ్‌రావుకు మంత్రి పదవి, కవితకు రాజ్యసభ సీటు ఖాయమన్నారు. నువ్వు కొట్టినట్లు చేయ్, నేను ఏడ్చినట్లు చేస్తానన్నట్లు చేస్తా అని కాంగ్రెస్, బీఆర్ఎస్ తీరుందని ఎద్దేవా చేశారు. త్వరలో రాజ్యసభ ఎన్నికలొస్తున్నందున కవితను కాంగ్రెస్ పక్షాన రాజ్యసభకు పంపినా ఆశ్చర్యపోనక్కర్లేదని బండి పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ నేతలకు ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా కాళేశ్వరం సహా అనేక అంశాల్లో వేల కోట్ల రూపాయల అవినీతి, అక్రమాలకు పాల్పడ్డ కేసీఆర్, కేటీఆర్‌లను జైలుకు పంపాలని ఆయన సవాల్ విసిరారు. కేసీఆర్ కుటుంబ ఆస్తులను జప్తు చేయాలని బండి డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దాగుడుమూతలాడుతున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ప్రజలు తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు.

**కవిత బెయిల్‌కు..**
**బీజేపీకి ఏంటీ సంబంధం?**
త్వరలో కవితకు బెయిల్ వస్తుందని, బీఆర్ఎస్ పార్టీ బీజేపీలో విలీనం కాబోతుందంటూ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బండి సంజయ్ స్పందించారు. బీజేపీని బదనాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమ్ఆద్మీ పార్టీని బీజేపీలో విలీనం చేసుకుంటేనే ఢిల్లీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు బెయిల్ వచ్చిందా అని బండి ప్రశ్నించారు. కవితకు బెయిల్ ఇవ్వాలా? వద్దా? అనేది న్యాయ స్థానం పరిధిలోని అంశమని, కవిత బెయిల్‌కు బీజేపీకి ఏం సంబంధమని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతూ రాజకీయ లబ్ది కోసం గౌరవ న్యాయస్థానంపై బురద చల్లి కోర్టుల ప్రతిష్ఠను తగ్గించడం దుర్మార్గమని బండి సంజయ్ మండిపడ్డారు. బీజేపీని బద్నాం చేసేందుకు కాంగ్రెస్ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌ది ముగిసిన అధ్యాయమని బండి సంజయ్ ఎద్దేవా చేశారు. ప్రజలు ఛీత్కరించిన ఆ పార్టీతో పొత్తు పెట్టుకోవాల్సిన ఖర్మ బీజేపీకి లేదన్నారు.



# ఎమ్మెల్సీలుగా కోదండరాం, అమీర్ అలీఖాన్ ప్రమాణం



(మొదటి పేజీ తరువాయి)
జర్నలిస్ట్ అమీర్ అలీఖాన్ ఎమ్మెల్సీలుగా బాధ్యతలు స్వీకరించారు. మండలి ఛైర్మన్ ఛాంబర్‌లో శుక్రవారం గుత్తా సుఖేందర్ రెడ్డి వారితో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విప్ బీర్ల ఐలయ్య యాదవ్, ఎమ్మెల్సీ మహేశ్ కూమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్ రెడ్డి, తదితరులు హాజరయ్యారు. అనంతరం వారికి శుభాకాంక్షలు తెలిపారు.

**ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారు: కోదండరాం**
తాను ఎమ్మెల్సీ కావడంతో ఉద్యమకారులు సంతోషంగా ఉన్నారని ఆచార్య కోదండరాం అన్నారు. ఎమ్మెల్సీగా ప్రమాణం చేసిన అనంతరం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. దీన్ని అదనపు బాధ్యతగా మాత్రమే భావిస్తున్నట్లు తెలిపారు. ఉద్యమకారులు, అమరవీరుల ఆకాంక్షల మేరకు పని చేస్తానని అన్నారు. అనేక మంది బలిదానాలు చేయడం వల్లే తాము ఈ స్థానంలో ఉన్నట్లు గుర్తుచేసుకున్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎజెండా మీదకు తీసుకురాగలిగానని, మండలిలో సభ్యులుగా కావడం చాలా సంతోషంగా ఉందన్నారు.. బాధ్యతతో ఉద్యమకారుల, ప్రజల, అమరుల ఆకాంక్షల మేరకు పని చేస్తానని పేర్కొన్నారు. . అనేక మంది బలిదానాల వల్ల తెలంగాణ రాష్ట్రం సిద్ధించిందని, తెలంగాణ రాష్ట్రం రావడం వల్లనే మాకు ఈ గుర్తింపు దక్కిందని కోదండరాం అన్నారు.

సుప్రీకోర్టు తీర్పుతో మండలి సభ్యులుగా అవకాశం : గవర్నర్ కోటా ఎమ్మెల్సీల నియామకంపై రాష్ట్ర హైకోర్టు ఈ ఏడాది మార్చి 7వ తేదీన ఇచ్చిన తీర్పుపై సుప్రీంకోర్టు బుధవారం స్టే విధించింది. దాసోజు శ్రవణ్‌కుమార్, కుర్రా సత్యనారాయణలను గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీలుగా నియమించాలంటూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2023 జులైలో చేసిన సిఫార్సులను అప్పటి గవర్న ర్ తమిళిసై తిరస్కరించారు. తర్వాత వచ్చిన కాంగ్రెస్ సర్కార్ ఈ ఏడాది జనవరిలో ప్రొఫెసర్ కోదండరాం, అమీర్ అలీఖాన్‌లను ఆ ఎమ్మెల్సీ స్థానాల్లో నియమించడాన్ని హైకోర్టు కొట్టివేసిన సంగతి తెలిసిందే. దీనిపై సుప్రీం ధర్మాసనం తాజాగా స్టే ఉత్తర్వులిచ్చింది. ఆ స్థానాల్లో కొత్తవారి భర్తీని నిలిపివేయాలన్న పిటిషనర్ల విజ్ఞప్తిని తోసిపుచ్చింది. కొత్తవారి నియామకాలను ఆపలేమని తేల్చిచెప్పింది.

## బెయిల్ నిరాకరించొద్దు


**ఢిల్లీ:** క్రిమినల్ కేసుల్లో అభియోగాలు ఎదుర్కొనే జువెనైల్ బెయిల్‌కు సంబంధించి సుప్రీం కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఇతర నేరస్థుడితో సంబంధం, బాధితులకు భౌతికంగా, మానసికంగా ప్రమాదం ఉందని తేలితే తప్ప.. వారికి బెయిల్ నిరాకరించవద్దని స్పష్టం చేసింది. మైనర్పై లైంగిక వేధింపుల కేసుకు సంబంధించి హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన ఓ పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ఈ విధంగా వ్యాఖ్యానించింది.రాజస్థాన్‌లో ఓ మైనర్‌పై లైంగిక వేధింపుల కేసులో అరెస్టైన బాలుడు ఏడాదిగా కస్టడీలోనే ఉన్నాడు. ఈ పిటిషన్ ను జస్టిస్ అభయ్ ఎస్. ఓక్, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్లతో కూడిన సుప్రీం ధర్మాసనం విచారించింది. ఈ కేసులో బెయిల్ నిరాకరిస్తూ రాజస్థాన్ హైకోర్టు, జువెనైల్ జస్టిస్ బోర్డ్ ఇచ్చిన ఆదేశాలను సుప్రీం ధర్మాసనం పక్కన పెట్టింది. జువైనల్‌ను ఎటువంటి జామీను లేకుండానే బెయిల్‌పై వెంటనే విడుదల చేయాలని ఆదేశించింది. ఒకవేళ బెయిల్‌కు నిరాకరించాల్సి వస్తే.. అందుకుగల కారణాలను జువెనైల్ బోర్డు రికార్డు చేయాలని సర్వోన్నత న్యాయస్థానం పేర్కొంది.

## ఆ సత్తా హైదరాబాద్‌కు ఉంది

(మొదటి పేజీ తరువాయి)
ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగురోడ్డుతోపాటు హైదరాబాద్‌కు అన్ని అనుకూలతలే ఉన్నాయని రేవంత్‌రెడ్డి ఫాక్స్‌కాన్ ప్రతినిధులకు వివరించారు. హైదరాబాద్ అభివృద్ధిని మరింతగా పరుగులు పెట్టించేందుకు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు ఫ్యూచర్ సిటీ పేరుతో నాలుగో నగరాన్ని నిర్మిస్తున్నట్లు రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఫోర్త్ సిటీలో విద్య, వైద్యం, క్రీడ, ఎలక్ట్రానిక్స్-ఎలక్ట్రికల్, స్కిల్ డెవలప్‌మెంట్ విభాగాల్లో బహుముఖంగా అభివృద్ధి చేయనున్నామని చెప్పారు. ప్రస్తుత ప్రపంచానికి అవసరమైన నైపుణ్యాలను యువతకు అందించేందుకు యంగ్ ఇండియా స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీని ప్రారంభిస్తున్నామన్నారు. ఫోర్త్ సిటీ విజన్ అద్భుతంగా ఉందని అభినందన : స్కిల్ యూనివర్సిటీకి ఆనంద్ మహీంద్రను ఛైర్మన్‌గా, శ్రీనివాసరాజును వైస్ ఛైర్మన్‌గా నియమించామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం తరపున సంపూర్ణ సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఫోర్త్ సిటీలో పెట్టుబడులు పెట్టాలని ఫాక్స్‌కాన్‌ను ఆహ్వానించారు. పారిశ్రామిక అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ప్రోత్సాహకాలను, ఇటీవల అమెరికా, దక్షిణకొరియా పర్యటనల వివరాలను ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు ఫాక్స్‌కాన్ బృందానికి వివరించారు.

## మోగిన ఎన్నికల నగారా..

### జమ్మూ కశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల




**శ్రీనగర్:** దేశంలో మరోసారి ఎన్నికల నగారా మోగింది. పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. హర్యానా, జమ్మూ కశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలకు చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ షెడ్యూల్ విడుదల చేశారు. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం మూడు విడతల్లో పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1న జమ్మూ కశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. మొత్తం 90 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు. అక్టోబర్ 4న ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయి. ఇక హర్యానా అసెంబ్లీకి ఒకే దశలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. మొత్తం 90 స్థానాలకు అక్టోబర్ 1న అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ జరగనుంది. అక్టోబర్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు వెల్లడించనున్నారు. ఈ ఎన్నికల షెడ్యూల్ ప్రకటన సందర్భంగా చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ మాట్లాడుతూ.. '2024 లోక్‌సభ ఎన్నికలు ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ. ఆ ఎన్నికలు విజయవంతంగా, శాంతియుతంగా పూర్తయ్యాయి. దేశవ్యాప్తంగా యువత మొదలుకుని వృద్ధుల వరకు భారీ సంఖ్యలో తరలివచ్చి ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా జమ్మూకశ్మీర్ ఎన్నికల్లో అక్కడి ఓటర్లు ఎంతో చైతన్యం చూపించారు. ఈసారి వారు హింసను పక్కనపెట్టి ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకే మొగ్గు చూపారు' అని చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని రాజీవ్ కుమార్ తెలిపారు. 'జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. వాటిలో 74 జనరల్, ఎస్సీ-7, ఎస్టీ-9. జమ్మూ కశ్మీర్‌లో మొత్తం 87.09 లక్షల మంది (జులై 25 నాటికి) ఓటర్లు ఉంటారు. ఇందులో 44.46 లక్షల మంది పురుషులు కాగా, 42.62 లక్షల మంది మహిళా ఓటర్లు. ఇక 3.71 లక్షల మంది మొదటి సారి ఓటర్లు, 20.7 లక్షల మంది యువ ఓటర్లు' అని రాజీవ్ కుమార్ వివరించారు. ఓటర్ల తుది జాబితాను 19న అమర్‌నాథ్ యాత్ర ముగిన తర్వాత ఆగస్టు 20న ప్రకటించనున్నట్లు తెలిపారు.

# నాణ్యమైన వస్తువులు సరఫరా చేయండి

○ లేకపోతే తప్పిస్తాం.. ○ అంగన్‌వాడీల సప్లయర్లను హెచ్చరించిన మంత్రి సీతక్క

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యత లేని వస్తువులు సరఫరా చేస్తే కాంట్రాక్టులను రద్దు చేస్తామని మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క హెచ్చరించారు. అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన గుడ్లు, వస్తువులు సరఫరా చేయండి.. లేకపోతే తప్పుకొండి.. లేనీ పక్షంలో తామే తప్పిస్తామని సీతక్క ఆదేశాలు జారీ చేశారు.అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా అవుతున్న ఆహార పదార్థాలు, కోడి గుడ్లు నాణ్యత పెంపు కోసం సప్లై కాంట్రాక్టర్లతో మంత్రి సీతక్క, శాఖ కార్యదర్శి వాకాటి కరుణ, కమిషనర్ కాంతి వెస్లీ తో కలిసి శుక్రవారం సచివాలయంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన సీతక్క అంగన్‌వాడీ కేంద్రాలకు పేద పిల్లలు వస్తారని, వారికి పోషకాహారం అందించాల్సిన బాధ్యత తమ ప్రభుత్వానికి ఉందని గుర్తు చేశారు. అందుకే అంగన్‌వాడీ కేంద్రాలకు నాణ్యమైన వస్తువులు సరఫరా చేయాలని తేల్చి చెప్పారు. నాణ్యమైన గుడ్లు సరఫరా చేయటం లేదని వార్తలు రావడంపై సప్లయర్ల వివరణ కోరారు. అంగన్‌వాడీ సెంటర్లకు సంబంధించి విమర్శలు భరించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా లేదని , అందుకే సప్లయర్లంతా నాణ్యత ప్రమాణాలను పాటిస్తూ గుడ్లు ఆహార వస్తువులను సరఫరా చేయాలని ఆదేశాలు జారీ చేశారు. నాణ్యమైన వస్తువులు సరఫరా చేయకపోతే ఒప్పందాలను రద్దు చేసుకొని కాంట్రాక్ట్ నుంచి తప్పిస్తామని మంత్రి హెచ్చరించారు.

బీఆర్ఎస్ హయాంలో కాంట్రాక్ట్ కుదుర్చు కున్న సప్లయర్లే ఇప్పటికీ కోడిగుడ్లు సరఫరా చేస్తున్నారనీ,



తాము సప్లయర్లను మార్చలేదనీ, అందుకే సప్లయర్లు మరింత శ్రద్ధతో మంచి గుడ్లను సరఫరా చేయాలనీ సూచించారు. మీ తీరు సరిగా లేకపోవడం వల్ల ప్రభుత్వం బదనాం కావాల్సి వస్తుందని, తీరు మార్చకపోతే పక్కన పెట్టాల్సిన అవసరం వస్తుందని మంత్రి హెచ్చరించారు. నాసిరకం గుడ్లు సరఫరా చేస్తున్నారన్న వార్తలు ఎందుకు వస్తున్నాయని మంత్రి సరఫరాదారులను ప్రశ్నించారు. అయితే ఏ ఒక్క అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్ల విషయంలో సమస్యలు ఉత్పన్నం కావట్లేదని, కేవలం టేక్ హోమ్ రేషన్ లో భాగంగా ఇంటికి తీసుకు వెళుతున్న గుడ్లవల్లనే సమస్యలు తలెత్తుతున్నాయని వారు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గుడ్లను ఇంటికి తీసుకెళ్ళిన తర్వాత సకాలంలో వాడకుండా చాలా రోజుల తర్వాత వినియోగించడం వల్ల గుడ్లు మురిగిపోతున్నాయని తెలిపారు. ఈ సమస్య ఉత్పన్నం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని సిబ్బందిని మంత్రి ఆదేశించారు. సకాలంలో గుడ్లను వినియోగించుకునే విధంగా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. గాలి, వెలుతురు సోకేలా అంగన్‌వాడీ సెంటర్లలో గుడ్లను నిల్వచేసే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. టేక్ హోమ్ రేషన్ కారణంగా ఎదురవుతున్న సమస్యలను అధిగమించేలా ఆ పథకంలో సంస్కరణలు తీసుకురావాలని మంత్రి చెప్పారు. అంగన్‌వాడీ టీచర్లు సిబ్బంది మరింత క్రియాశీలకంగా పనిచేయాలని, నాణ్యత లేని వస్తువులను తిరస్కరించాలనీ, లేకపోతే చర్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

పెరిగిన రేట్ల కనుగుణంగా కోడిగుడ్ల రేట్లను పెంచాలని, గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఉన్నట్లుగా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి త్వరగా బిల్లు చెల్లించాలని సప్లయర్లు కోరగా ధరలు పెంచేందుకు మంత్రి సీతక్క ససేమిరా అన్నారు. ఒప్పంద పత్రాల్లో కుదుర్చుకున్న నిబంధనలను కాదని ధరలు పెంచే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో అంగన్వాడీల బిల్లుల చెల్లింపు కోసం గ్రీన్ ఛానల్ ఉండేదని.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విధానాన్ని రద్దు చేశారని.. గత పది ఏళ్లలో పూర్తిగా ఈ వ్యవస్థ గాడి తప్పిందన్నారు. క్షేత్రస్థాయిలో కొంతమంది తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, వారు చెప్పినట్టు నడుచుకోకపోతే తమపై తప్పుడు వార్తలు రాస్తున్నారని కాంట్రాక్టర్లు వాపోయారు. నిజంగా తప్పు లేనప్పుడు తప్పుడు వార్తలు రాస్తే చర్యలకు ప్రభుత్వం వెనకాడదని మంత్రి స్పష్టం చేశారు.

# ఎల్ఆర్ఎస్ అనుమతులపై ప్రభుత్వం స్పష్టత

○ రాష్ట్రంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు గ్రీన్ సిగ్నల్

**విశ్వంభర ,తెలంగాణ బ్యూరో :** రాష్ట్ర ప్రభుత్వం ఎల్ఆర్ఎస్ అనుమతులపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్రంలో అక్రమ లేఅవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం నియమ నిబంధనలతో ఉత్తర్వులను చేసింది. 2020లో జారీ చేసిన జీవో 131, జీవో 135 ప్రకారం అమలు చేయనుంది. 2020 ఆగస్టు 26 కంటే ముందు రిజిస్టర్ చేసిన లేఅవుట్లకు మాత్రమే ఎల్ఆర్ఎస్ వర్తిస్తుందని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2020 అక్టోబరు 15వ తేదీలోపు స్వీకరించిన దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ప్రధాన కార్యదర్శి స్పష్టం చేశారు. నియమ నిబంధనలు 2020లో విడుదల చేసినప్పటికీ ఈ ఏడాది జనవరిలో దరఖాస్తుల పరిశీలన మొదలైందని తెలిపారు. ఇప్పటి వరకు 4,28,832 దరఖాస్తులు ప్రాసెస్ చేసినట్టు అధికారులు తెలిపారు.

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల్లో 60,213 దరఖాస్తులు ఆమోదం పొందగా రూ.96.60 కోట్లు వసూలైనట్టు వివరించారు. దాదాపు 75శాతం దరఖాస్తులకు



సంబంధించి పూర్తి వివరాలు సమర్పించలేదన్నారు. తగిన డాక్యుమెంట్లు లేవని దరఖాస్తుదారులకు ఇప్పటికే తెలియజేశామని, వాటిని అప్ లోడ్ చేయడం కుదరకపోగా, సకాలంలో ప్రాసెస్ చేయలేకపోయామన్నారు. మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, నగరాభివృద్ధి సంస్థలు, జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో హెల్ప్ డెస్కులు ఏర్పాటు చేసినట్టు చెప్పారు. డాక్యుమెంట్లు అందజేసేందుకు దరఖాస్తుదారులకు అవకాశం కల్పించామని, సేల్ డీడ్, ఈసీ, మార్కెట్ విలువ సర్టిఫికెట్, లేఅవుట్ కాపీలను అప్ లోడ్ చేయవచ్చని పురపాలకశాఖ ప్రధాన కార్యదర్శి వెల్లడించారు. దరఖాస్తుదారులు తమ మొబైల్ నంబర్, చిరునామా ఇతర వివరాలను మొబైల్ నెంబర్ ఓటీపీ ఉపయోగించుకుని సవరించుకోవచ్చన్నారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు సందేహాలుంటే హెల్ప్ డెస్క్‌ను సందర్శించి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

# నగరంలో రూ.4 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం

○ ఆన్‌లైన్ వేదికగా గంజాయి చాక్లెట్లు విక్రయిస్తున్న ముఠా అరెస్టు

**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి ఆదేశాలతో పోలీసులు డ్రగ్స్ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నారు. సోదాలు విస్తృతం చేశారు. శుక్రవారం ఒక్కరోజే మూడు ప్రాంతాల్లో మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. రాజస్థాన్ నుంచి కారులో మాదక ద్రవ్యాలు తీసుకొచ్చి విక్రయిస్తున్న ముఠాను హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేశారు. రాజస్థాన్‌కు చెందిన ముగ్గురు సరఫరాదారులను అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.4 కోట్ల 30 లక్షల విలువైన 620 గ్రాముల హెరాయిన్ పేస్ట్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఘట్‌కేసర్‌లోని ఓ ఎలక్ట్రిక్ షాప్ వేదికగా డ్రగ్స్ విక్రయిస్తుండగా, నిందితులతో పాటు ఐదుగురు కొనుగోలుదారులను అరెస్టు చేశారు.

**గంజాయి చాక్లెట్ల గుట్టురట్టు..**

ఆన్‌లైన్ వేదికగా జరుగుతున్న గంజాయి చాక్లెట్ల వ్యాపారానికి తెలంగాణ పోలీసులు చెక్ పెట్టారు. గంజాయి చాక్లెట్లు తయారు చేస్తున్న 8 కంపెనీలను గుర్తించి నోటీసులు ఇచ్చారు. ఈకామర్స్ వెబ్‌సైట్ ఇండియా మార్ట్ ద్వారా రాష్ట్రానికి గంజాయి చాక్లెట్లు సరఫరా అవుతున్నట్లు గుర్తించిన తెలంగాణ యాంటీ నార్కొటిక్ బ్యూరో అధికారులు, వ్యూహాత్మకంగా వ్యవహరించారు. కేంద్ర ఆధీనంలోని ఎన్‌సీబీతో కలిసి, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్‌లలోని 8 కంపెనీలను మూయించి, ఇద్దరు యజమానులను అరెస్టు చేశారు.

కర్మాగారాల్లో సోదాల సమయంలో సేకరించిన నమూనాలను, ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించారు. నివేదికలు



వచ్చాక తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ 8 కర్మాగారాల్లో గంజాయి చాక్లెట్లు తయారు చేస్తున్నట్లు గుర్తించిన అధికారులు, ఇండియా మార్ట్ ద్వారా ఆర్డర్ చేస్తే కొరియర్ ద్వారా డెలివరీ చేస్తున్నట్లు పక్కా ఆధారాలు సేకరించారు. ఈ నేపథ్యంలో ఇండియా మార్ట్‌కు టీజీ ఏఎన్‌బీ నోటీసులు పంపించింది. దీంతో స్పందించిన ఆ సంస్థ, ఈ తరహా ఉత్పత్తులన్నింటినీ తమ వెబ్‌సైట్ నుంచి వెంటనే తొలగించింది. అలాగే వీటిని డెలివరీ చేసిన కొరియర్ సంస్థలనూ బాధ్యుల్ని చేస్తూ నోటీసులు ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు.

**కూకట్‌పల్లిలో డ్రగ్స్ స్వాధీనం..**

మరో ఘటనలో బెంగూళూరు నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా డ్రగ్స్‌ను సరఫరా చేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఎస్‌టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. కర్ణాటకకు చెందిన పీవీ రాహుల్, మహేశ్ అనే ఇద్దరు వ్యక్తులు, కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన వ్యక్తులకు అందించడానికి తీసుకువస్తున్న 29.6 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్స్‌ను డీఎస్పీ తుల శ్రీనివాసరావు పర్యవేక్షణలో పట్టుకున్నారు. ఈ కేసులో నితిన్ రెడ్డికి, నైజీరియాకు చెందిన జాక్సన్ అనే వ్యక్తులకు ప్రమేయం ఉందని పోలీసులు తెలిపారు. పట్టుబడ్డ డ్రగ్స్ విలువ రూ.4.50 లక్షలు ఉంటుందన్నారు.

**నాటు సారా తయారీ బెల్లం పట్టివేత..**

మరో కేసులో కొల్లాపూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నాటుసారా తయారు చేయడానికి కర్ణాటక నుంచి వాహనంలో తరలిస్తున్న బెల్లం, ఆలంను పట్టుకున్నట్లు పేర్కొన్నారు. రూ.1.20 లక్షల విలువ చేసే బెల్లం, ఆలంతో పాటు వాహనం విలువ రూ.15 లక్షల మేరకు ఉంటుందన్నారు. ఆగస్టు 31 నాటికి తెలంగాణలో అన్ని జిల్లాల్లో నాటు సారాను లేకుండా చేయడంతో పాటు, హైదరాబాద్‌లో ఆపరేషన్ ధూల్‌పేట్ పేరుతో గంజాయి అమ్మకాలపై ఉక్కు పాదం మోపుతున్నామని అన్నారు.

# ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్న ఎంపీఎస్‌ఓ వనిత



**విశ్వంభర, ఎల్బీనగర్:** హైదరాబాద్ జిల్లా బహుదూర్ పుర మండలంలో మండల ప్లానింగ్ స్టాటస్టికల్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న ఏ. వనిత స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని వారి శాఖలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకుగాను హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి చేతుల మీదుగా ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వనిత మాట్లాడుతూ అవార్డు రావడం పట్ల ఎంతో సంతోషాన్నిచ్చిందని, అదేవిధంగా పని పట్ల మరింత బాధ్యత పెరిగింది అన్నారు. అవార్డు రావడానికి సహకరించిన హైదరాబాద్ జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి డాక్టర్ సురేందర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

# ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ కు జిల్లాలో విశేష స్పందన

**- కలెక్టర్ రాహుల్ రాజ్**

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామస్థాయి నుండి కొత్త ఆవిష్కరణలు వెలికి రావడం సంతోషకరమని ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్టుకు జిల్లాలో మంచి స్పందన లభిస్తుందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. మెదక్ జిల్లాలో 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల కార్యక్రమంలో, గ్రామ స్థాయి నుండి నూతన ఆవిష్కరణలను వెలికి తీయడానికి ఏర్పాటు చేసిన ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ మంచి స్పందన తెచ్చుకుంది. ఈ ప్రాజెక్ట్ను గ్రామ స్థాయిలో విస్తరించేందుకు జిల్లా అధికారులు ఎంతో కృషి చేశారని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పేర్కొన్నారు. శుక్రవారం ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై కలెక్టర్ మాట్లాడారు. ఈ ఏడాది ఇంటింటా ఇన్నోవేటర్ 2024 ప్రాజెక్ట్ రాష్ట్ర వ్యాప్తంగా 560 పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. వీటిలో 170 కి పైగా ఆవిష్కరణలు ఎంపికయ్యాయని చెప్పారు. మెదక్ జిల్లాకు చెందిన 14 అప్లికేషన్లలో 09 మంది ఆవిష్కర్తలు రాష్ట్ర స్థాయిలో సెలెక్ట్ అయ్యాయని వివరించారు. ఈ సెలెక్ట్ అయిన ఇన్నోవేటర్స్కి రాష్ట్ర ప్రభుత్వం ప్రశంసా పత్రం అందించగా, ప్రతి ఒక్కరికీ 1000/ నగదు పురస్కారం కలెక్టర్ రాహుల్ రాజ్ అందించి ప్రోత్సహించామన్నారు. ఈ ఇంటింటా ఇన్నోవేటర్ ప్రాజెక్ట్ ద్వారా గ్రామస్థాయి నుండి కొత్త ఆవిష్కరణలు వెలికి రావడం సంతోషకరం అని చెప్పారు. ఈ ప్రాజెక్ట్ ప్రాముఖ్యతను ప్రజలు గుర్తించి పాల్గొనడం అనేది జిల్లా అభివృద్ధికి చాలా కీలకం అని అన్నారు. ఎంపికైన ఆవిష్కరణలు సమాజానికి ఉపయోగపడే విధంగా మారాలని ఆకాంక్షించారు.

# కురులతోనే మనిషికి అందం

○ కేశ సంరక్షణపై యువత దృష్టి పెట్టాలి : బాలీవుడ్ హెయిర్ స్టైలిస్ట్ హబీబ్ అహ్మద్

**విశ్వంభర, హైదరాబాద్ :** కురులతోనే వ్యక్తుల అందం ఇమిడివుందని అని బాలీవుడ్ హెయిర్ స్టైలిస్ట్ హబీబ్ అహ్మద్ అన్నారు. యువతి, యువకులకు కేశ సంరక్షణపై దృష్టి పెట్టాలని సూచించారు. హైదరాబాద్ శేరిలింగంపల్లిలోని నల్లగండ్ల రోడ్ ఫ్లైఓవర్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన హాబీబ్ హెయిర్, బ్యూటీ సెలూన్‌ను హబీబ్ అహ్మద్, అమన్ అహ్మద్, శ్రితి లడ్డా, ప్రశాంత్ లడ్డా, విశాల్ వర్మ, గౌతం మంఘాని (తెలంగాణ, ఆంధ్ర మాస్టర్ ఫ్రాంచైజర్)తో కలిసి ప్రారంభించారు. అనంతరం కేశ సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలను హాబీబ్ అహ్మద్ వివరించారు. పౌష్టిక ఆహారం, సరైన నిద్ర, విశ్రాంత జీవనం, మానసిక ఆనందం, శారీరక వ్యాయామం, యోగ, ధ్యానం వంటివి కురులపై ప్రభావం చూపుతాయని పేర్కొన్నారు. తద్వారా నడి వయసులో కేశాలు పటిష్టంగా వుంటాయన్నారు. తాము కురులు సంరక్షణకు



నాణ్యమైన సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు. బ్యూటీకి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్‌గా మారిందని హబీబ్స్ హెయిర్ అండ్ బ్యూటీ వ్యవస్థాపకుడు అమన్ హబీబ్ అన్నారు. మగువల శరీరాకృతి, శిరోజాల సంరక్షణ విషయంలో రాజీపడరని శ్రితి లడ్డా, ప్రశాంత్ లడ్డ అన్నారు.








# అపూర్వ సంగమం.. అద్భుత సత్కారం

## తనికెళ్ల భరణికి ఎస్ ఆర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం

## హైదరాబాద్ రవీంద్రభారతి వేదికగా సన్మానించిన "సంగమం" సంస్థ

**అంతర్జాతీయంగా పేరొందిన హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు ఎన్నో..ఎన్నెన్నో..అయితే 2024 ఆగస్టు 15న తనికెళ్ల భరణి గారికి జరిగిన సన్మానం చరిత్రలో నిలిచిపోతుంది. తనికెళ్ల భరణి గారికి ఎస్ ఆర్ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిన సందర్భంగా సంగమం సంస్థ ఆయనను అపూర్వ రీతిలో సత్కరించింది. సినీ రంగ ప్రముఖులు, కళాకారులు, తెలుగునాట ప్రసిద్ధి చెందిన వ్యాఖ్యాతలు, రచయితలు,, రచయిత్రులు.. నదులన్నీ సాగరాన్ని చేరినట్లు.. తనికెళ్ళ భరణి గారి అభిమానులు, శిష్యులు, వారి ప్రోత్సాహంతో అత్యంత ఉన్నతికి చేరిన వారి ప్రసంగాలు వింటుంటే .... ఇది కదా! మానవ జన్మకు సార్ధకత అనిపించక తప్పదు.**











వేదమంత్రాలతో, నాట్య కళాకారులచే, అభిమానులు వెంట రాగా పూర్ణకుంభ స్వాగతంతో రవీంద్ర భారతి లో అడుగుపెట్టిన తనికెళ్ల భరణి వేదికను చేరిన తర్వాత వేదిక ఎదురుగానున్న మొదటి వరుసలో కూర్చున్నారు. అదే వరుసలో వివిధ సినీ కళాకారులకు పేరుపేరునా పేరు వ్రాసి సీటు రిజర్వ్ చేయగా ప్రెస్ కు ప్రత్యేకంగా సీట్లు కేటాయించారు. మిగిలిన సీట్లన్నీ అభిమానులతో నిండిపోయాయి. జ్యోతి ప్రజ్వలన అనంతరం, ప్రఖ్యాత వ్యాఖ్యాత సుష్మ కార్యక్రమాన్ని ఆద్యంతం అద్భుతంగా నిర్వహించడం... ప్రారంభంగా తాను శాస్త్రీయ సంగీత ప్రవేశమున్న కళా కారిణిగా వినాయక స్తోత్రం, శ్రీరామ స్తోత్రం తో ప్రేక్షకులను ఆకర్షించింది.

మొట్టమొదటగా బెరహంపూర్ నుండి విచ్చేసిన ప్రముఖ కూచిపూడి నాట్య కళాకారిణి, దేశ విదేశాల్లో పేరుగాంచిన రింగ్ డాన్సర్, ఢిల్లీలో రాష్ట్రపతి భవన్ లో రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి రాష్ట్రపతి గారి ప్రశంసలు అందుకున్న, ఆంధ్రప్రదేశ్ కల్చరల్ అంబాసిడర్ గా సేవలందించిన అతిపిన్న వయసుకురాలు జవ్వాది అంబికా రాజీవ్ దాసరి రింగ్ డాన్స్ తో వేదిక ముప్పై నిమిషాలు ప్రేక్షకులు కనురెప్ప వేయకుండా చూసేలా తన నలుగురు శిష్య బృందంతో చేసిన అభినయం ఆద్యంతం కరతాళ ధ్వనుల తో ప్రశంసలు అందుకున్నది.

ఆ తర్వాత 60 మంది బాలబాలికలచే చక్కటి సంగీత స్వరంతో తనికెళ్ల భరణి గారి పై వ్రాసిన గీతాలాపన సభా వేదికకు నిండుతనం, భావి భారత పౌరులను తీర్చిదిద్దుతున్న రచయిత, సంగీత కళాకారులను అభినందింప చేయడమే గాక వన్స్ మోర్ అనిపించుకుంది. ఒకప్పుడు పల్లెటూర్లలో డ్రామాలకు ఉండే ఆదరణ సందర్భంగా వాడే పదం వన్స్ మోర్ .సత్య హరిచంద్ర, పాండవ ఉద్యోగ విజయాలు, శ్రీ రామాంజనేయ యుద్ధం, లవకుశ, తులసి జలంధర... మొదలగు ఎన్నో డ్రామాలు అలనాడు.. ప్రముఖ పాత్రధారులు గాత్ర సౌరభాన్ని మరల మరల వినాలనుకుని, ఈలలు వేసి కోరుకున్నట్లు తనికెళ్ల భరణి గారి పై పాడిన గీతాలాపనకు వన్స్ మోర్ అని యాంకర్ స్వప్న చెప్పడంతో... ప్రేక్షకులు ఆనందపరవశులయ్యారు. తన్మయంతో భరణి గారి వ్యక్తిత్వ జీవన వికాస నేపథ్యాన్ని సంగీతబద్ధంగా విని ఆనందించి, చిన్నారులకు ప్రేక్షకులు అభినందించిన తీరు మాటల్లో చెప్పలేము.

అసలు మనిషికి ఏం కావాలి? ఎంత కావాలి? అర్జించిన సంపదకు తృప్తి ఉందా! ఉంటుందా? కేవలం ధనార్జనే ప్రధానమా !? అయితే సంపదలు వివిధ రూపాల్లో వారి వారి స్థాయిని బట్టి చేరతాయి. శాశ్వతమైనది... మనం.. మన తోటి వారిని.. ముఖ్యంగా కళాకారుడై యుండి.. కళాకారుడిగా.. జీవితంలో ఒక దశలో కాకతాళీయంగా, ప్రణాళికబద్ధంగా, అభిమాన పూర్వకంగా ప్రవేశించి... ఎందరో కళాకారులను... అంచెలంచెలుగా.. చూడగానే చటుక్కున... వారిలోని కళా విశిష్టతను గుర్తించి, వెన్ను తట్టి ప్రోత్సహించి.. శిఖరాలకు చేరేటట్లు.. మొదటి అడుగులు అందించిన తనికెళ్ల భరణి గారిని స్మరించుకున్న తీరు మాటల్లో వర్ణించశక్యమా?

డాక్టర్ కె. వి. రమణాచారి గారు, కళాబ్రహ్మ వంశీ రామరాజు గారు అనేక వందల వేల సభలు నిర్వహించి ఉంటారు. సభ నిర్వహణలో తెలుగు వారందరికీ వీరిద్దరూ మనసుల్లో మెదులుతారు. అయితే సంగమం సంస్థ కూడా చాలా ఉన్నత సాంప్రదాయాలతో అత్యంత క్రమశిక్షణతో సభ నిర్వహించి, అతిథులకు, ప్రేక్షకులకు ఏర్పాట్లు చేసిన తీరు అభినందనీయం.

వంశీ రామరాజు గారు ఈ కార్యక్రమానికి రవీంద్ర భారతి సభా ప్రాంగణాన్ని అడుగుపెట్టగానే, మొదటి వరుసలో కూర్చున్న సన్మాన గ్రహీత తనికెళ్ల భరణి గారు లేచి నిలబడి ఆలింగనం చేసుకోగానే.... మరుక్షణంలో రామరాజు గారు.. ప్రేమతో తెచ్చిన సాంప్రదాయ తెలుగు కండువా కప్పడంతో ఆశ్చర్యం వెలిబుచ్చారు భరణి.. ఇదేమిటి?.. తర్వాత సన్మాన సందర్భంగా ఇవ్వవచ్చు కదా!! అని నోటితో ప్రశ్నించకుండా కళ్ళతో రామరాజు గారి వైపు చూశారు.ఇద్దరూ ఆత్మీయంగా నవ్వుకున్నారు. అయితే వంశీ రామరాజు గారి ప్రత్యేకత సన్మానం" చేయడంలో తానే ప్రథముడు, ప్రత్యేకత కలిగిన వాడు అంటూ తెలుగు ప్రజలందరి మనసుల్లో తన ముద్రను, చిరకీర్తిని కలిగిన వారు. ఉన్న కొద్ది క్షణాల్లో తన శైలిని ప్రదర్శించి... తన పేరు రాసి ఉన్న సీటులో ఆసీనులయ్యారు.

ఇలా ప్రతి ఒక్కరు... ప్రఖ్యాత నాట్య కళాకారిణి, శంకరాభరణం ఫేమ్ సినిమా నటి మంజు భార్గవి, సెన్సేషనల్ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ, తెలుగు పాటకు నేషనల్ అవార్డు అందుకున్న సుద్దాల అశోక్ తేజ, ఒకనాడు తన వ్యాఖ్యా నాలతో ఉభయ తెలుగు రాష్ట్రాలను ఉర్రూతలూగించిన యంగ్, డైనమిక్, లవ్లీ ఝాన్సీ, ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్, తెలుగు సినిమా దర్శకులు రచయితలు, సంగీత దర్శకులు వారి వారికి కేటాయించిన సీట్లలో ఆసీనులైనారు. బయట విపరీతమైన వర్షం కురుస్తున్నా సభ వాతావరణం ప్రేక్షకులను మహదానంద భరితులను చేసింది.

తనికెళ్ల భరణి గారికి కనకాభిషేకం, భారీ పూలదండలు, శాలువాలు, పాదాభివందనాలు, ఆత్మీయ ఆలింగనాలు అటు ఉంచితే... వారి వారి ఆత్మీయ అనురాగ ప్రసంగాలు ఆయనను తన్మయుడిని చేశాయి.

ఇది కదా! కళాకారుని జీవిత సాఫల్యం !! అనిపించింది ప్రేక్షకులకు. ఒక్క మాటగా, భార్యను వేదిక మీదకు పిలిపించి, తన ప్రక్కన ఆసీనురాలు అయ్యేటట్లు చేసి... నాకు వచ్చిన డాక్టరేట్‌ను నా భార్యకు అంకితం చేశాను అనగానే సభలో కరతాళధ్వనులు మిన్నంటాయి. కుటుంబ వ్యవస్థ లో ప్రతి పురుషుని విజయం వెనుక భార్య, స్త్రీ మూర్తికి ఇచ్చిన గౌరవం సాంప్రదాయక విశిష్టతను సభాముఖంగా చాటింది. కుమారుడు తేజ నాన్నగారి మీద చేసిన ఆంగ్ల ప్రసంగం వేగంగా చదివినా స్పష్టత, శైలి, కుటుంబంలో తండ్రి పాత్ర, తండ్రి నుండి తాను నేర్చుకున్న తీరు, తండ్రి పట్ల గౌరవం, శ్రద్ధ, తన భావికి మార్గదర్శనాన్ని తెలియజెప్పింది. ఇదంతా ఒక ఎత్తు అయితే తన కుమారుడుని నాన్నగారు ( అంటే తాతగారు) మనవడిని ఎత్తుకొని 60 మంది బాలబాలికల మధ్య సంతోషంగా ఫోటో తీయించుకున్న వైనం... భారతీయ సాంప్రదాయ వ్యవస్థలోని ముద్దు ముచ్చట్లను ఒక్క ముక్కలో చెప్పిన తీరు ఆంగ్లంలో అయినా, ఆత్మీయ అనుభవాన్ని వెల్లడించిన తీరు ప్రేక్షకులను కదిలించింది.

**సభా నిర్వహణ అద్భుతంగా సాగించిన సంగమం సంస్థను అభినందించాలి.**

ఆత్మీయంగా విచ్చేసిన అభిమానులకు, శిష్యులకు, కళాభిమానులకు, వ్యక్తిగత స్నేహ హస్త, చేయూత నిచ్చే స్వభావులందరికీ స్వభావులందరికీ ఇది, సన్మానం గా భావించి, రవీంద్ర భారతి వేదిక సాక్షి గా నిలిచిందనడంలో అతిశయోక్తి లేదు. శుభం భూయాత్.

**- నులు శ్రీరామచంద్రరావు**
**8453814659**

# ఈశాన్యభారతంలో సరిహద్దుల సమస్యలు




ఇటీవల అస్సాం, మిజోరాం రాష్ట్రాల మధ్య జరిగిన వివాదంలో పోలీసులు వీర మరణం పొందడం దేశంలో తీవ్ర చర్చకు దారితీసింది. ఆగ్నేయ ఆసియాకు ముఖద్వారంగా ఉన్న ఈశాన్య భారతం అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. సరిహద్దు వివాదాలు ఈశాన్యంలో కొత్తవి కాదు. అనేకసార్లు వివిధ రాష్ట్రాల మధ్య ఈ సమస్య ఉత్పన్నం అవుతూనే ఉంది . వీటికి తోడు గిరిజన తెగల వివాదం, నాగాలాండ్ మణిపూర్ రాష్ట్రంలో ప్రత్యేక దేశం కోసం పోరాటాలు, బాంగ్లాదేశ్, మయన్మార్ దేశం నుంచి ఉగ్రవాద చర్యలు ఇలా అనేకానేక సమస్యలతో ఈశాన్యం అభివృద్ధికి దూరంగా సమస్యల విలయంగా మారింది. తాజాగా వచ్చిన ఎన్.ఆర్.సి వివాదం కూడా ఈశాన్య రాష్ట్రాల్లో కొత్త వివాదానికి తెర లేపింది. అసలు ఈశాన్య భారతంలో రాష్ట్రాల మధ్య ఎందుకు సఖ్యత లేదో ..?? ఈ సమస్యలను ఏ విధంగా ప్రభుత్వాలు పరిష్కరిస్తున్నాయో తెలుసుకుందాం.

ఇప్పుడు చూస్తున్న ఈశాన్య భారతం చిత్రపటానికి స్వాతంత్య్రం రాకముందు ఉన్న చిత్రపటానికి మధ్య చాలా మార్పులు చోటుచేసుకున్నాయి. ఈశాన్యం గురించి చదవాలంటే అస్సాం రాష్ట్రాన్ని క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది . ఈశాన్యంలో ఇప్పుడు ఉన్న 7 రాష్ట్రాలు అన్ని కూడా ఒకప్పుడు అస్సాం రాష్ట్రంలోనే అంతర్భాగం గా ఉండేవి . ఈశాన్య భారతం మొత్తం లోయలు , కొండలు , తూర్పు హిమాలయాలతో బ్రహ్మపుత్ర , బరాక్ నదుల అనుసందానంతో పచ్చని నెలలతో అద్భుతంగా ఉంటుంది . బ్రటిష్ ప్రభుత్వ హయాంలో ఈశాన్య భారతాన్ని వెనక పడేయబడ్డ ప్రాంతంగా గుర్తించి ఒక ఐసోలేటెడ్ రీజియన్‌గా మార్చేశారు . ఇక్కడి ప్రజల సంస్కృతిని , కళా రూపాలను అణచివేయడం జరిగింది . సతత హరిత అడవులు ఉండడం వలన బ్రిటిష్ ప్రభుత్వం 1870 లో , 1923 , 1927 లో అటవీ చట్టాలను తీసుకువచ్చి గిరిజన తెగలను అడవిలోకి ప్రవేశించడం నిషేధించి, వ్యాపారం పై బ్రిటిష్ ప్రభుత్వం దృష్టి సారించింది. దీని వలన అనేక మంది గిరిజనలు వారి ఉపాధిని కోల్పోయి అడవుల్లోనే ఉండిపోయారు . భౌగోళికంగా , విద్య , ఆర్థికంగా ఇక్కడి గిరిజనులను వెనుకబాటుకు గురిచేశారు . బెంగాల్ ఈస్టర్న్ ఫ్రాంటియర్ చట్టం 1872 ప్రకరాం భారతదేశంలోని ప్రజలు ఎవరైనా ఈశాన్యం లో ప్రవేశించాలంటే అనుమతి తప్పని చేసారు . ఇప్పటికి దీనిని ఇన్నర్ లైన్ పర్మిట్ గ 4 ఈశాన్య రాష్ట్రాల్లో అమలులో ఉంది. దీని వలన భారతదేశంలో అంతర్భాగమైనప్పటికీ ఒక రకమైన వివిక్త చూపడం వలన ఈశాన్యం ఆది నుంచి వెనుకబాటుకు గురైంది

1961 నుండి ఈశాన్య భారత చిత్రపటంలో మార్పులు చోటుచేసుకున్నాయి . మొట్టమొదట నాగ కొండలను వేరు చేస్తూ నాగాలాండ్ రాష్ట్రం ఏర్పాటు జరిగింది . ఆ తర్వాత మణిపూర్ , మేఘాలయ , అరుణాచల్ ప్రదేశ్ , మిజోరాం , త్రిపురాలు ఏర్పాటయ్యాయి . అస్సాం రాష్ట్రం ఈశాన్య రాష్ట్రాలన్నిటితో సరిహద్దు కలిగి ఉండడం విశేషం. ఇక్కడి ప్రజల సంస్కృతీ , గిరిజనుల సంరక్షణ కోసం మన రాజ్యాంగం లో ప్రత్యేకంగా 6 వ షెడ్యూల్ లో షెడ్యూల్డ్ ప్రాంతాల పరిపాలన గురించి వివరించడం జరిగింది. అధికారణాలు 371 -ఎ నుండి 371 - ఐ వరకు ప్రత్యేక నిబంధనలను మన రాజ్యాంగం లో చేర్చడం జరిగింది . అనేక ప్రభుత్వాలు మారుతున్న ఈ ప్రాంతాల సమస్యలు అలానే ఉండిపోయాయి . ఈశాన్య రాష్ట్రాల విభజన సరిగ్గా జరగకపోవడం వలనే ఈ సమస్యలు తలెత్తాయి . కొండలు లోయలు ఉండడం వలన అనేక గిరిజన తెగలు వలసలు చేయడం జరిగింది . దీని వలన కొన్ని రాష్ట్రాల్లో తెగల మధ్య వివాదాలు చెలరేగి అవి చివరికి దేశ అంతర్గత భద్రతకు పెద్ద ముప్పుగా మారింది . అనేక గిరిజన తెగలు వారి స్వంత బలంతో బలగాలను ఏర్పాటు చేసుకొని ప్రభుత్వాలపై తిరుగుబాటు చేయడం మొదలుపెట్టాయి . అస్సాంలో బోడో నేషనల్ ఫ్రంట్ (బీఎన్‌శ్ఎఫ్) , మణిపూర్ లో కుకీ నేషనల్ ఫోర్స్ (కేఎన్ఎఫ్), పీపుల్స్ లిబరేషన్ ఆర్మీ (పీఎల్ఎఫ్) , త్రిపురలో త్రిపుర టైగర్ ఫోర్స్ (ఏటీటీఎఫ్) , నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ అఫ్ త్రిపుర(ఎన్ఎల్ఎఫ్‌టీ) , నాగాలాండ్ లో నేషనల్ సోషలిస్ట్ కౌన్సిల్ ఆఫ్ నాగాలాండ్ (ఎన్ఎస్‌సీఎన్-ఐఎం) లాంటి అనేక స్వంత తిరుగుబాటు దళాలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దేశ అంతర్గత భద్రత విషయమై ప్రాముఖ్యత చోటు చేసుకుంది. అస్సాం రాష్ట్రం లోనే (బోడోలాండ్ సమస్య) అస్సాం మణిపూర్ మధ్య (కుకీ , మెయితి తేగల సమస్య) , అస్సాం మేఘాలయ మధ్య (గారో , కాసి తేగల సమస్య) , అస్సాం నాగాలాండ్ మధ్య (నాగలిం) సమస్య ఇలా అనేక సరిహద్దు సమస్యలతో ఈశాన్య భారతం సరిహద్దు సమస్యల వలయం గా మారింది .

మొన్న జరిగిన అస్సాం మిజోరాం మధ్య జరిగిన సమస్య కూడా ఎప్పటినుండో రగులుతున్నదే . లుశాయి కొండలను వేరు చేస్తూ మిజోరాం రాష్ట్రం ఏర్పాటు చేయడం జరిగింది . అస్సాం మిజోరాం సరిహద్దు గల కచ్చార్ , మిజోరాం లోని కోలసీబ ప్రాంతాల్లో చక్మా , ఐజ్వాల్ , లాయి తెగలు ఉన్నాయ్ . 1933 లో జరిగిన సరిహద్దు వివాదం నేటికీ తేలకపోవడం తో ఆ సమస్య అలానే ఉండిపోయింది. మిజోరాం రాష్ట్రం లుశాయి కొండలు కొన్ని మణిపూర్ లోకి వెళ్లడం వలన సమస్య మరింత తీవ్రంగా మారింది . ఈ ప్రాంతాలన్నిటిని మిజోరాం , అస్సాం వాసులు దావా చేయడం వలన సమస్య తీవ్ర రూపం దాల్చింది .

**ప్రభుత్వాలు తీసుకోవాల్సిన చర్యలు**

ఈశాన్య రాష్ట్రాల సమస్యల పరిష్కారం కోసం కేంద్రం , అక్కడి రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి సారి కొన్ని ఒప్పందాలు చేసుకోవడం జరుగుతుంది . గత సంవత్సరం (త్రిపుర మిజోరాం) మధ్య ఒప్పందం , (అస్సాం బోడోలాండ్) మధ్య కొన్ని ఒప్పందాలు మంచి ఫలితాలనే అందించాయి . అనేక కమిటీలు వివిధ పరిష్కార మార్గాలను సిఫార్సు చేయడం జరిగింది . ఇటీవల నాగాలాండ్ రాష్ట్రానికి ఇంటర్కోలేటర్ గా పని చేసిన ఆర్ ఎన్ రవి సిఫార్సులు అమలు చేయాల్సిన అవసరం ఉంది . ఒప్పందాల వలన పరిష్కారాలు చాలా వరకు మంచి ఫలితాలని అందిస్తాయి . రాజకీయంగా అధిక ప్రాధాన్యత ఈశాన్య రాష్ట్రాలకు ఇవ్వడం చాలా ప్రాధాన్యం . 545 లోక్సభ సభ్యుల్లో 7 ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వారు కేవలం 25 మంది మాత్రమే ఉండడం దురదృష్టకరం. గవర్నర్ ఆధ్వర్యంలో నడిచే స్వయంప్రతిపత్తి జిల్లా కౌన్సిలను మరింతగ గుర్తింపును తీసుకురావాలి . గిరిజన సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అనేక ప్రోత్సాహకాలు ఇవ్వడం వలన ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలి . ఈశాన్య జోనల్ కౌన్సిల్ ను మరింత గ పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది . సరిహద్దుల కమిటీ ని ఏర్పాటు చేసి సరిహద్దుల పునర్నిర్మాణం చేయాల్సిన అవసరం ఉంది . మరో పక్క బాంగ్లాదేశ్ , మయన్మార్ , చైనా దేశాల నుండి ఉన్న తీవ్రవాద ముప్పును కూడా అరికట్టే విధంగా రాష్ట్రాలతో పాటు దేశ సరిహద్దులను కూడా మరింతగా పటిష్టం చేయాల్సిన అవసరం ఉంది . ఆగ్నేయ ఆసియాకి ముఖద్వారమైన ఈశాన్య భారతాన్ని అభివృద్ధి చేసుకుంటే ఆసియాన్ దేశాలతో సంస్కృతి , రవాణా , ఆర్థికంగా భారత దేశం పురోగం చెందుతుంది . మన దేశ స్థూల జాతీయ ఉత్పత్తి ఇంకో 100 లక్ష కోట్ల వరకు పెరిగే ఆస్కారం ఉంది . భవిష్యత్తులో మళ్ళీ ఈశాన్య రాష్ట్రాల మధ్య సరిహద్దు వివాదం రాకుండా ప్రభుత్వాలు కూడా తగిన కృషి చేయాల్సిన అవసరం ఉంది.



-కన్నోజు శ్రీహర్ష
Mobile: 8985130032

# 20న పాండవుల గుట్టకు మంత్రుల రాక

విశ్వంభర, భూపాలపల్లి: రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఇతర ముఖ్య నేతలు ఈనెల 20న భూపాలపల్లి నియోజకవర్గం రేగొండ మండలం తిరుమలగిరి గ్రామం పాండవుల గుట్ట శివారు పాండవుల గుట్టకు రానున్నారని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఈరోజు శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాండవుల గుట్ట వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా గుట్ట కింద నుండి గుట్ట పైకి మెట్ల మార్గంలో కలెక్టర్ ఇతర అధికారులతో కలిసి నడుచుకుంటూ వెళ్ళారు. గుట్ట పైన ఉన్న పాండవుల గుహ, కుంతీ గుహ, మేకల బండ, ముంగీస బండ, కోట కట్టలు, పురాతన గుహ, శిలా తోరణం లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈనెల 20న రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, కొండా సురేఖ, ఇతర ముఖ్య నేతలు హాజరు కానున్నారని ఇట్టి పర్యటనను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు. సీఎం రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాలో మేడిగడ్డ పర్యటనకు రోడ్డు మార్గంలో వచ్చిన సందర్భంలో పాండవుల గుట్ట ప్రాంతాలను బస్సులోంచి చూపించి, ఆ గుట్టలను పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయాలని సీఎం ను కోరినట్లు ఎమ్మెల్యే గుర్తు చేశారు. ఆ మేరకు పాండవుల గుట్టను అభివృద్ధి చేసేందుకు పర్యాటక మంత్రి ఈ గుట్టలను రానున్నారని, అవసరమైన నిధులు కేటాయించాలని కోరనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాండవుల గుట్ట పైనుండి బుగులోని శ్రీ వేంకటేశ్వరస్వామి గుట్టకు నేరుగా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా రావులపల్లి, తిరుమలగిరి, జగ్గయ్యపేట, వెంకటేశ్వర్లపల్లి, కొత్తపల్లి(బీ), జూబ్లీనగర్ గ్రామాల నుండి పాండవుల గుట్టకు వచ్చే అన్ని రోడ్లను డెవలప్ చేసేలా ప్రతిపాదనలు పంపనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట ప్రజా ప్రతినిధులు, వివిధ శాఖల జిల్లా, మండల అధికారులు, కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, గ్రామస్తులు ఉన్నారు.





కాళేశ్వరం ఆలయంలో జయశంకర్ భూపాలపల్లి

## జిల్లా జడ్జి ప్రత్యేక పూజలు

**విశ్వంభర, భూపాలపల్లి:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కోర్టు జడ్జి నారాయణ బాబు కుటుంబ సభ్యులతో కలిసి కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. వారిని ప్రధాన రాజగోపురం ముందు నుండి అర్చక స్వాములు పూర్ణకుంభంతో స్వాగతం పలికి, స్వామి వారికి అభిషేకం, అమ్మవారి ఆలయంలో దర్శనం చేయించారు. అనంతరం ఆలయ సూపరింటెండెంట్ బుర్రి శ్రీనివాస్ ఆయనకు స్వామివారి శేష వస్త్రాలు అందజేశారు. వేద పండితులు అర్చక స్వాములు జడ్జి దంపతులకు ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు. కాళేశ్వరం ఎస్సై చక్రపాణి, మహా ముత్తారం ఎస్సై మహేందర్, మహాదేవపూర్ ఎస్సై పవన్ కుమార్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## టీపీసీసీ ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్‌ను సత్కరించిన జర్నలిస్టులు



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లా లోని రేగొండ మండల కేంద్రంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ గా నియమితులైన తాళ్లపల్లి దామోదర్ గౌడ్ ను భూపాలపల్లి జర్నలిస్టులు శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు ఎడ్ల సంతోష్, సామంతుల శ్యామ్, అంబాల సంపత్, వడ్లూరి సతీష్, బండి కమలాకర్, రాపర్తి పవన్, రొంటెల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



**విశ్వంభర, కడ్తాల్:** కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ఎగిరిశెట్టి శంకరయ్యకు 60 వేల రూపాయలు, ఫాతిమాకు 20 వేల రూపాయల సీఎంఆర్ఎఫ్ చెక్కులను మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి సహకారంతో మాజీ జెడ్పీటీసీ దశరథ్ నాయక్ స్థానిక నాయకులతో కలిసి అందజేశారు. చికిత్స పొందుతున్న బాధితులకు సీఎంఆర్ఎఫ్ పథకం ఎంతో ఆసరాగా నిలుస్తుందని, నిరుపేద ప్రజలు వైద్య ఖర్చులకు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల వైస్ ఎంపీపీ ఆనంద్, మాజీ ఉపసర్పంచ్ శారద పాండు నాయక్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ లాయక్ ఆలీ, నాయకులు ఇర్షాద్, కంబాలపల్లి రమేష్, శ్రీను భీమన్, మహేష్ మూడ రవి, బీఆర్ఎస్ సత్యం, రాజు పాల్గొన్నారు.

## 18న సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహాల ఆవిష్కరణ



**విశ్వంభర, వెల్దండ:** వెల్దండ మండల పరిధిలోని కప్పగండ్ల, కంటోన్ పల్లి గ్రామాల్లో ఈ నెల 18న సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని గౌడ సంఘం కల్వకుర్తి తాలూకా అధ్యక్షుడు చుక్క అల్లాజీ గౌడ్ అన్నారు. శుక్రవారం వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం కోసం గోల్కొండ కోటపై బడుగుల జెండా ఎగరవేసిన మహనీయుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాల ఆవిష్కరణ చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమానికి ఎంపీ మల్లు రవి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాజీ ఎమ్మెల్యే జయపాల్ యాదవ్, మాజీ జాతీయ బీసీ కమిషన్ మెంబర్ ఆచారి ఇతర ముఖ్య నాయకులు పాల్గొంటున్న ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయగలరని కోరారు. వెల్దండ గౌడ సంఘం మండల అధ్యక్షుడు మట్ట వెంకటయ్య గౌడ్, వెల్దండ మాజీ వైస్ ఎంపీపీ కొమ్మగోని వెంకటయ్య, గంగా రవి, తిరుమందాసు నాగరాజు, మట్ట మదన్, చుక్క నిరంజన్, మట్ట నాగరాజు, గుండాలు, మధు, శివరాజు, రమేష్ రఘు, వివిధ గ్రామాల గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు.

## స్టడీ సర్కిల్‌లో వృత్తి నైపుణ్య శిక్షణ

**విశ్వంభర, భూపాలపల్లి:** తెలంగాణ రాష్ట్రంలోని విద్యావంతులైన నిరుద్యోగ బీసీ యువతకు స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు భూపాలపల్లి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. పదవ తరగతి, డిప్లమో, ఐటీఐ, ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సు చేసిన నిరుద్యోగ యువతకు హైదరాబాదులోని ఎల్జీ హోమ్ టెక్నికల్ స్కిల్ అకాడమీ ద్వారా వందమందికి నాన్ రెసిడెన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. 90 రోజుల పాటు నిర్వహించనున్న ఈ శిక్షణా కార్యక్రమంలో 4,000 వేల రూపాయల స్టైఫండ్ ఇవ్వనున్నట్లు ఆమె వివరించారు. రిఫ్రిజిరేటర్, వాషింగ్ మిషన్, డిష్ వాషర్, ఏసీ రిపేర్, ఎల్ఈడీ, ఎల్సీడీ టీవీల మానిటర్ రిపేర్, మైక్రోవేవ్, వాటర్ ప్యూరిఫైయర్ రిపేర్లలో శిక్షణ ఇవ్వనున్నట్లు ఆమె తెలిపారు. అర్హత ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 24తేదీ లోపు www.tgbcstudycircle.cgg.gov.in అనే వెబ్సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని మరిన్ని వివరాలకు 04024071178 ద్వారా సంప్రదించాలని ఆమె కోరారు.

# ఉత్తమ సేవకుడికి అరుదైన గౌరవం



**విశ్వంభర, భూపాలపల్లి:** భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్ళపల్లి పోలీస్ స్టేషన్ లో విధులను నిర్వహిస్తున్న ఉత్తమ పోలీస్ సేవకుడికి అరుదైన గౌరవం దక్కింది. సేవే మార్గంసేవే లక్ష్యంతో పనిచేస్తున్న ఆయన నిస్వార్థ సేవకు నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తూ ప్రజలకు సేవలు అందించడమే అతను నైజంగా పెట్టుకున్నాడు. ఆగస్టు 15న భూపాలపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ఆయనను ప్రభుత్వం ఉత్తమ హెడ్ కానిస్టేబుల్ గా ఎంపిక చేసి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించి సత్కరించారు. ఆయనే హెడ్ కానిస్టేబుల్ గుండేటి సుధాకర్. వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలో గుండేటి పుష్పసామెల్ దంపతులకు జన్మించిన సుధాకర్ చిన్నప్పటినుండే కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న ఆయన కష్టపడి చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించారు. పోలీస్ విధుల్లో చేరాడు. తొలుత 1994న హన్మకొండ పోలీస్ స్టేషన్‌లో విధుల్లో చేరిన ఆయన ఇంతేరాగంజ్, ఏటూర్ నాగారం, మిల్స్ కాలనీ, తొర్రూరు, డోర్నకల్, స్టేషన్ ఘనపూర్ లలో విధులను సమర్థవంతంగా నిర్వహించిన ఆయనను జిల్లాల బదిలీల క్రమంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ కు బదిలీ చేశారు. మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ లో విధుల్లో చేరినప్పటి నుండి ఆయన క్రిమినల్స్ పై కఠినత్వం, ప్రజలపై మమకారం, చేసే వృత్తిలో నీతి, నిజాయితీ, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటిస్తూ వృత్తి ధర్మంలో మంచికి మారుపేరుగా పేరు ప్రఖ్యాతులు గడిస్తూ ఫ్రెండ్లీ పోలీస్ అనే పదానికి నిలువెత్తు ప్రతిరూపంగా సుధాకర్ నిలుస్తున్నారు. సుధాకర్ ను రెండుసార్లు ఉత్తమ పోలీస్ హెడ్ కానిస్టేబుల్‌గా మొగుళ్లపల్లి పోలీస్ స్టేషన్ నుంచే ఎంపిక చేయడం గమనార్హం. ఈనెల ఆగస్టు 15న జరిగిన స్వాతంత్ర దినోత్సవంలో ఉత్తమ హెడ్ కానిస్టేబుల్ గా ఎంపిక చేసి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, జిల్లా ఎస్పీ కిరణ్ ఖరే చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడారు. పుట్టిన ఊరికి, కన్న తల్లిదండ్రులకు, చదువు నేర్పిన గురువులకు పేరు ప్రఖ్యాతులు తీసుకువచ్చేలా తోడ్పాటునందించిన పోలీస్ ఉన్నతాధికారులకు, తోటి పోలీస్ సహచరులకు, ముఖ్యంగా మొగుళ్ల పల్లి మండల ప్రజలకు ఆయన పేరు పేరున కృతజ్ఞతలు తెలిపారు. మొగుళ్లపల్లి మండల ప్రజలకు జీవితాంతం రుణపడి ఉంటానని గుండేటి సుధాకర్ అన్నారు.

# వర్షా ల కోసం గ్రామదేవతలకు పూజలు

**విశ్వంభర, చింతపల్లి:** వర్షాలు సమృద్ధిగా కురిసి బంగారు పంటలు పండాలని చింతపల్లి మండలం వింజమూరు గ్రామస్తులు శుక్రవారం గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. ఇటీవల వర్షాలు లేకపోవడంతో పంటలకు తీవ్ర నీటి కొరత ఏర్పడి చేతికందే పరిస్థితి లేకుండా పోయింది. భూగర్భ జలాలు అడుగంటడంతో వరి నాట్లు వేసుకున్న రైతులకు తీవ్ర నిరాశ ఎదురయింది. దీంతో బోర్లు ఎండిపోవడం మొదలయ్యాయి. గ్రామాలలో తీవ్ర మనోవేదనకు గురవుతున్న రైతులు వర్షాలు సమృద్ధిగా కురవాలని గ్రామదేవతలకు జలాభిషేకాలు చేస్తూ వరుణ దేవుణ్ణి వేడుకుంటున్నారు. అందులో భాగంగా వింజమూరు గ్రామంలో గ్రామస్తులంతా కలిసి గ్రామదేవతలకు జలాభిషేకం చేస్తూ, కప్పలకు పెళ్లిళ్లు చేశారు. కోట మైసమ్మ అమ్మవారికి దున్నపోతును విడిచారు. వర్షాలు భారీగా కురిసి, బంగారు పంటలు పండాలని గ్రామస్తులు అమ్మవారిని వేడుకున్నారు.



## సత్యసాయి మందిరంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**విశ్వంభర, ఆమనగల్లు:** ఆమనగల్లు శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో శుక్రవారం శ్రీ వరలక్ష్మీ వ్రతం పురస్కరించుకొని స్థానిక సత్యసాయి మందిరంలో భక్తులు సామూహిక వ్రతాలు చేసి అమ్మవారిని కొలిచారు. సేవా సమితి కన్వీనర్ దొంతు శ్రీనివాస్ ఆధ్వర్యంలో సామూహిక వ్రతాలకు కావలసిన ఏర్పాట్లు చేయగా దాదాపు 35 మంది మహిళా భక్తులు సామూహికంగా వ్రతాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వ్రతాలలో పాల్గొనేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో మందిరానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా మందిర పరిసరాలు భక్తులతో కిటకిటలాడగా, సామూహిక వ్రతాలతో ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి కన్వీనర్ దొంతు శ్రీను, దొంతు పుల్లయ్య, దొంతు విశ్వనాథం, సంజీవ్ కుమార్, కృష్ణారెడ్డి, రాము గోల్డ్, ఎన్ ఆర్ ప్రభాకర్, గుర్రం సురేష్, మూర్తి గ్యాస్, అప్పం తిరుపతయ్య, బ్రహ్మం, పోలిశెట్టి శ్రీను, నాగిళ్ల శంకర్, పల్లె అల్లాజిగౌడ్, నారాయణ సాగర్, పాపిశెట్టి రాము, దొంతు సంధ్య, శైలజ, సైదులుగౌడ్, అలివేలు, అనిత, దొంతు విజయలక్ష్మి, దాస అరుణ, జ్యోతి, సింధు, దాస శ్రీను, శ్రీధర్ ఉన్నారు.





## విద్యార్థులచే స్వర్ణ భారతం నాటక ప్రదర్శన

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం కూరెళ్ళ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు 78వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రాథమిక పాఠశాల విద్యార్థులు స్వర్ణ భారతం అనే నాటకాన్ని ప్రదర్శించారు. ఈ నాటకంలో జలియన్వాలా బాగ్ సంఘటన, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్ ను ఏ విధంగా ఉరితీసారో, మన భారతీయ పతాకము గొప్పదనం గురించి ప్రదర్శన చేయడం జరిగింది. ఇందులో చిన్నారులు అద్భుతంగా ప్రదర్శించారని మాజీ సర్పంచ్ భాష బోయిన ఉప్పలయ్య మాజీ చైర్మన్ గడ్డం అశోక్, ఎరుకల స్వామి అమ్మ అదర్శ పాఠశాల కమిటీల (ఏఏపీసీ) చైర్మన్లు ఎరుకల రాములమ్మ, భారతమ్మలు విద్యార్థులను కొనియాడారు. స్వాతంత్ర్య పోరాట దృశ్యాలను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కట్ట రమేష్ విద్యార్థులకు చక్కగా నేర్పి ప్రదర్శించారని అందరూ మెచ్చుకున్నారు. ఇందులో హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు మిర్యాల దామోదర్, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు సత్తయ్య, హై స్కూల్ ఉపాధ్యాయులు శ్రీను, జానయ్య, మశ్చగిరి, వెంకన్న, సురేందర్, వేణు, అంజయ్య, అండాలు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల సిల్వర్ జూబ్లీకి హాజరైన ఎమ్మెల్యే



**విశ్వంభర, భూపాలపల్లి:** ఉమ్మడి వరంగల్ జిల్లా భూపాలపల్లి నియోజకవర్గ పరిధి శాయంపేట మండలంలోని ఎంజేపీ పాఠశాల పూర్వ విద్యార్థులు ఏర్పాటు చేసిన సిల్వర్ జూబ్లీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, ఎం జే పీ గురుకుల సెక్రటరీ సైదులు, తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్, తదితర నాయకులు హాజరయ్యారు.

## బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన కోల ప్రతాప్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మరణించడం జరిగింది. విషయం తెలుసుకున్న స్థానిక తాజా మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ మృతుడు కోల ప్రతాప్ భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం మాజీ సర్పంచ్ జన్నాయికోడె నగేష్ వారి కుటుంబానికి 5000/ రూపాయలు ఆర్థిక సహాయం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మెన్ జిల్లాల శేఖర్ రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు పోతగాని మల్లేశం, పీఏసీఎస్ డైరెక్టర్ నోముల వెంకట్ రెడ్డి, మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కోల లక్ష్మయ్య, మత్స్య పారిశ్రామిక సంఘం అధ్యక్షులు ఎద్దు వెంకన్న, శాలివాహన సంఘం అధ్యక్షులు ఎలగందుల సైదులు, నాయకులు జన్నాయికోడే యుగేందర్, పైళ్ల బుచ్చిరెడ్డి, దొంతర బోయిన భాస్కర్, కోరే మల్లేశం, రాచమల్ల జగదీశ్వర్, యాస నర్సిరెడ్డి, సుల్తాన్, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులు స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

**○ మాజీ ఎమ్మెల్యే యాదగిరి రావు**

**విశ్వంభర, చింతపల్లి:** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమై కమ్యూనిస్టు పార్టీ సత్తా చాటాలని మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు పిలుపునిచ్చారు. చింతపల్లి మండల కేంద్రంలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయంలో శుక్రవారం కమ్యూనిస్టు పార్టీ మండల నిర్మాణ కౌన్సిల్ సమావేశంను నిర్వహించారు. ఈ సమావేశానికి భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) నల్గొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం, మునుగోడు మాజీ ఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ పార్టీ పాలనలో ప్రాజెక్టుల పేరుతో వేలకోట్ల దోపిడీ జరిగిందని విమర్శించారు. వేలకోట్ల అప్పులు చేసి ప్రజలపై భారం మోపిందన్నారు. బీఆర్ఎస్ పార్టీ రాబోయే కాలంలో కనుమరుగవడం ఖాయం అన్నారు. నేడు రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం దేవరకొండ, మునుగోడు నియోజకవర్గ రైతులకు సాగునీరు అందించాలన్నారు. ఎస్ఎల్బీసీ సొరంగ మార్గాన్ని యుద్ధ ప్రతిపాదికన పూర్తి చేయాలన్నారు. కారణాలేవైనప్పటికీ షరతుల్లేని రుణమాఫీని రైతులకు వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీ పథకాలను త్వరగా అమలు చేసి, పార్టీల కతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి ఈ పథకాలను అందించాలన్నారు. ప్రభుత్వాల ఏవైనప్పటికీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడేది కమ్యూనిస్టులేనన్నారు. భవిష్యత్తులో కమ్యూనిస్టు పార్టీ నిర్వహించబోయే పోరాటాలలో ప్రజలంతా



భాగస్వాములు కావాలని వారు పిలుపునిచ్చారు. తదనంతరం 9మంది మండల పార్టీ కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి పోలే వెంకటయ్య, సహాయ కార్యదర్శి ఉజ్జిని అంజల్ రావు, పల్లపు లక్ష్మయ్య, మల్లోజు శేఖరాచారి, శంషుద్దీన్, నరసింహ, వీరయ్య, వెంకటయ్య, బుచ్చయ్య, భారతమ్మ, పాప, యాదయ్య, జితేందర్, రామకృష్ణ, సైదులు, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని వాజ్ పేయికి ఘన నివాళి

**విశ్వంభర, కోరుట్ల:** మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి వర్ధంతి సందర్భంగా కోరుట్ల పట్టణంలో రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు సురభి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బీజేపీ, బీజేవైఎం కార్యకర్తలు ఘన నివాళులు అర్పించారు. అణువణువు దేశభక్తితో మంచితనమే తన శక్తిగా ఎంతటి జటిల సమస్యను సైతం ఓర్పుగా పరిష్కరించే యుక్తి కలిగిన సుపరిపాలన దురంధరుడు, అందరూ అభిమానించే నిత్య చైతన్య తేజో భాస్కరుడు మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్ పేయి భారతదేశానికి ఎనలేని సేవలు చేసినా భరతమాత ముద్దుబిడ్డ, వారి సుదీర్ఘమైన రాజకీయ అనుభవంతో భావితరాలకు బాటలు వేశారని సురభి నవీన్ కుమార్ కొనియాడారు. కార్యక్రమానికి బీజేపీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు బింగి వెంకటేష్ బీజేపీ, బీజేవైఎం సీనియర్ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు నివాళులర్పించారు.

## మొట్లపల్లిలో పడకేసిన పారిశుద్ధ్యం



**విశ్వంభర, భూపాలపల్లి:** గ్రామపంచాయతీలలో సర్పంచుల పదవీకాలం పూర్తి కావడంతో గ్రామ పంచాయతీల పరిస్థితి అధ్వానంగా మారింది. గ్రామంలోని సమస్యలు ఎక్కడికక్కడే పేరుకుపోవడంతో సమస్యలకు నిలయాలుగా గ్రామ పంచాయతీలు మారాయి. దీంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలోని మొట్లపల్లి గ్రామం మరింత అస్తవ్యస్తంగా మారిపోయింది. మొట్లపల్లి గ్రామంలో పారిశుద్ధ్యం పడకేసినప్పటికీ అధికార యంత్రాంగం ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మొట్లపల్లిజమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారి ప్రక్కన గల జడ్పీహెచ్ఎస్ ప్రహరీ గోడను ఆనుకొని చెత్త, చెదారాన్ని డంప్ చేసినా పట్టించుకునే నాధుడే లేకపోవడంతో ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు విష జ్వరాల బారీన పడుతున్నారని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని స్వచ్ఛదనం, పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామంలో పరిపూర్ణంగా అమలు చేసి, గ్రామంలోని వాడవాడలా పేరుకుపోయిన చెత్త, చెదారాన్ని తొలగించి ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా తగు చర్యలు తీసుకోవాల్సిందిగా గ్రామ ప్రజలు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

## భూపాలపల్లిలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణం



**విశ్వంభర, భూపాలపల్లి :** భూపాలపల్లి పట్టణవాసుల దాహార్తి తీర్చేందుకు అమృత్ పథకం 2.0 ద్వారా రూ.18.99 కోట్లతో ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నిర్మాణానికి శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన చేశారు. ముందుగా మంజూరు నగర్ లోని వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిలో సుమారు 1200 కేఎల్ సామర్థ్యంతో నూతనంగా నిర్మించనున్న వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు కలెక్టర్ రాహుల్ శర్మ తో కలిసి శంకుస్థాపన చేశారు. బీసీ కాలనీ గ్రీన్ ల్యాండ్ ఏరియాలో 800 కేఎల్ సామర్థ్యం గల వాటర్ ట్యాంక్, కారల్ మార్క్స కాలనీలో 1100కేఎల్ సామర్థ్యంతో గల వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రోజురోజుకు భూపాలపల్లి పట్టణం విస్తరిస్తున్న నేపథ్యంలో, భవిష్యత్తులో పట్టణ వాసులకు త్రాగునీటి కష్టాలను తీర్చేందుకు అమృత్ పథకం 2.0 కింద రూ.18.99 కోట్లు మంజూరు అయినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ఈ యొక్క నిధులతో భూపాలపల్లి పట్టణంలో మూడు చోట్ల నూతన ఓహెచ్ఎస్ఆర్ వాటర్ ట్యాంకుల నిర్మాణంతోపాటు, పైపులైన్ల నిర్మాణం, ఇతర పనులు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంట పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, కౌన్సిలర్లు ఉన్నారు.

# కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం

**విశ్వంభర, ఆమనగల్లు/ ఆత్మకూరు(ఎం) :** ఆమనగల్లు మండల కేంద్రంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు బీఆర్ఎస్ మాజీ మంత్రి కేటీఆర్ ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేస్తున్న మహిళల పట్ల అనుచిత వాక్యాలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రాస్తారోకో, కేటీఆర్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి నిరసన తెలిపారు. అనంతరం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర మహిళలందరికీ వెంటనే క్షమాపణ చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తెల్గమల్ల జగన్, పట్టణ అధ్యక్షుడు వస్పుల మానయ్య, మాజీ ఎంపీపీ ధనుంజయ,



ఆమనగల్లు కేంద్రంలో..

జిల్లా నాయకులు లక్ష్మి కృష్ణ నాయక్, మండ్లి రాములు, విజయ్ నాయక్, ఖాదర్ ఖాద్రి, వస్పుల శ్రీశైలం, అబ్దుల్ ఖాదర్, బాబా, రవీందర్ నాయక్, ఏంగాలి ప్రసాద్, కరీం, కొండల్, దేవరశెట్టి మహేష్, శేఖర్ గౌడ్, వస్పుల శ్రీకాంత్, కుమార్ గౌడ్, నర్సింహ, రహీం, కృష్ణ నాయక్, మహమ్మద్ రఫీ, చంద్రు, యాదయ్య, కమ్లి, లక్ష్మి, కేసరి ఉన్నారు.





మోట కొండూరు మండల కేంద్రంలో..

**మోట కొండూరు మండల కేంద్రంలో..**

తెలంగాణ ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న ఉచిత బస్సు ప్రయాణంపై కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా యాదాద్రి భువనగిరి జిల్లా మోట కొండూరు మండల కేంద్రంలో శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దిష్టిబొమ్మను దహనం చేశారు. మహిళపై చేసిన అనుచిత వ్యాఖ్యలకు కేటీఆర్ మహిళల ఆగ్రహానికి గురికావలిసీవస్తుందని మహిళ నాయకులు అన్నారు. కేటీఆర్ తక్షణమే మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం రహీంఖంపేట గ్రామములో బీఆర్ఎస్ పార్టీ నాయకురాలు సుధగాని అండమ్మ అనారోగ్యంతో శుక్రవారం రోజు చనిపోవడం జరిగింది. వారి కుటుంబానికి బీఆర్ఎస్ రాష్ట్ర పార్టీ నాయకులు కోప్పుల హరిదీప్ రెడ్డి 5,000ల రూపాయలు ఆర్థికసాయం అందించారు. మృతురాలి కుటుంబానికి గ్రామ బీఆర్ఎస్ పార్టీ నాయకులు దుంప సుజాత, గ్రామ శాఖ అధ్యక్షులు సుదగాని లింగయ్య, ఉపాధ్యక్షులు ఆవుల మల్లయ్య, మాజీ గ్రామ శాఖ అధ్యక్షులు మెరుగు అంజయ్య, కర్రే అయిలయ్య, నియోజకవర్గ యూత్ కార్యదర్శి బండి నరేష్, మండల యూత్ ప్రధాన కార్యదర్శి దుంప పరశురాములు, గ్రామ నాయకులు కర్రే మల్లయ్య పాల్గొని మృతురాలి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

# రుణమాఫీ అంకెల గారడీ..

**○ రైతు భరోసానే రుణమాఫీగా చూపించిన ముఖ్యమంత్రి రేవంత్ : మాజీ మంత్రి కొప్పుల**

**విశ్వంభర, కరీంనగర్:** కరీంనగర్ తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అరకొర రుణమాఫీ చేసి రైతును నమ్మించి మోసం చేసిందని అన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్ల కోసమే అబద్దాలు చెప్పి, అబద్దాలతో అధికారం దక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ అవే అబద్దాలతో పాలన సాగిస్తోంది విమర్శించారు. నమ్మిన రైతాంగాన్ని కాంగ్రెస్ అత్యంత ఘోరంగ మోసం చేసిందన్నారు. ఒకే వేదికపై రుణమాఫీ గురించి మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు. అబద్దాలు ఆడుతూ మంత్రులు అడ్డంగా దొరికారని తెలిపారు. భట్టి విక్రమార్క రుణమాఫీకీ 6 వేల కోట్లు విడుదల అంటే, తుమ్మల నాగేశ్వరరావు రుణమాఫీకీ 31 వేల కోట్లు విడుదల అంటున్నారని అన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ గెలిచిన వెంటనే (డిసెంబరు 9) ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నోట గొప్పలు చెప్పిన విషయం ప్రజలు అందరూ విన్నారు. రుణమాఫీ అంటూ రాష్ట్రంలోని అన్ని గుడుల మీద ఒట్లు పెట్టిన రేవంత్ రెడ్డి దేవుళ్లను కూడా మోసం చేశాడని విమర్శించాడు. బీఆర్ఎస్ సర్కారు 2018లో రూ.లక్ష వరకు రుణమాఫీకి 36.68 లక్షల రుణమాఫీ చేసి రైతులను ఆదుకున్నామని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు రూ.2 లక్షల వరకు రుణమాఫీకి మూడు విడతల్లో సుమారు 23.75 లక్షల మంది రైతులకు



మాత్రమే ఇచ్చారని, దాదాపు 46.25 లక్షల రైతులు రుణమాఫీకి నోచుకోలేకపోతున్నారు ఆవేదన వ్యక్తం చేశారు. మా ప్రభుత్వం హయాంలో కన్నా 13 లక్షలు తగ్గిన అర్హులు.! మా హయాంలో చేసిన రుణమాఫీకి అర్హులైన రైతులతో పోల్చితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్యను వివిధ కారణాలను చూపి తగ్గించిందన్నారు. మా హయాంలో కంటే, కాంగ్రెస్ పాలనలో రుణమాఫీ పొందే రైతుల సంఖ్య 13 లక్షలు తగ్గిందన్నారు. అర్హుల సంఖ్య తగ్గడంలో మతులబు ఎంటో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి అన్నారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి మాజీ శాసనసభ్యుడు సుంకె రవిశంకర్, మాజీ మేయర్ రవిందర్ సింగ్ పాల్గొన్నారు.

## కాంగ్రెస్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**- వేముల మహేందర్ గౌడ్**

**విశ్వంభర, భూపాలపల్లి:** దేశవ్యాప్తంగా జరిగే జాతి జనగణనలో సమగ్ర కులగణన చేపట్టాలనే ప్రధాన డిమాండ్‌తో దేశవ్యాప్తంగా 29 రాష్ట్రాలలో కాంగ్రెస్ తరపున పర్యటించి కులగణన సాధనకై జాతీయ స్థాయిలో ఉద్యమిస్తామని ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ పార్టీ పీసీసీ, ముఖ్యమంత్రుల సమావేశంలో నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ అన్నారు. బీసీలు చేస్తున్న పోరాటాలకు మద్దతుగా కులగణన కోసం కాంగ్రెస్ కూడా ముందుకు రావడం చాలా హర్షించదగ్గ విషయమన్నారు. కులగణనపై రాహుల్ గాంధీ మొదటి నుంచి సానుకూలంగా ఉన్నారని, రాహుల్ గాంధీ ఆదేశాలతోనైనా రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం కదిలి వచ్చి వెంటనే కులగణన ప్రారంభించి, కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పార్టీలు, కులాల కతీతంగా బీసీలందరినీ కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు.

## విజేతలకు బహుమతులు ప్రదానం



**విశ్వంభర, కరీంనగర్:** శాతవాహన యునివర్సిటీ లోని శాతవాహన వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆటల పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలలో గెలుపొందిన విజేతలకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వాకర్స్ వయసుతో సంబంధం లేకుండా వాకింగ్ తో పాటు ఆటలు ఆడటం వల్ల శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండడానికి తోడ్పడుతుందని అన్నారు. వాలీబాల్ టోర్నమెంట్ లో రాజేశం, శ్యామ్ సుందర్ టీం విన్నర్స్ గా, నర్సింగం టీం రన్నర్స్ గా ఉన్నారు. నరేందర్ రెడ్డి చేతుల మీదుగా వీరికి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పోచయ్య పటేల్, పెరుక రాజేందర్, హరీష్, ఫనీ, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, అస్థపురం రమేష్, అస్థపురం తిరుమల, మల్లిఖార్జున్, భరత్ పాల్గొన్నారు.

## మాటకు కట్టుబడిన నాయకుడు సీఎం రేవంత్



**విశ్వంభర, ఆత్మకూరు(ఎం):** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రెండు లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, సహచర మంత్రులకు, తెలంగాణ ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యకు ఆత్మకూరు (ఎం) మండలం పోతిరెడ్డిపల్లి గ్రామంలో పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఎడమ మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో పాలాభిషేకం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగుల ఆనంద్ యాదవ్, నాగుల సత్యనారాయణ యాదవ్, నాగుల రమేష్ యాదవ్, మక్తల వెంకటయ్య, మెట్టు అంతిరెడ్డి, కడకంచి కుమార్, పాల సెంటర్ చైర్మన్ ఎడమ నర్సిరెడ్డి, యావగాని బిక్షం గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



దోమకొండ మండలం అంచనూరు గ్రామ కురుమ సోదరుల ఆహ్వానం మేరకు తెలంగాణ సాయుధ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య విగ్రహావిష్కరణ చేస్తున్న కామారెడ్డి శాసన సభ్యులు కాటిపల్లి వెంకట రమణ రెడ్డి
- విశ్వంభర, కామారెడ్డి




కామారెడ్డి నియోజకవర్గంలోని దోమకొండ మండలానికి చెందిన ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్దిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను కామారెడ్డి శాసనసభ్యులు కాటిపల్లి వెంకటరమణ రెడ్డి పంపిణీ చేశారు.
- విశ్వంభర, కామారెడ్డి

# వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో వరలక్ష్మి పూజలు

**విశ్వంభర, మెట్‌పల్లి/ భూపాలపల్లి/పెద్ద శంకరంపేట :** శ్రావణ శుక్రవారం సందర్భంగా మెట్‌పల్లి పట్టణంలోని స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సామూహిక కుంకుమ పూజలు, వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. రెండు వందల మంది మహిళా భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాన్ని వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య నియమ నిష్ఠలతో జరిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు లింబాద్రి, ఆర్యవైశ్య సంఘం మెట్ పల్లి అధ్యక్షులు రాంబాబు, మహిళా సంఘం అధ్యక్షురాలు పుల్లూరి మధుమిత, మైలారపు సంతోషిని, వాసవి దేవాలయం అధ్యక్షులు చాడ సురేష్, వాసవి గార్డెన్ అధ్యక్షులు కోట కిరణ్ కుమార్, ఆర్యవైశ్య సంఘం కార్యదర్శి ఎల్మీ రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, చిట్టిమిల్లి శ్రీనివాస్, జొన్న శ్రీనివాస్, బండారి గోపి, చింత లవ కుమార్ పూజలో పాల్గొన్న భక్తులకు సహకరించారు.



భూపాలపల్లి : కాళేశ్వరం భుతేశ్వర స్వామి ఆలయంలో



మెట్‌పల్లి : వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో

**కాళేశ్వరం భుతేశ్వర స్వామి ఆలయంలో...**

భూపాలపల్లి జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కాళేశ్వరం భుతేశ్వర స్వామి ఆలయంలో శుభానంద అమ్మవారి ఆలయం వద్ద త్రిపురారి కృష్ణమూర్తి ప్రధాన అర్చకులు ఆధ్వర్యంలో వేద పండితులు, అర్చక స్వాములతో సామూహిక వరలక్ష్మి వ్రతం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కాళేశ్వరం గ్రామస్తులు, భక్తులు 75 మంది మహిళలు పాల్గొని వరలక్ష్మీ వ్రతం పూజా కార్యక్రమం నిర్వహించుకొన్నారు. పూజలో పాల్గొన్న మహిళ భక్తులకు పూజా సామాగ్రి నైవేద్య ప్రసాదాలు దేవస్థానం తరపున అందజేయడం జరిగినది. అనంతరం దేవస్థానం అర్చక స్వాములు మహిళలకు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులకు ఎలాంటి అసౌకర్యములు కలుగకుండా దేవస్థానం సూపరిండెంట్ బుర్రి శ్రీనివాస్, సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేశారు.

**సరస్వతి శిశు మందిరంలో..**

వరలక్ష్మి పండగ పురస్కరించుకొని స్థానిక సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో ఘనంగా సామూహిక వరలక్ష్మీ పూజలను నిర్వహించారు. ఈ పూజలు పెద్ద ఎత్తున మహిళలు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వాహకులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీరప్ప దాది గారి గంగాధర్ సీతారామారావు జైహింద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పెద్ద శంకరంపేట : సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో

# హైదరాబాద్‌లో వరుణుడి బీభత్సం

- చెరువులుగా మారిన రోడ్లు
- పలుచోట్ల వాహన చోదకుల ఇక్కట్లు
- జిల్లాల్లోనూ భారీ వర్షా లు



విశ్వంభర, హైదరాబాద్: హైదరాబాద్ సహా రాష్ట్రవ్యాప్తంగా వర్షం దంచికొట్టింది. ముఖ్యంగా రాజధాని మరోసారి వరుణుడి దెబ్బకు విలవిల్లాడింది. గురువారం నాటి బీభత్సం నుంచి తేరుకోకముందే తిరిగి శుక్రవారం అదే సమయానికి వరుణుడు విరుచుకుపడ్డాడు. కొద్దికొద్దిగా మొదలైన వర్షం, క్రమంగా విస్తరిస్తూ నగర మంతటా వ్యాపించింది. ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల విస్తారంగా వర్షాలు పడ్డాయి. జీహెచ్‌ఎంసీ పరిధిలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుసింది. కుండపోతగా కురిసిన వర్షం, సిటీ రోడ్లను మరోసారి చెరువులుగా మార్చింది. మధ్యాహ్నం నుంచి మొదలైన వర్షం, క్రమంగా నగరమంతటా విస్తరించింది. సికింద్రాబాద్, ప్యాట్నీ, ప్యారడైజ్, బేగంపేట్, చిలకలగూడ, మారేడుపల్లి, మేడ్చల్, కండ్లకోయ, దుండిగల్ ప్రాంతాల్లో జడివాన పడింది. ఒక్కసారిగా కుంభవృష్టిగా కురిసిన వర్షానికి రహదారులు జలమయమయ్యాయి.

ఏకధాటిగా వర్షం కురువడం వల్ల హైదరాబాద్ ప్రధాన రహదారులపై నీరు చేరి వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పలుచోట్ల డ్రైనేజీలు పొంగిపోవడంతో రహదారులపై వరద నీరు ప్రవహించింది. చాలాచోట్ల వాహనాలు రోడ్లపై నిలిచిపోయి ట్రాఫిక్ నిలిచిపోయింది. అటు కూకట్‌పల్లి, హైదర్‌నగర్, నిజాంపేట్, కేపీహెచ్‌బీ ప్రాంతాల్లోనూ వరుణుడు విరుచుకుపడ్డాడు. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట్, సనత్‌నగర్, ముషీరాబాద్, ఆర్టీసీ క్రాస్‌రోడ్, చిక్కడపల్లి, దిల్‌సుఖ్ నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్‌లోనూ భారీ వర్షం పడింది. ఈ ప్రభావంతో రహదారులపై వర్షపు నీరు భారీగా నిలిచిపోయి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఆఫీసులు విడిచిపెట్టే సమయం కావడంతో పలుచోట్ల ట్రాఫిక్ నిలిచిపోయింది. రద్దీ ప్రాంతాలైన అమీర్‌పేట, పంజాగుట్ట, కూకట్ పల్లి, బయో డైవర్సిటీ, కోఠి ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉంది. హైదరాబాద్‌లో భారీ వర్షంపై వాతావరణ శాఖ ముందే రెడ్ అలర్ట్ జారీ చేసింది. వర్షంతో రహదారులపై నీరు చేరకుండా జీహెచ్‌ఎంసీ, డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగాయి. ఏమైనా ఇబ్బందులుంటే 040 21111111కు ఫోన్ చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులు తెలిపారు.

పలు జిల్లాల్లోనూ...జిల్లాల్లోనూ వర్షం దంచికొట్టింది. నిర్మల్‌లో అరగంటలోనే ఆగమాగం చేసింది. ఒక్కసారిగా కుండపోత కురిసింది. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యాయి. వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. శివాజీ చౌక్‌లో నలువైపులా కిలోమీటర్ పొడవున రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనూ ఉరుములతో కూడిన భారీ వర్షం కురిసింది. పక్షం రోజులుగా వర్షాల కోసం ఎదురు చూస్తున్న రైతులకు ఊరట లభించింది. జగిత్యాల, గంగాధర, రామడుగు, చొప్పదండి, ధర్మపురి, చిగురుమామిడి, బోయినపల్లి మండలాల్లో వర్షం పడింది. నిజామాబాద్ జిల్లాలోనూ వర్షం దంచి కొట్టింది. పలు చోట్ల కొంతసేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కొన్ని చోట్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది.



సిటీలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్

## తవ్విన రోడ్లను పూడ్చరా?

### గుంతలతో ఇబ్బందులు కలగవా?

### అధికారులపై మున్సిపల్ పీఎస్ దాన కిషోర్ ఆగ్రహం

**విశ్వంభర, హైదరాబాద్ బ్యూరో:** మహానగరంలో ఎక్కడ ఎలాంటి పనులు చేపట్టినా, పనులు ముగిసిన వెంటనే ఆ రోడ్లను పునరుద్ధరించాలని మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్ అధికారులకు సూచించారు. తవ్వి వదిలేస్తే ఏర్పడిన గుంతలు ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారవా? అంటూ తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేశారు. నగరంలో ఆయన శుక్రవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తొలుత ఆయన జర్నలిస్టు కాలనీలోని పాలపిట్ట సర్కిల్ పరిసర ప్రాంతాల్లో తిరిగి రహదారులపై ప్యాచ్‌వర్కులను చేయకుండా వదిలేయడాన్ని గమనించారు. జూబ్లీహిల్స్ రోడ్ నం.45, రోడ్ నం.70, గౌతంనగర్ బస్తీ, దీన్ దయాళ్ నగర్ బస్తీ, ఫిల్మ్ నగర్, పీఈటీ పార్క్ ప్రాంతాల్లో తరచూ చెత్త వేసే ప్రాంతాలు పరిశీలించారు. భారీ వర్షం కురిసినపుడు రోడ్డుపై భారీగా వర్షపు నీరు నిల్వకుండా నిర్మిస్తున్న వాటర్ సంపుల కోసం ఏరియాలను గుర్తించాలని జోనల్ కమిషనర్ ను ఆదేశించారు. రోడ్డుపై పారిశుద్ధ్య విధులు నిర్వహిస్తున్న శానిటరీ పీల్డ్ అసిస్టెంట్, కార్మికులను దాన కిషోర్ పలకరించారు. ఏమైనా సమస్యలున్నాయా? అంటూ ఆరా తీశారు. పని వేళల్లో కార్మికులు తప్పనిసరిగా యూనిఫాం, హ్యాండ్ గ్లౌజ్లు ధరించి రక్షణ చర్యలు పాటించాలన్నారు. అలాగే నగరంలో చెత్త ఎక్కువగా ఉత్పన్నమయ్యే ప్రాంతాలపై ప్రధానంగా దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ఎక్కువ చెత్త ఉత్పత్తి అయ్యే ప్రాంతాల్లో రెండు షిప్టులో చెత్త సేకరించి, తరలించాలని ఆదేశించారు. పలుప్రాంతాల్లో ప్రభుత్వం నిర్మిస్తున్న నీటి నిల్వ సంపుల పనుల్ని పరిశీలించారు. వర్షాకాలంలో నగరంలో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం సంపుల నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. మొత్తం 140 వాటర్ లాగింగ్ పాయింట్లు ఉండగా, ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను గుర్తించి అనువైన స్థలాలైన ఖైరతాబాద్ జోన్, జూబ్లీహిల్ సర్కిళ్లలో రూ. 20 కోట్లతో మొత్తం 11 ప్రాంతాల్లో 10 లక్షల లీటర్ల సామర్థ్యం గల సంపుల నిర్మాణ పనులు చేపట్టినట్లు దాన కిషోర్ వెల్లడించారు. . ఈ తనిఖీల్లో జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతితో పాటు జలమండలి, జీహెచ్‌ఎంసీ అధికారులున్నారు.



## కులగణన, 42 శాతం రిజర్వేషన్ల కోసం సామూహిక ఆమరణ దీక్షలు

### - కృష్ణయ్య

**విశ్వంభర, ఖైరతాబాద్ :** కులగణన, 42 శాతం రిజర్వేషన్ల సాధన కోసం మాజీ సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఆమరణ దీక్ష చేపడుతామని బీసీ సంఘాల నాయకులు స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బీసీ కుల, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌కు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉండాలన్నారు. ఎంపీ, ఎమ్మెల్యేల సీట్ల కేటాయింపుల్లో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, కనీసం బీసీలకు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ అయ్యే అర్హత కూడా లేదా అని ప్రశ్నించారు. కులగణన చేయకుండా ప్రభుత్వం సాకులు చెబితే ఊరుకునే ప్రసక్తే లేదన్నారు. బీసీల విశ్వసనీయత కోల్పోకముందే కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం చిత్తశుద్ధి ఉన్నా తక్షణమే కులగణన చేసి, 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు.

అధికార పార్టీలో ఉన్న బీసీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర పార్టీల ప్రజాప్రతినిధులు సమగ్ర కులగణనపై ఆయా పార్టీలపై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ జనసభ రాష్ట్ర అధ్యక్షులు రాజారాం యాదవ్ మాట్లాడుతూ కామారెడ్డి బీసీ డిక్లరేషన్ మాటను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. హిందూ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు బత్తుల సిద్దేశ్వర్లు మాట్లాడుతూ ప్రాణాలు పోయినా సరే సామూహిక ఆమరణ దీక్ష చేసి సమగ్రకులగణన, 42 శాతం రిజర్వేషన్లు సాధిస్తామన్నారు. తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్రఅధ్యక్షులు మేకపోతుల నరేందర్ గౌడ్, సోషల్‌జస్టిస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పిడికిలి రాజు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే



**విశ్వంభర, ఎల్బీనగర్:** అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొంది ఖర్చులు ఎక్కువై ఇబ్బందులు ఎదుర్కొని స్థానిక నాయకుల ద్వారా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆర్కేపురం డివిజన్ ఎన్టీఆర్ నగర్ కి చెందిన శ్రీనివాస్ ముదిరాజ్ కు రూ. 54,500లు, విమల కుమారికి రూ. 17,500ల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద సబితా ఇంద్రారెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నాయకులు సాజీద్, మురళీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న ఫోన్‌లు అందజేత

**విశ్వంభర, ఎల్బీనగర్:** వివిధ కారణాలతో పోగొట్టుకున్న, దొంగిలించబడ్డ సెల్ ఫోన్లు తిరిగి అందచేసిన సంఘటన సరూర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్స్పెక్టర్ వి సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాదు దారుల నుండి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి ఎక్విప్ మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్ ద్వారా మొబైల్ ఫోన్ లను బ్లాక్ చేసి వివిధ ప్రాంతాల్లో రికవరీ చేయడం జరిగిందన్నారు. అందులో భాగంగానే 40 సెల్ ఫోన్లని గుర్తించడం జరిగిందని తెలిపారు. గుర్తించిన ఫోన్లను శుక్రవారం బాధితులు (ఫిర్యాదుదారులు)లకు అందజేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటెక్టివ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావన్ కుమార్, క్రైమ్ సిబ్బంది పాల్గొన్నారు.




## అందరికీ రుణమాఫీ..అతిపెద్ద అబద్ధం

- ఇప్పటికే మాకు లక్షకు పైగా ఫిర్యాదులొచ్చాయి
- ఇతరులను చిన్నబుచ్చి మాట్లాడితే గొప్పోళ్లు కాలేరు
- సీఎం రేవంత్ రెడ్డికి నిరంజన్ రెడ్డి హితవు



**విశ్వంభర, హైదరాబాద్:** రుణమాఫీ అమలుపై మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దిల్‌సుఖ్‌నగర్‌లో విమానాలు అమ్మడం ఎంత నిజమో.. తెలంగాణలో భాక్రానంగల్ డ్యామ్ ఎంత నిజమో.. తెలంగాణలో రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన రుణమాఫీ అంతే నిజమని విమర్శించారు. అభినవ గోబెల్స్ అవార్డు ఇస్తే అది రేవంత్ సర్కారుకు దక్కుతుందని ఎద్దేవా చేశారు. ఎన్నికల సమయంలో రైతులందరికీ రుణమాఫీ చేస్తామని పదే పదే చెప్పారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. బడాయిల బచ్చిగానికి ఏడు దొడ్లు.. మూడు ఎడ్లు అన్నట్లు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు, చేస్తున్న పనులకు తెలంగాణ ప్రజలు చెప్పుకునే ఈ మాటలు సరిగ్గా సరిపోతాయని తెలిపారు. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డి ప్రచారంలో చెప్పారని గుర్తుచేశారు. జనవరి 6న ఓ మీడియా ఛానల్‌తో ఒకటి, రెండు నెలలలో రుణమాఫీ చేస్తామని రేవంత్ రెడ్డే ప్రకటించారని అన్నారు. మూడు విడతల్లో రూ.31 వేల కోట్లు ఆగస్ట్ లోపలే పూర్తి చేస్తానని జులై 18న హామీ ఇచ్చారని అన్నారు. జూలై 28న అమెరికా వెళ్తూ రాగానే రుణమాఫీ చేస్తానని రేవంతే ప్రకటించారని అన్నారు. కానీ ఆగస్ట్ 15న రూ.17,869 వేల కోట్లు రుణమాఫీ చేశామని చెప్పుకున్నారని తెలిపారు.

ఇతరులను చిన్నబుచ్చి మాట్లాడినంత మాత్రాన గొప్పోళ్లు కాలేరని.. వాళ్లకన్నా గొప్ప పనులు చేస్తే గొప్పవాళ్లు అవుతారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి హితవుపలికారు. ఈ శతాబ్దానికి సరిపడినంత మోసం కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రైతాంగానికి చేసిందని మండిపడ్డారు. రుణమాఫీపై బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన కాల్ సెంటర్‌కు ఇప్పటి వరకు 1,11,027 వాట్సాప్ ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. బీఆర్ఎస్ కాల్ సెంటర్‌కు వచ్చిన ఫిర్యాదులను సీఎం కార్యాలయానికి పంపిస్తామని చెప్పారు. ఆగస్ట్ 15 నాటికి అందరి రైతుల రుణాలు మాఫీ అవుతాయని రేవంత్ ప్రకటించాడని సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. మరి రూ.31 వేల కోట్లకు కేవలం 17 వేల కోట్లతో రుణమాఫీ ఎలా పూర్తవుతుందని ప్రశ్నించారు. ఆరు గ్యారంటీలలో ఉచిత బస్సు మినహా ఏ ఒక్క హామీ పూర్తిగా అమలు చేయలేదని మండిపడ్డారు. ఆరు గ్యారంటీలు గడువులోగా అమలు చేస్తే పదవికి రాజీనామా చేస్తానని హరీశ్ రావు అన్నారని అన్నారు. ఆ విషయాన్ని రుణమాఫీ చుట్టూ తిప్పి అరకొరగా అమలుచేసి రుణమాఫీ అయిపోయిందని దబాయిస్తూ రాజీనామా చేయాలని దుర్భాషలాడడం సరికాదని హితవుపలికారు. రాష్ట్రంలో ఏడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై అత్యధిక ప్రజాదరణ కలిగిన నేత హరీశ్ రావు అని తెలిపారు. ఏ బ్యాంకులో రైతుల రుణాలు మాఫీ అయ్యాయో సర్కారు చెబుతుందా ? రుణమాఫీ అయిపోతే రాష్ట్రంలో రైతులు ఎందుకు బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నారని నిలదీశారు. రాష్ట్రంలో 70 లక్షల మంది రైతులు ఉండగా 60 లక్షల మంది రుణాలు తీసుకున్నారని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వం 44 లక్షల మంది అని లెక్కలు చెబుతున్నదని.. మరి ప్రభుత్వం ఎందుకు 22 లక్షల మంది రైతులకు మాత్రమే రుణమాఫీ ఎందుకు చేసిందని ప్రశ్నించారు. అసలుకంటే కొసరు ఎక్కువ అన్నట్లు రుణమాఫీపై మీడియా ప్రకటనలకే రూ.300 కోట్లు వరకు ఖర్చు చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ పాలనలో రూ.29 వేల కోట్లు రుణమాఫీ, రూ.72 వేల కోట్లు రైతుబంధు పథకం కింద రైతులకు అందజేసి అండగా నిలిచామని తెలిపారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీ ప్రకారం రైతుభరోసా విడత కింద ఒక్కసారికి రూ.15 వేల కోట్లు అవసరం అవుతుందని.. రైతుభరోసా ఎగ్గొట్టి రూ.17 వేల కోట్లు రుణమాఫీ చేసి రైతులను మోసం చేసిందని పేర్కొన్నారు. మాట మీద నిలబడిన హరీశ్ రావును రాజీనామా చేయమనడం హాస్యాస్పదమని సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విమర్శించారు. పార్లమెంటులో ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈ మధ్యకాలంలో చాలా విషయాలలో చక్కగా వ్యవహరిస్తున్నాడని.. మరి అదే పార్టీకి చెందిన ముఖ్యమంత్రి తెలంగాణలో ఎదుటి వ్యక్తులను అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని... తూలనాడుతున్నాడని మండిపడ్డారు. రాహుల్ గాంధీ మాట్లాడే హిందీ, ఇంగ్లీష్ భాషలు చాలా చక్కగా ఉంటాయి .. అవి రేవంత్ రెడ్డికి అర్థంకానట్లుందని.. అందుకే అడ్డగోలుగా మాట్లాడుతున్నాడని అన్నారు. కనీసం కృష్ణానదిలో పోతున్న నీటిని ఒడిసిపట్టుకునే ఆలోచన ప్రభుత్వానికి లేదని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. పాలమూరు జిల్లాలో కుంటలు, చెరువులు వెలవెలబోతున్నాయని అన్నారు. కట్టిన రిజర్వాయర్లను నింపుకునే సోయి ప్రభుత్వానికి లేదని మండిపడ్డారు. గత ఎనిమిది నెలలలో తట్టెడు మట్టి తీయకుండా పనులు పక్కన పెట్టారని అన్నారు. పాలమూరు రంగారెడ్డి పథకంలో మూడు రిజర్వాయర్లలో 28 టీఎంసీల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉన్నా గాలికి వదిలేశారని విమర్శించారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దీనంగా ఉందని.. ప్రజల పట్ల ప్రభుత్వం నిర్దయగా వ్యవహరిస్తుందని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మండిపడ్డారు. పాలమూరు నుంచి ముఖ్యమంత్రి అయినందుకు రోషం ఉంటే, సిపాయి అయితే కేసీఆర్ కన్నా వేగంగా పనులు చేసి చూయిస్తానని సవాలు విసిరి పనులు చేసి చూపించాలని అన్నారు. బీఆర్ఎస్ పాలనలో ఒక స్థాయికి వచ్చిన తెలంగాణ వ్యవసాయం కాంగ్రెస్ పాలనలో ఆగమైందని ఆవేదన వ్యక్తం చేశారు.

## ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ధర్నా




**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాల అక్రమ డొనేషన్లల దందాపై విచారణ జరిపించి నష్టపోయిన విద్యార్థి తల్లిదండ్రులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కళాశాల ముందు భారీ ధర్నా నిర్వహించారు. వర్షంలో సైతం తమ ఆందోళనను కొనసాగించారు. ఏరోనాటికల్ ఇంజనీరింగ్ కళాశాలలో డొనేషన్ పేరుతో లక్షల రూపాయలు దోపిడీ చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని వెంటనే అరెస్టు చేసి విద్యార్థులందరికీ అడ్మిషన్లు ఇచ్చి న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎల్. మూర్తి, టి.నాగరాజు డిమాండ్ చేశారు. 250 మంది విద్యార్థుల నుంచి ఒక్కొక్కరు నుండి 14 లక్షల నుండి 16 లక్షల వరకు అక్రమ డొనేషన్ల పేరుతో 200 కోట్ల పైగా రసీదులు లేకుండా ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యం వసూలు చేసిందన్నారు. కళాశాలలకు కేవలం 320 మంది ఇంటెక్ తీసుకోవడానికి అవకాశం ఉండగా 500 పైగా అడ్మిషన్లను తీసుకున్నారన్నారు. బీ కేటగిరి సీట్ల నోటిఫికేషన్ రాకముందే విద్యార్థుల దగ్గర అక్రమ పద్ధతిలో డొనేషన్ వసూలు చేసి సీట్లు ఇస్తామని యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులకు హామీ ఇచ్చిందని తెలిపారు. మూడవ పేజీ కౌన్సిలింగ్ చివరి రోజు విద్యార్థులకు సీట్లను ఎలాట్ చేయకపోవడంతో విద్యార్థుల తల్లిదండ్రులు యాజమాన్యం నిలదీయడంతో చేసేదేమీ లేక సీట్లు ఇవ్వలేమని చేతులెత్తేశారని అన్నారు. పైగా ఈ విషయాన్ని ఎవరికీ చెప్పొద్దని తప్పుడు పద్ధతిలో సీట్లు లేవని కావాలంటే డబ్బులు ఇస్తామని బెదిరింపులకు దిగారని వారు అన్నారు. తక్షణమే ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం విచారణ జరిపి తల్లిదండ్రులను మోసం చేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పై చీటింగ్ కేసు నమోదు చేయాలని, నల్లధనాన్ని వసూలు చేసి ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా చట్టాన్ని ఉల్లంఘించిన కేసులో అరెస్టు చేయాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేస్తుందని అన్నారు. విద్యార్థులకు న్యాయం చేయకుంటే డబ్బులు తీసుకున్న విద్యార్థులకు అడ్మిషన్లు ఇవ్వకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ అంశంపై ఉన్నత విద్యా మండలి జోక్యం చేసుకొని కళాశాలలో సీట్ల దందాపై డొనేషన్ల పై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోకపోతే ఉన్నత విద్యా మండలి సైతం ముట్టడిస్తామని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జి. కార్తీక్, రాథోడ్ సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు వంశీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు భగత్, ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, నందీశ్వర్, కర్ణాకర్, శ్రీకాంత్, సాయిరాం, ఆజాద్ పాల్గొన్నారు.

## కలెక్టర్ ఆదేశాల మేరకు సందర్శన



**విశ్వంభర, ఘట్కేసర్:** మేడ్చల్ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి సాంబశివరావు ఘట్కేసర్ మండలంలోని ఎదులాబాద్ గ్రామపంచాయతీ పరిధిలో గల పల్లె దవాఖానాలను, ఆయుష్మాన్ భారత్ కేంద్రాలను, బస్తీ దవాఖానాలు, అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలను పర్యవేక్షించారు. పల్లె దవఖానాలో రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో ఈ సీజన్లో వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించడం అదేవిధంగా సీజనల్ వచ్చే వ్యాధులను ఎదుర్కొనే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి గీతారెడ్డి, డాక్టర్ పనీంద్రరెడ్డి పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీలో చేరిక



**విశ్వంభర, కుత్బుల్లాపూర్:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలు, రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా సీఎం పాలన దక్షతకు ఆకర్షితులై దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కొలను హనుమంత రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి అని పేద ప్రజల కోసం, రైతుల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం ప్రజా ప్రభుత్వమని అన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, బొంగునూరి శ్రీనివాసరెడ్డి, బొంగునూరి ప్రభాకర్ రెడ్డి, జక్కుల మల్లేష్ యాదవ్, ముత్యం రెడ్డి, మైసిగారి శ్రీనివాస్, ఆకుల ప్రేమ్, కుమార్ యాదవ్, శివకుమార్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ జన్మదిన వేడుకలు

**విశ్వంభర, బషీర్ బాగ్:** ఆమ్ ఆద్మీ పార్టీ తెలంగాణ ఆధ్వర్యంలో ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ జన్మదిన వేడుకలను శుక్రవారం హైదరాబాదులో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన కార్యాలయంలో ఆప్ కన్వీనర్ డాక్టర్ సుధాకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు బుర్ర రాము గౌడ్, రాష్ట్ర అధికార ప్రతినిధి జావిద్ షరీఫ్, రాష్ట్ర యువజన విభాగం కార్యనిర్వాహక అధ్యక్షులు విజయ్ మల్లంగి, మల్కాజ్గిరి జిల్లా కోశాధికారి శివాజీ మామిడి శెట్టి, కొడంగల్ శాసనసభ నియోజకవర్గ ఇంచార్జ్ శ్రీనివాస్, కార్వాన్ శాసనసభ నియోజకవర్గ ఇంచార్జ్ సయ్యద్ సుజా హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైల మహాక్షేత్రంలో
# కన్నుల పండువగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

**విశ్వంభర, శ్రీశైలం:** ధర్మప్రచారంలో భాగంగా శ్రీశైల మహాక్షేత్రంలో శ్రావణ శుక్రవారం ఉచిత సామూహిక వరలక్ష్మి వ్రతాలు నిర్వహించారు. ఆలయ ఉత్తర ద్వారం ఎదురుగా గల చంద్రావతి కల్యాణ మండపంలో ఈ వ్రతాలు ఏర్పాటు చేశారు. ఆన్ లైన్ లో పేర్లు నమోదు చేసుకున్న వారితోపాటు దేవస్థానం కార్యాలయంలో స్థానికంగా నమోదు చేసుకున్న మొత్తం 1500 మందికి పైగా భక్తులు ఈ సామూహిక వరలక్ష్మి వ్రతాల్లో పాల్గొన్నారు. స్థానికులతోపాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు కూడా ఈ వ్రతంలో పాల్గొన్నారు. ఈ వ్రతాలకు కావాల్సిన పూజా ద్రవ్యాలన్నీ దేవస్థానమే సమకూర్చింది. వ్రతంలో పాల్గొనే ప్రతి ఒక భక్తురాలికి వేర్వేరుగా కళశాలు ఏర్పాటు చేసిన శాస్త్రోక్తంగా వ్రతం జరిపించారు. సంప్రదాయ బద్ధంగా సాగిన ఈ వ్రతంలో ముందుగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు మహాగణపతి పూజ నిర్వహించారు. తర్వాత వేదికపై వేంచెబు చేయించిన శ్రీ స్వామి అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజలు జరిపించారు.



వరలక్ష్మి వ్రతంలో భాగంగా భక్తులందరి చేత విడివిడిగా కలశ స్థాపన చెయించి వరలక్ష్మి దేవి వారిని సమంత్రకంగా ఆవాహన చేశారు. తర్వాత శ్రీసూక్త విధానంలో వ్రతకల్ప పూర్వకంగా వరలక్ష్మి దేవి వారికి షోడశోపచార పూజలు జరిపించారు. అనంతరం ఆలయ అర్చలకు వ్రతకథ పఠించి వ్రత మహిమావిశేషాలను భక్తులకు తెలిపారు. చివరిగా నీరాజన మంత్ర పుష్పాలు జరిపి వ్రత సమాప్తి చేశారు.

వరలక్ష్మి వ్రతం జరిపించుకున్న వారందరికీ చీర, రవిక వస్త్రం, పూలు, గాజులు, కంకణాలు, తులసిమొక్క, శ్రీశైల ప్రభ మాస పత్రిక, మూడు రకాల ప్రసాదాలు అందజేశారు. భక్తులకు తొలిసారిగా శ్రీశైల దేవస్థానం ఆధ్వర్యంలో చీర, తులసి మొక్క అందజేయడం విశేషం. వ్రతం అనంతరం భక్తులందరికీ ప్రత్యేక క్యూలైన్ ద్వారా స్వామి అమ్మవార్ల దర్శనం కల్పించారు. కార్యక్రమంలో శ్రీశైలం ఈఓ డీ పెద్దిరాజు దంపతులు, డిప్యూటీ ఈఓ ఆర్ రవణమ్మ, ఆలయ సహాయ కార్య నిర్వహణాధికారి ఎం హరిదాసు, అద్యాపకులు ఎం పూర్ణానందం, పలువురు అర్చక స్వాములు, వేద పండితులు, పలు విభాగాల పర్యవేక్షకులు, సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఈఓ పెద్దిరాజు మాట్లాడుతూ మన వైదిక సంప్రదాయంలో శ్రావణ మాసంలో వరలక్ష్మి వ్రతం ఆచరించడం సంప్రదాయంగా వస్తున్నదని అన్నారు. శ్రావణ మాసం సర్వదేవతా ప్రీతికరం అని చెప్పారు. ధార్మిక కార్యక్రమాల నిర్వహణలో భాగంగానే దేవస్థానం ఆధ్వర్యంలో వరలక్ష్మి వ్రతాలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ సామూహిక వరలక్ష్మి వ్రతంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనడం ఎంతో హర్షణీయం అని అన్నారు. అర్చక స్వాములు మాట్లాడుతూ జ్యోతిర్లింగ స్వరూపుడైన మల్లికార్జున స్వామి, మహాశక్తి స్వరూపిణి భ్రమరాంబికా దేవి స్వయంవక్తంగా వెలిసిన శ్రీశైల మహాక్షేత్రంలో వరలక్ష్మి వ్రతం జరిపించుకునే వారంతా ఎంతో అదృష్టవంతులన్నారు. అందరికీ శ్రేయస్సు కలుగుతుందన్నారు. భక్తులంతా వ్రత ప్రక్రియ సౌకర్యవంతంగా వీక్షించడానికి వీలుగా తొలిసారి ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. చంద్రావతి కల్యాణ మండపంలో మొత్తం ఐదు ఎల్ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు.



## అభాగ్యునికి 'ఆధార్'తో బాసట
## యూడాయ్ ఉన్నతాధికారుల చొరవ

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** కాలు విరిగి చికిత్స చేయించుకోవటానికి ఆధార్ కార్డు లేక అవస్థలు పడుతున్న ఓ అభాగ్యునికి యూడాయ్ ఉన్నతాధికారులు బాసటగా నిలిచిన సంఘటన శుక్రవారం భద్రాచలంలో చోటు చేసుకుంది. భద్రాచలంలో శిల్పినగర్ ప్రాంతంలో చెల్లూరి మల్లయ్య బిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గత ఆరు నెలల క్రితం చిన్నజీయర్‌స్వామి మఠం వద్ద డ్రైనేజీలో పడి కాలు విరిగింది. చికిత్స చేయించుకోవటానికి ఆర్ధిక స్థోమత సరిపోలేదు. ప్రభుత్వాసుపత్రికి వెళ్తే ఆరోగ్యశ్రీలో సర్జరీ చేయటానికి ఆరోగ్య శ్రీ అడిగారు. దీంతో విరిగిన కాలుతో ఆరు నెలలుగా అష్టకష్టాలు పడుతున్నాడు. ఈ క్రమంలో బిక్షాటన చేసుకుంటూ శుక్రవారం అంబేద్కర్ సెంటర్‌లోని చేతనా మీ సేవా వద్దకు వచ్చి తన గోడును నిర్వహకులు భూక్యా రంజిత్ నాయక్‌కు వెల్లడించారు. దీంతో స్పందించిన రంజిత్ యుడాయ్ ఉన్నతాధికారి చైతన్య రెడ్డిను సంప్రదించి వివరాలు పంపాడు. సత్వరమే స్పందించిన చైతన్య రెడ్డి ఆయన పేరు, ఇతర వివరాలతో ఆధార్ నెంబర్‌ను తెలపటంతో రంజిత్ ఉచితంగా ఆధార్ కార్డును ప్రింట్ చేసి పట్టణ ప్రముఖులు వాసిరెడ్డి రమేష్‌బాబు చేతుల మీదుగా అందచేశారు. ఆరు నెలలుగా పడుతున్న కష్టానికి మీ సేవ నిర్వహకులు స్పందనతో వెంటనే లభించటంతో కన్నీళ్లతో మల్లయ్య చైతన్య రెడ్డి, రంజిత్‌నాయక్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మీ సేవా సిబ్బంది ఈశ్వర్, విజయ్, ఉపాధ్యాయులు ధారావత్ భాస్కర్, బాసు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామాలయం భూములు ఆక్రమణ

**విశ్వంభర, భద్రాద్రి కొత్తగూడెం:** భద్రాద్రి, శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయ భూముల్లో మరోసారి వివాదం చోటుచేసుకుంది. భద్రాద్రి రామయ్యకు భద్రాచలానికి ఆనుకొని ఉన్న ఏపీలోని అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో 900 ఎకరాల భూములు ఉన్నాయి. ఈ భూముల్లో చాలా కాలం నుంచి అనేక మంది ఆక్రమణ దారులు భూములను ఆక్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో భద్రాద్రి రామాలయం భూములు రామాలయానికే చెందుతాయని సుప్రీంకోర్టుతో పాటు అన్ని కోర్టులు ఆర్డర్లు జారీ చేశాయి. అయినప్పటికీ పురుషోత్తపట్నంలోని గోశాల ఎదురుగా ఉన్న ఆక్రమణ దారులు శాశ్వత భవనాలను నిర్మించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ నేపథ్యంలో ఆలయ కార్య నిర్వహణ అధికారి ఎల్ రమాదేవి ఆక్రమణలను తొలగించడానికి ఆలయ సిబ్బందితో కలిసి ఆలయ భూములు వద్దకు వెళ్లారు. దీంతో ఆక్రమణదారులు ఆలయ ఈవో రమాదేవి పై సిబ్బందిపై దాడికి దిగారు. గత రెండు రోజుల నుంచి అక్రమంగా నిర్మిస్తున్న నిర్మాణ పనులు ఆపాలని ఈవో చెప్పినప్పటికీ ఆక్రమణ దారులు ఊరుకోకుండా దాడులకు తెగబడుతూనే ఉన్నారు. దీంతో ఆలయ సిబ్బందికి ఆక్రమణ దారులకు వివాదం జరుగుతూనే ఉంది.

## పీడితుల తరపున పోరాడేందుకు ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భవించింది



**విశ్వంభర, కోరుట్ల:** కోరుట్లలో జరిగిన ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధ సభలో డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు గౌరవ డాక్టర్ విశారదన్ మహరాజ్ మాట్లాడుతూ పీడితులైన బడుగు బలహీన వర్గాల ప్రజలకు విద్య వైద్యం ఉపాధి ఇల్లు భూమి అంశాలలో ఎలాంటి న్యాయం చేయకుండా, ప్రజా పాలన పేరున బీసీ, ఎస్సీ, ఎస్టీలను వంచిస్తూ, గతంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం లాగానే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కూడా మాటలకే పరిమితమైందని, గతం నుండి ఇప్పటి వరకు జరిగిన అనేక ఉద్యమాలలో ఈ బీసీ.ఎస్సీ.ఎస్టీ ప్రజలను పాలకవర్గాలు మోసం చేశారని గుర్తు చేశారు. వర్ష కొండలో ధర్మ సమాజ్ పార్టీ ధర్మ యుద్ధాన్ని ప్రకటిస్తూ వచ్చే స్థానిక ఎన్నికల్లో ధర్మసమాజ్ పార్టీ పోటీ చేస్తుందని తెలియజేశారు. ఇప్పటికైనా బహుజనులంతా ఏకమై బహుజన రాజ్యాధికారం కోసమై ధర్మసమాజ్ పార్టీలో చేరి స్వరాజ్యాన్ని సాధించుకోవాలని విశారదన్ మహరాజ్ సూచించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ ఇన్చార్జ్ కిషోర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా నాయకులు శ్రీకాంత్, జగిత్యాల జిల్లా కన్వీనర్ తిరుపతి, జిల్లా కమిటీ సభ్యులు గంగరాజం రమేష్, శివ, కోటేష్, జీవన్, వివిధ కుల సంఘ పెద్దలు పాల్గొన్నారు.

## రెవిన్యూ పాలన పారదర్శకంగా జరగాలి
**- కలెక్టర్ రాహుల్ రాజ్**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** జిల్లాలో రెవెన్యూ పాలన అత్యంత పారదర్శకంగా జరగాలని జిల్లా కలెక్టర్ రాహులరాజ్ అన్నారు. శుక్రవారం తూప్రాన్ ఆర్డీవో కార్యాలయాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. కార్యాలయంలో ఫైల్స్ నిర్వహణ, ల్యాండ్ రెవెన్యూ, ల్యాండ్ మేనేజ్మెంట్, ఆర్.ఆర్.ఆర్, రెవిన్యూ కలెక్షన్, ప్రజలకు కావాల్సిన కనీస అవసరాల గురించి, సిబ్బంది పనితీరు సంబంధిత విషయాలను ఆర్డీవోను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ కార్యాలయ పనితీరు ప్రజలకు ఆదర్శంగా ఉండాలని వివిధ సమస్యలపై కార్యాలయానికి వచ్చే ప్రజలకు వారి సమస్యలను ప్రభుత్వ నిబంధనల మేరకు పరిష్కరించాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ జై చంద్రారెడ్డి సంబంధిత రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

## కరీంనగర్‌లో నేడు వైద్య సేవలు బంద్



**విశ్వంభర, కరీంనగర్:** కలకత్తా గవర్నమెంటు మెడికల్ కాలేజీలో డ్యూటీలో ఉన్న పీజీ మహిళ డాక్టర్ పై జరిగిన అఘాయిత్యం, హత్యకు, ఆ తరువాత హాస్పిటల్ పై జరిగిన దాడులను నిరసిస్తూ దేశవ్యాప్త ఆందోళనలో భాగంగా శనివారం ఉదయం 6 గం. నుండి ఆదివారం ఉదయం 6 గం. వరకు కరీంనగర్ లో ఉన్న అన్ని హాస్పిటల్స్‌లో అన్ని రకాల వైద్య సేవలను నిలిపి వేస్తునట్లు అధ్యక్షుడు డా. పొలాస రామ్ కిరణ్, కార్యదర్శి డా. వెంకటరెడ్డి లు తెలిపారు. ఉదయం 10 గం.లకు కలెక్టరేట్ వద్ద ధర్నా కార్యక్రమంను ఐయంఏ కరీంనగర్ ఆద్వర్యంలో నిర్వహిస్తున్నట్లు డా. పొలాస రామ్ కిరణ్, డా. వెంకట రెడ్డి తెలిపారు.

## వందశాతం రుణమాఫీ అయిందని నిరూపిస్తారా..
**మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్**



**విశ్వంభర, భూపాలపల్లి:** రైతులకు మాట ఇచ్చినట్లుగా వంద శాతం రుణమాఫీ అయినట్లు ప్రజలతో అమోదం పొంది నిరూపిస్తరా అని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ప్రశ్నించారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పాల్గొన్న మాజీ జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్, మాజీ ఎమ్మెల్యే, భీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్, గ్రంథాలయ సంస్థ మాజీ మంత్రి రఘువీర్ సింగ్, గంట రాములు, ఉప్పు రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో పుట్ట మధూకర్ మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి మాజీ మంత్రి హరీష్‌రావును ఉద్దేశించి తన పదవికి రాజీనామా చేస్తవా లేకపోతే అమరవీరుల స్థూపం వద్ద ముక్కు నేలకు రాస్తవా అని మాట్లాడారని, ఒక ముఖ్యమంత్రి హోదాలో అలా ఎవరైనా మాట్లాడుతారా అని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రి మాట్లాడుతున్నారంటే ఎదో గొప్ప సందేశం ఇస్తారని ప్రజలు ఆసక్తిగా చూడాలే కానీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎప్పుడు చూసినా మాజీ సీఎంను, బీఆర్ఎస్ పార్టీని దూషించడం తప్ప ప్రజల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడటం లేదన్నారు. సీఎం మాట్లాడుతున్న తీరు ఆ హోదాపై ప్రజల్లో నమ్మకం పోతుందని, ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియాలో సీఎం మాట్లాడుతుంటే కనీసం చూసే పరిస్థితులు కన్పించడం లేదని విమర్శించారు. పూర్థిస్థాయిలో రుణమాఫీ చేశామంటూ తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకుని గొప్పలు చెప్పుకోవడం కాదని, నియోజకవర్గ స్థాయిలో స్థానిక ఎమ్మెల్యేలను గ్రామాలకు పంపించి ప్రజలు, రైతులతో వందశాతం రుణమాఫీ జరిగిందని ఆమోదం పొందుతారా అని ఆయన అన్నారు. నూటా ఒక్క ఆంక్షలు పెట్టి రుణమాఫీ చేశామని గొప్ప చెప్పుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఆరు గ్యారెంటీ పథకాల పేరుతో అధికారంలోకి వచ్చి కేవలం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి అన్ని చేశామని చెప్పుకోవడం సిగ్గు చేటు అన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలకు, రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## ఇంటర్ గెస్ట్ లెక్చరర్లను కొనసాగించాలి

- రూ.42వేల వేతనాన్నివ్వండి
- కమిషనరేట్‌ను ముట్టడించిన అధ్యాపకులు



**విశ్వంభర, హైదరాబాద్:** ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ లెక్చరర్లను ఈ విద్యాసంవత్సరం మొత్తం కొనసాగించాలని డిమాండ్ చేస్తూ లెక్చరర్లు శుక్రవారం నాంపల్లిలోని ఇంటర్ విద్యా కమిషనరేట్‌ను ముట్టడించారు. రూ. 42వేల వేతనాన్ని అమలుచేయాలని డిమాండ్ చేశారు. ఇంటర్ విద్యా జేఏసీ చైర్మన్ డాక్టర్ పీ మధుసూదన్‌రెడ్డి నేతృత్వంలో పలు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన లెక్చరర్లు కమిషనరేట్ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ సందర్భంగా మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ఆగస్టు 15 దాటినా.. గెస్ట్ లెక్చరర్లను కొనసాగించకపోవడం అత్యంత దారుణమని వాపోయారు. 18 జూనియర్ కాలేజీలు కొత్తవి ఇవ్వగా, వాటిలో లెక్చరర్లు లేక చదువులు ముందుకు సాగడంలేదని ఆందోళన వ్యక్తంచేశారు. మ్యానిఫెస్టోలో పేర్కొన్నట్టు గెస్ట్ లెక్చరర్లకు నెలకు రూ.42వేల వేతనాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు ఎండీ భాషా, ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, సదానంద్‌గౌడ్ పాల్గొన్నారు.

## ఎస్‌బీఐ కాలనీ వాసులను పరామర్శించిన ఎమ్మెల్యే

**విశ్వంభర, ఎల్బీనగర్:** మహేశ్వరం నియోజకవర్గం సరూర్ నగర్ డివిజన్ లో గురువారం రాత్రి కురిసిన భారీ వర్షానికి ఎస్‌బీఐ కాలనీ ముంపునకు గురైన విషయం తెలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించి కాలనీ వాసులతో సమావేశమై వారి స్థితిగతులను మహేశ్వరం శాసన సభ్యురాలు సబిత ఇంద్రారెడ్డి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హాయంలో ఎస్.ఎన్.డీ.పీ నాల కోసం 6 కోట్ల నిధులు మంజూరు చేయడం జరిగిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ నిధులను అడ్డుకొని కాలయాపన చేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ యూత్ వింగ్ అధ్యక్షుడు లోకసాని కొండల్ రెడ్డి, ఋషి, అధికారులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



## అష్టలక్ష్మీ దేవాలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



**విశ్వంభర, ఎల్బీనగర్:** ఆర్కేపురం డివిజన్ లోని అష్టలక్ష్మి దేవాలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించడం జరిగిందని దేవాలయ ప్రధాన అర్చకులు మరుగంటి రాఘవాచార్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఉత్తమ సేవలకు పురస్కారాలు

**విశ్వంభర, బషీర్ బాగ్:** స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ కలెక్టర్, మేజిస్ట్రేట్ అనుదీప్ శెట్టి చేతుల మీదుగా జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సూపరిండెంట్‌గా పని చేస్తున్న కే.ఆర్ రాజ్ కుమార్, అనురాధ, సీనియర్ అసిస్టెంట్లు ఏం భాస్కర్, సాజిద్‌ల ఉత్తమ సేవలకు ప్రశంసా పురస్కారాలను అందించారు.





## సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు భూపాల్ రెడ్డి పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. శంకరంపేట మండలం టెంకటి గ్రామానికి చెందిన అశోక్ ఆసుపత్రి వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన 60,000 రూపాయల చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి అందజేశారు. వారితోపాటు వారి కూతురు శ్రేయ రెడ్డి, నాయకులు కోణం అంజయ్య, విట్టల్, ప్రశాంత్ సాగర్ ఉన్నారు.

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్యేలు



**విశ్వంభర, పెద్ద శంకరంపేట:** జిల్లా ప్రణాళిక సంఘం మాజీ సభ్యులు నగేష్ కుమార్ షెట్కార్ జన్మదిన వేడుకల్లో పలువురు ఎమ్మెల్యేలు, రాష్ట్రస్థాయి చైర్మన్లు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పట్టణంలోని సాయి బాబా ఫంక్షన్ హాల్ లో మాజీ జిల్లా ప్రణాళిక సంఘం సభ్యులు నగేష్ షెట్కార్ జన్మదిన వేడుకలు జరిగాయి. ఈ వేడుకలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి, జహీరాబాద్ ఎంపి సురేష్ కుమార్ షెట్కార్, జూకల్ శాసనసభ్యులు లక్ష్మీకాంతారావు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి, ఆగ్రోస్ చైర్మన్ బాలరాజు, పరిశ్రమల శాఖ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, పాల్గొని శాలువా కప్పి నగేష్ శెట్కార్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలియచేసారు. అనంతరం నిర్వహించిన ఆరోగ్య శిబిరన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ నియోజకవర్గంలోని తాజా మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపీటీసీలతోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రుణమాఫీ అయిపాయే.. నీ రాజీనామా ఏడపాయే..



**విశ్వంభర, భూపాలపల్లి:** రుణమాఫీ అయిపాయే నీ రాజీనామా ఏడపాయే నీకు దమ్ముంటే వెంటనే రాజీనామా చెయ్యాలి హరీశ్‌రావు అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి దొడ్డి కిష్టయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన చిట్యాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పంట రుణాలు మాఫీ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చడంతో దమ్ముంటే రాజీనామా చెయ్.. రుణ మాఫీ అయిపోయే, నీ రాజీనామా ఏడబోయే అని దొడ్డి కిష్టయ్య హరీష్ రావుని డిమాండ్ చేశారు. ఆగష్టు 15 వరకు రాష్ట్రంలోని రైతులందరికీ 2 లక్షల రుణమాఫీ సంపూర్ణంగా అమలు చేసి చూపిస్తే తాను రాజీనామాకు సిద్ధం అని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు గతంలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ సవాల్ ను గుర్తుచేస్తూ సీఎం రేవంత్ రెడ్డి కూడా ఖమ్మం జిల్లా వైరా సభలో చీము నెత్తురు, సిగ్గు శరం ఉంటే హరీశ్ తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలన్నారు. రాజీనామా చేస్తే సిద్దిపేటకు పట్టిన పీడ విరగడ అవుతుందని ధ్వజమెత్తారు. ఒకవేళ రాజీనామా చెయ్యకపోతే అమరుల స్థూపం దగ్గర హరీష్ ముక్కు నేలకు రాసి ప్రజలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.



**బంజారాహిల్స్‌లోని బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ని గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వీరమళ్ళ రామ్ నర్సింహా గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు చేయాలని సూచించినట్లు రామ్ నరసింహ గౌడ్ తెలిపారు.**

**- విశ్వంభర, ఎల్బీనగర్**




# జాతీయ చలన చిత్ర పురస్కారాలు

## ఉత్తమ హీరో రిషబ్, హీరోయిన్లు నిత్యా మీనన్, మానసి ఫరేఖ్

**విశ్వంభర, ఢిల్లీ:** 70వ జాతీయ చలనచిత్ర పురస్కారాలను కేంద్రం ప్రకటించింది. ఉత్తమ చిత్రం అవార్డు మలయాళ సినిమా 'ఆట్టమ్' ను వరించగా.. ఉత్తమ నటుడి పురస్కారం 'కాంతార' సినిమాకుగాను రిషబ్ శెట్టికి దక్కింది. ఉత్తమ నటి పురస్కారానికి నిత్య మేనన్ (తిరుచిట్రంబళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ప్రెస్)ను జ్యూరీ సంయుక్తంగా ఎంపిక చేసింది. 2022 డిసెంబర్ 31 నాటికి సెన్సార్ అయిన చిత్రాలకుగానూ ఈ అవార్డులను ప్రకటించారు.

**ఫీచర్ సినిమాలు**

- **ఉత్తమ చిత్రం:** ఆట్టమ్ (మలయాళం)
- **ఉత్తమ నటుడు:** రిషబ్ శెట్టి (కాంతార కన్నడ)
- **ఉత్తమ నటి:** నిత్య మేనన్ (తిరుచిట్రంబళం - తమిళం), మానసి పరేఖ్ (కచ్ ఎక్స్ప్రెస్ గుజరాతీ)
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తెలుగు):** కార్తికేయ 2
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (కన్నడ):** కేజీయఫ్ 2
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (తమిళం):** పొన్నియిన్ సెల్వన్ - 1
- **ఉత్తమ దర్శకుడు:** సూరజ్ బర్జాత్యా (ఉంచాయి - హిందీ)
- **బెస్ట్ ఫిల్మ్ ప్రమోటింగ్ నేషన్, సోషల్, ఎన్విరాన్మెంటల్ వాల్యూస్:** కచ్ ఎక్స్
- **ఉత్తమ హోల్సమ్ ఎంటర్టైన్మెంట్:** కాంతార (కన్నడ)
- **ఉత్తమ విజువల్ ఎఫెక్ట్స్:** బ్రహ్మాస్త్ర - పార్ట్ 1: శివ (హిందీ)
- **ఉత్తమ దర్శకుడు (డెబ్యూ):** ప్రమోద్ కుమార్, సౌజా (హరియాన్వీ)
- **ఉత్తమ సహాయ నటి:** నీనా గుప్తా (ఉంచాయి- హిందీ)
- **ఉత్తమ సహాయ నటుడు:** పవన్ రాజ్ మల్హోత్రా (సౌజా హరియాన్వి)
- **ఉత్తమ సినిమాటోగ్రఫీ:** పొన్నియిన్ సెల్వన్: పార్ట్ - 1 (తమిళం), సినిమాటో
- **బెస్ట్ ఫిమేల్ ప్లే బ్యాక్ సింగర్ :** బాంబే జయశ్రీ (చాయుమ్ వెయిల్), సినిమా 'సౌదీ వెల్లక్క సీసీ 225/2009'
- **ఉత్తమ ప్లే బ్యాక్ సింగర్ :** అర్జిత్ సింగ్ (కేసరియా) - బ్రహ్మాస్త్ర పార్ట్ 1. శివ
- **ఉత్తమ బాల నటుడు:** శ్రీపాథ్ (మలికాపురమ్ - మలయాళం)
- **ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్:** నిక్కి జోషి (కచ్ ఎక్స్ప్రెస్ - గుజరాతీ)
- **ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ :** ఆనంద అద్య (అపరాజితో)
- **ఉత్తమ ఎడిటింగ్:** ఆట్టమ్, ఎడిటర్: మహేష్ భువనేండ్
- **ఉత్తమ సౌండ్ డిజైన్:** పొన్నియిన్ సెల్వన్ - 1 (తమిళం), డిజైనర్: ఆనంద్ కృ
- **ఉత్తమ స్క్రీన్ప్లే (ఒరిజినల్):** ఆట్టం - ఆనంద్ ఏకార్షి
- **ఉత్తమ మాటల రచయిత:** అర్పితా ముఖర్జీ, రాహుల్ వి చిట్టెల (గుల్మొహర్
- **ఉత్తమ యాక్షన్ డైరక్షన్:** అన్బరివు (కేజీయఫ్ 2)
- **ఉత్తమ కొరియోగ్రఫీ:** జానీ మాస్టర్, సతీష్ కృష్ణన్ మాస్టర్ (తిరుచిట్రంబళం e
- **ఉత్తమ లిరిక్స్:** ఫౌజా (హరియాన్వీ), రచయిత: నౌషద్ సదర్ ఖాన్
- **ఉత్తమ సంగీతం (పాటలు):** బ్రహ్మాస్త్ర- పార్ట్ 1: శివ (హిందీ) - ప్రీతమ్
- **ఉత్తమ సంగీతం (నేపథ్యం):** పొన్నియిన్ సెల్వన్ - 1 (తమిళ్), సంగీత దర్శకు రెహమాన్
- **బెస్ట్ మేకప్: ఆర్టిస్ట్:** సోమనాథ్ కుందు, (అపరాజితో - బెంగాలీ),
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (ఒడియా):** దమన్
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మలయాళం):** సౌది వెళ్లక్క
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (మరాఠీ)** వాల్వీ (ది టెర్నెట్)
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (హిందీ)** గుల్మొహర్
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (బెంగాలీ):** కబేరి అంతర్ధాన్
- **ఉత్తమ ప్రాంతీయ చిత్రం (పంజాబీ):** బాగీ డి దీ
- **బెస్ట్ టివా ఫిల్మ్:** సికాసిల్
- **స్పెషల్ మెన్షన్:** గుల్మొహర్ (హిందీ), నటుడు: మనోజ్ బాజ్పాయ్; కదికన్ (మలయాళం),
- **సంగీత దర్శకుడు:** సంజోయ్ సలీల్ చౌదురి

### నాన్ ఫీచర్ సినిమాలు

- **బెస్ట్ డాక్యుమెంటరీ:** 'మర్మర్స్ ఆఫ్ ది జంగిల్' - మరాఠీ
- **బెస్ట్ ఆర్ట్స్ / కల్చర్ ఫిల్మ్:** రంగ విభోగ (టెంపుల్ డ్యాన్స్ ట్రెడిషన్) - కన్నడ
- **బెస్ట్ ఆర్ట్స్ / కల్చర్ ఫిల్మ్:** వర్ష (లెగసీ) - మరాఠీ
- బెస్ట్ డెబ్యూ ఫిల్మ్ ఆఫ్ ఏ డైరెక్టర్ మధ్యంతర (ఇంటర్మిషన్) - కన్నడ, దర్శకుడు: బస్తి దినేశ్ షెనోయ్
- **బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్:** అయనా (మిర్రర్)
- **బెస్ట్ డైరక్షన్:** 'ఫ్రమ్ ది షాడో' (బెంగాలీ/ హిందీ/ ఇంగ్లిష్), దర్శకుడు: మిరియం చాండీ మినాచెరీ
- బెస్ట్ షార్ట్ ఫిల్మ్: ఉన్యుత (వాయిడ్) - అస్సామీ
- **బెస్ట్ యానిమేషన్ సినిమా:** ఏ కోకోనట్ ట్రీ (సైలెంట్)
- బెస్ట్ నాన్ ఫీచర్ ఫిల్మ్ ప్రమోటింగ్ సోషల్ అండ్ ఎన్విరాన్మెంటర్ వాల్యూస్: 'ఆన్ ది బ్రింక్ సీజన్ 2 - ఘరియాల్) ఇంగ్లిష్
- **బెస్ట్ ఎడిటింగ్:** మధ్యంతర (ఇంటర్మిషన్) - కన్నడ, ఎడిటర్ (సురేశ్ యూఆర్ఎస్)
- **బెస్ట్ సౌండ్ డిజైన్:** యాన్ (వెహికల్)- హిందీ/ మాల్వి, సౌండ్ డిజైనర్: మానస్ చౌధురి
- **బెస్ట్ సినిమాటోగ్రఫీ:** మోనో నో అవేర్ (హిందీ - ఇంగ్లీష్), సినిమాటోగ్రాఫర్: సిద్ధార్థ్ దివాన్
- **బెస్ట్ నెరేషన్ / వాయిస్ ఓవర్:** మర్మర్స్ ఆఫ్ ది జంగిల్ (మరాఠీ), వాయిస్ ఓవర్: సుమంత్ శిందే
- **బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్:** పుర్సత్ (లీజర్) విశాల్ భరద్వాజ్
- **ఉత్తమ స్క్రిప్ట్:** మోనో నో అవేర్ (హిందీ - ఇంగ్లిష్), రచయిత: కౌశిక్ సర్కార్
- **స్పెషల్ మెన్షన్:** బిరుబాలా 'విచ్ టు పద్మశ్రీ (అస్సామీ), హర్గిలా ది గ్రేటర్ అడ్జుటెంట్ స్టార్క్ (అస్సామీ)
- **బెస్ట్ బుక్ ఆన్ సినిమా:** కిషోర్ కుమార్ (ది అల్టిమేట్ బయోగ్రఫీ) - ఇంగ్లిష్, రచయితలు: అనిరుద్ధ భట్టాచార్జీ, పార్థివ్ ధార్
- **ఉత్తమ క్రిటిక్:** దీపక్ దుహా (హిందీ)

# గోడ ఎక్కి పార్లమెంట్‌లోకి యువకుడు

## అరెస్ట్ చేసిన ఢిల్లీ పోలీసులు.. బయటపడ్డ భద్రతా లోపం

**ఢిల్లీ:** పార్లమెంట్ భవనంలో భద్రతా లోపం మరోసారి బయటపడింది. 20 ఏండ్ల వయసున్న యువకుడొకరు గోడ ఎక్కి పార్లమెంట్ ప్రాంగణంలోకి ప్రవేశించాడు. శుక్రవారం మధ్యాహ్నం 2.45 గంటలకు ఆ యువకుడు గోడ ఎక్కి పార్లమెంట్ అనెక్స్ భవన ప్రాంగణంలోకి దూకాడు. పార్లమెంట్ భద్రతను పర్యవేక్షిస్తున్న సీఐఎస్ఎఫ్ సిబ్బంది అప్రమత్తమై స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అతడిని అరెస్ట్ చేసి ఢిల్లీలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నిందితుడి వద్ద అనుమానాస్పద వస్తువులేవీ లేవు. అతడిని యూపీలోని అలీగఢ్‌కు చెందిన మనీశ్‌గా గుర్తించారు. అతను మతిస్థిమితం లేనివాడిలా కన్పిస్తున్నాడని, అతని పేరును కూడా సరిగ్గా చెప్పలేకపోయాడని పోలీస్ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. కేంద్ర బలగాలు కూడా అతడిని ప్రశ్నిస్తున్నాయని ఆ అధికారి చెప్పారు.

# ఎడాపెడా మాట్లాడి - 'ఎక్స్'లో సారీ అంటే ఎలా?

- కేటీఆర్‌పై కొండా సురేఖ మండిపాటు
- క్షమాపణ చెప్పాలని డిమాండ్

**విశ్వంభర, హైదరాబాద్:** ప్రజలు అధికారాన్ని దూరం చేసినప్పటికీ, బీఆర్ఎస్ నాయకులకు అహంకారం తగ్గలేదని దేవాదాయ, అటవీ శాఖల మంత్రి కొండా సురేఖ విమర్శించారు. మహిళలను ఉద్దేశించి బస్సులో బ్రేక్ డ్యాన్సులంటూ మాట్లాడి, ఎక్స్‌లో విచారం చేయడమేంటని ప్రశ్నించారు. కేటీఆర్ మీడియా ముఖంగా క్షమాపణ చెప్పి, ముక్కు నేలకు రాయాలని డిమాండ్ చేశారు. మహిళలపై నోటికొచ్చినట్లు మాట్లాడి, యథాలాపంగా చేసిన వ్యాఖ్యాలంటూ విచారం వ్యక్తం చేసినంత మాత్రాన ప్రాయశ్చిత్తం కాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ట్విటర్‌ను చదువుకున్న వాళ్లు మాత్రమే అనుసరిస్తారని, బహిరంగంగా గ్రామీణ మహిళలపై వ్యాఖ్యలు చేసి చాటుగా క్షమాపణలు చెప్పడమేంటని ఆమె ప్రశ్నించారు. క్లబ్బుల్లో, పబ్బుల్లో బ్రేక్ డ్యాన్సులు చేసిన చరిత్ర కేటీఆర్‌కు ఉండొచ్చు కానీ, మహిళా సమాజాన్ని నోటికొచ్చినట్లు మాట్లాడితే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.ప్రజలు అధికారాన్ని దూరం చేసినప్పటికీ బీఆర్ఎస్ నాయకులకు అహంకారం తగ్గలేదని మంత్రి కొండా సురేఖ దుయ్యబట్టారు. మహిళల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తెచ్చిన ఉచిత బస్సు ప్రయాణ పథకం పట్ల బీఆర్ఎస్ నాయకులు చిన్నచూపు చూస్తున్నారని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. రైతులపై బీఆర్ఎస్ చూపుతున్న ప్రేమ, దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆమె వ్యాఖ్యానించారు. పదేళ్ల పాలనలో బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర రైతాంగానికి చేసిందేమీ లేదని, రుణమాఫీ, పంట నష్ట పరిహారాన్ని తీవ్ర నిర్లక్ష్యం చేసి మోసం చేసిందని కొండా సురేఖ ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాటకు కట్టుబడి రుణమాఫీ అమలు చేసి చూపించిందన్నారు. అసెంబ్లీలో మహిళలను అవమానించారంటూ సీఎం రేవంత్ రెడ్డిపై, బీఆర్ఎస్ చేసిన కుట్ర వికటించిందని



మంత్రి సురేఖ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తండ్రి పేరు చెప్పుకొని రాజకీయాల్లోకి రాలేదని, బీఆర్ఎస్ కుట్రలను ఛేదించి కార్యకర్త నుంచి ముఖ్యమంత్రిగా ఎదిగారని మంత్రి పేర్కొన్నారు.

# రేవంత్ రెడ్డి జాక్‌పాట్ సీఎం

- ఆయనకు నడుమంత్రపు సిరి వచ్చింది
- బాల్క సుమన్ ఎద్దేవా

**విశ్వంభర, హైదరాబాద్:** రేవంత్ రెడ్డికి నడుమంత్రపు సిరి వచ్చిందని, ఆయన జాక్‌పాట్ సీఎం అని బీఆర్ఎస్ నేత బాల్క సుమన్ విమర్శించారు. రేవంత్ రెడ్డికి ఇదే చివరి పదవి అని బాల్క సుమన్ విమర్శించారు. ఆయనకు భవిష్యత్‌లో ఏ పదవి వచ్చేది లేదని అన్నారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే, చిత్తశుద్ధి ఉంటే పనితీరుతో పోటీపడాలని సూచించారు. ఇదే ధోరణితో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తే రాబోయే రోజుల్లో బొక్కా బోర్లా పడటం ఖాయమని హెచ్చరించారు. ముఖ్యమంత్రి అనే విషయాన్ని గుర్తు పెట్టుకొని హుందాగా వ్యవహరించాలని, పద్ధతిగా మాట్లాడాలని సూచించారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీపై రోజుకో మాట మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి రైతులను మోసం చేశారని మండిపడ్డారు. బీఆర్ఎస్ అధ్యక్షుడు కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుతో పోలికా నీది అంటూ ధ్వజమెత్తారు. హరీశ్‌రావుపై రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి హోదాకు తగ్గట్లుగా మాట్లాడాలని హితవు పలికారు. రైతు రుణమాఫీ మోసాన్ని పక్కదారి పట్టించడానికే కేసీఆర్, హరీశ్‌రావుపై ఇష్టారీతిన మాట్లాడారని బాల్క సుమన్ విమర్శించారు. హరీశ్‌రావు గురించి మాట్లాడే అర్హత రేవంత్ రెడ్డికి లేదని మండిపడ్డారు. నిత్యం ప్రజల సంక్షేమం ఆలోచించే వ్యక్తి హరీశ్‌రావు అని.. ఆయన మడమతిప్పని నాయకుడు అని తెలిపారు. రేవంత్ రెడ్డి వ్యవహారం తెలంగాణ సమాజానికి అర్థం అయ్యిందని అన్నారు. రైతు రుణమాఫీ విషయంలో బీఆర్ఎస్ పార్టీని వదిలిపెట్టదని.. వాళ్ల భరతం పడతామని హెచ్చరించారు.



**పెట్టుబడులపై శ్వేత పత్రం ప్రకటించండి**

రేవంత్ రెడ్డి దావోస్, అమెరికా పర్యటనల్లో వచ్చిన పెట్టుబడులపై శ్వేతపత్రం ప్రకటించాలని బాల్క సుమన్ డిమాండ్ చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో ఏ వర్గమైనా సంతోషంగా ఉందా అంటూ ప్రశ్నించారు. రూ.4వేల పింఛన్ అమలు చేయనందుకు, మహిళలకు స్కూటీలు ఇవ్వనందుకు, ఇచ్చిన హామీలు అమలు చేయనందుకు రేవంత్ రెడ్డి ఏట్లో దూకాలని మండిపడ్డారు. అంబేద్కర్ విగ్రహాన్ని రేవంత్ రెడ్డి అవమానిస్తున్నాడని, అక్కడ కనీస స్థాయిలో వసతులు లేకుండా చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ఏ పార్టీలో విలీనం కాదని బాల్క సుమన్ స్పష్టం చేశారు. బీఆర్ఎస్ బలమైన పార్టీ అని, మరో 50 ఏండ్లుగా బలంగా ఉండేందుకు పార్టీ నాయకత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని హెచ్చరించారు. త్వరలోనే బలమైన ప్రాంతీయ పార్టీలు ఉన్న రాష్ట్రాల్లో పర్యటించి అక్కడ అధ్యయనం చేస్తామని తెలిపారు.

# రేవంత్ రెడ్డి అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడు

## సీఎం వ్యాఖ్యలపై కేటీఆర్ సెటైర్



**విశ్వంభర, హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సెటైర్ వేశారు. బీజేపీలో బీఆర్ఎస్ త్వరలోనే విలీనం అవుతుందని, ఆ వెంటనే కేసీఆర్ గవర్నర్, కేటీఆర్ కేంద్రమంత్రి కాబోతున్నారని రేవంత్ చేసిన వ్యాఖ్యలపై కౌంటర్ ఇచ్చారు. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని వ్యంగ్యంగా మాట్లాడారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ.. రైతు రుణమాఫీపై కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రచారాన్ని కేటీఆర్ ఎండగట్టారు. ఈ సందర్భంగా మీడియా అడిగిన ప్రశ్నకు స్పందించిన కేటీఆర్.. రేవంత్ రెడ్డి తొందరలోనే అమెరికా అధ్యక్షుడు కాబోతున్నాడని నేను కూడా స్టోరీలు చెప్పగలన\న్నారు.

# ప్రధాని మోదీతో మహ్మద్ యూనస్ మంతనాలు

## బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై భరోసా



బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతకు అన్ని చర్యలూ చేపడతామని బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ముఖ్య సలహాదారు మహ్మద్ యూనస్ భరోసా ఇచ్చారు. మహ్మద్ యూనస్ తనకు ఫోన్ చేసి ఈ మేరకు హామీ ఇచ్చారని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. ప్రొఫెసర్ మహ్మద్ యూనస్ నుంచి ఫోన్‌కాల్ రిసీవ్ చేసుకున్నానని, బంగ్లాదేశ్ పరిస్థితిపై ఇరువురు అభిప్రాయాలు పంచుకున్నామని ఆ పోస్ట్‌లో ప్రధాని వివరించారు.ప్రజాస్వామ్య, సుస్థిర, శాంతియుత, పురోగామి బంగ్లాదేశ్‌కు భారత్ మద్దతుగా నిలుస్తుందని పునరుద్ఘాటించామని చెప్పారు. బంగ్లాదేశ్‌లోని హిందువులందరి భద్రత విషయంలో ఎలాంటి ఆందోళన అవసరం లేదని, వారిని కాపాడుకుంటామని భరోసా ఇచ్చారని ఆ పోస్ట్‌లో ప్రధాని వివరించారు. ఇక స్వాతంత్య్ర దినోత్సవ ప్రసంగంలో బంగ్లాదేశ్‌లో హిందువుల భద్రతపై 140 కోట్ల మంది భారతీయులు కలత చెందుతున్న క్రమంలో హింస ప్రజ్వరిల్లిన బంగ్లాదేశ్‌లో త్వరలో సాధారణ పరిస్థితి నెలకొంటుందని ప్రధాని మోదీ ఆకాంక్షించారు. మరోవైపు మంగళవారం మహ్మద్ యూనస్ ఢాకాలోని ఢాకేశ్వరి ఆలయాన్ని సందర్శించిన క్రమంలో హిందువులతో ముచ్చటించారు. మాజీ ప్రధాని షేక్ హసీనా ఇటీవల పదవి నుంచి దిగిపోయేముందు జరిగిన హింసాకాండలో మైనారిటీలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామని ఈ సందర్భంగా మహ్మద్ యూనస్ వారికి హామీ ఇచ్చారు.

# జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తా: ఫరూక్ అబ్దుల్లా

**శ్రీనగర్:** జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తానని మాజీ సీఎం, నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తెలిపారు. అయితే తన కుమారుడు ఒమర్ అబ్దుల్లా ఈ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని చెప్పారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించిన తర్వాత మాత్రమే ఎన్నికల్లో ఒమర్ పోటీ చేస్తారని అన్నారు. జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ఈసీ శుక్రవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో శ్రీనగర్‌లో మీడియాతో ఫరూక్ అబ్దుల్లా మాట్లాడారు. 'ఈ ఎన్నికల్లో నేను పోటీ చేస్తున్నా. ఒమర్ అబ్దుల్లా పోటీ చేయడం లేదు. రాష్ట్ర హోదా రాగానే నేను తప్పుకుంటా. ఆ స్థానం నుంచి ఒమర్ అబ్దుల్లా పోటీ చేస్తారు' అని అన్నారు. కాగా, పదేళ్ల తర్వాత, కేంద్ర పాలిత ప్రాంతంగా ఏర్పడిన జమ్ముకశ్మీర్‌లో తొలిసారి అసెంబ్లీ ఎన్నికల నిర్వహణకు ఈసీ ముందుకు రావడాన్ని ఒమర్ అబ్దుల్లా స్వాగతించారు. గతంలో ఎప్పుడూ కూడా ఇంత ఆలస్యం జరుగలేదని తెలిపారు. జమ్ముకశ్మీర్ ప్రజలు చాలా కాలంగా ఈ రోజు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. జమ్ముకశ్మీర్‌లో సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1 తేదీల్లో మూడు దశల్లో ఎన్నికలు జరగనున్నాయి. అక్టోబర్ 4న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

# వైద్యురాలి హత్యాచార ఘటనలో సీబీఐకి సహకరించాలి: కేంద్ర మంత్రి

**కోల్‌కతా:** కోల్‌కతాలో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వైద్యురాలి హత్యాచార కేసు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనలో మమతా బెనర్జీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆరోపించారు. ఘటనా స్థలంలోకి పెద్దసంఖ్యలో సంఘ విద్రోహ శక్తులు ప్రవేశించి ఆధారాలను మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న తీరు అత్యంత హేయమని అన్నారు.నిందితులను కాపాడాలని కొందరు కోరుకుంటున్నారని ఈ ఘటనలతో వెల్లడవుతున్నదని చెప్పారు. ఆధారాలు చెరిగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మమతా బెనర్జీ సర్కార్‌పై ఉందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఆరోపణలు గుప్పించే బదులు పశ్చిమ బెంగాల్ సీఎం సీబీఐ బృందానికి సహకరించాలని, ఆధారాలు కాపాడేలా చొరవ చూపాలని చిరాగ్ పాశ్వాన్ హితవు పలికారు. వైద్యురాలిపై హత్యాచార ఘటన పట్ల దేశవ్యాప్తంగా ఆగ్రహం పెల్లుబుకుతున్నదని చెప్పారు. కాగా, వైద్యురాలిపై హత్యాచార ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ రాజీనామా చేయాలని సిలిగురి ఎమ్మెల్యే, రాష్ట్ర అసెంబ్లీ చీఫ్ విప్ డాక్టర్ శంకర్ ఘోష్ డిమాండ్ చేశారు. బెంగాల్‌లో మహిళలపై లైంగిక దాడులు నిత్యకృత్యమయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కందుని, పార్క్ స్ట్రీట్, మతిగర, చోప్రా, అరియదహ,




కలియాగంజ్, హంస్‌ఖలి సహా పలు ప్రాంతాల్లో ఈ తరహా ఘటనలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని నడపడంలో విఫలమయ్యారని వెల్లడవుతున్నదని చెప్పారు. ఆర్జీ కార్ ఘటన అనంతరం ఘటనా స్థలం మీడియా కంటపడకుండా సీఎం ప్రయత్నించారని ఆరోపించారు. మహిళలపై తీవ్ర నేరాలు పెచ్చుమీరుతున్నాయని, దీదీ సర్కార్ హయాంలో మహిళలకు భద్రత కరవైందని వ్యాఖ్యానించారు. నిందితులను పట్టుకున్నా వారిని కఠినంగా శిక్షించడం లేదని ఆరోపించారు.

# బెంగాల్‌లో మహిళలపై అరాచకాలు సిగ్గుచేటు

## బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్

**కోల్‌కతా:** మహిళా సీఎం సారథ్యంలోని పశ్చిమ బెంగాల్‌లో జరుగుతున్న పరిణామాలు ఆందోళన రేకెత్తిస్తున్నాయని బీజేపీ ఎంపీ రవిశంకర్ ప్రసాద్ అన్నారు. ఆర్జీ కార్ మెడికల్ కాలేజ్ ఆస్పత్రిలో దారుణ ఉదంతం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. స్వామి వివేకానంద, సుభాష్ చంద్ర బోస్, రవీంద్ర నాథ్ ఠాగూర్ వంటి మహనీయులు జన్మించిన నేలపై ఇంతటి నీచమైన నేరం జరగడం విస్మయం కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.కోల్‌కతాలో వైద్యరాలిపై హత్యాచార ఘటన సభ్యసమాజం సిగ్గుతో తలదించుకునేలా ఉందని, అక్కడ గూండాలు డాక్టర్లపై దాడిచేస్తుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ ఘటనపై సీబీఐ విచారణకు సరైన రీతిలో బెంగాల్ అధికారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కాగా, కోల్‌కతాలో ఆర్జీ కార్ మెడికల్ కాలేజీ ఆస్పత్రి వైద్యురాలి హత్యాచార కేసు దేశవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఈ ఘటనలో మమతా బెనర్జీ ప్రభుత్వం, అధికార యంత్రాంగం ఘోరంగా విఫలమైందని కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ ఆరోపించారు. ఘటనా స్థలంలోకి పెద్దసంఖ్యలో సంఘ విద్రోహ శక్తులు ప్ర-



వేశించి ఆధారాలను మాయం చేసేందుకు ప్రయత్నిస్తున్న తీరు అత్యంత హేయమని అన్నారు. నిందితులను కాపాడాలని కొందరు కోరుకుంటున్నారని ఈ ఘటనలతో వెల్లడవుతున్నదని చెప్పారు. ఆధారాలు చెరిగిపోకుండా కాపాడాల్సిన బాధ్యత మమతా బెనర్జీ సర్కార్‌పై ఉందని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. ఆరోపణలు గుప్పించే బదులు పశ్చిమ బెంగాల్ సీఎం సీబీఐ బృందానికి సహకరించాలని, ఆధారాలు కాపాడేలా చొరవ చూపాలని చిరాగ్ పాశ్వాన్ హితవు పలికారు.



## వయనాడ్ విపత్తు బాధితుల కోసం ఏపీ రూ. 10 కోట్లు విరాళం

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కేరళ వయనాడ్ బాధితుల కోసం రూ. 10 కోట్ల విరాళాన్ని ప్రకటించింది. ఈ సందర్భంగా సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 10 కోట్లను కేరళ ప్రభుత్వానికి శుక్రవారం అందజేసింది. వయనాడ్‌లో జులై 30న కొండ చరియలు విరిగిపడిన ఘటనలో సుమారు 310 మందికి పైగా మరణించగా వేల మంది నిరాశ్రయులయ్యారు.బాధితులను ఆదుకునేందుకుగాను ఆయా రాష్ట్రాలు స్పందించి తోచిన సహాయాన్ని అందజేశారు. ఇందుల్లో భాగంగా ఏపీలోని కూటమి ప్రభుత్వం రూ. 10 కోట్ల విరాళాన్ని అందజేసింది. వివిధ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు సైతం వయనాడ్ బాధితులకు అండగా నిలుస్తున్నారు.తెలుగు చిత్ర పరిశ్రమ నుంచి ప్రభాస్ రెండు కోట్లు, చిరంజీవి, చరణ్ కోటి రూపాయలు, అల్లు అర్జున్ రూ. 25 లక్షలు, రష్మిక మందన్నా రూ.10 లక్షలు, నిర్మాత నాగవంశీ రూ. 5 లక్షలు, సెలబ్రిటీలు కేరళ రాష్ట్ర సీఎం రిలీఫ్ ఫండ్ కు విరాళాలు అందజేశారు. అలనాటి హీరోయిన్లు మీనా, కుష్బూ, సుహాసిని, మరికొంతమంది సినీతారలు నేరుగా వెళ్లి కోటి రూపాయల చెక్కును కేరళ ముఖ్యమంత్రికి అందజేశారు.

## ఏపీలో ఐపీఎస్ అధికారుల బదిలీ..

**విశ్వంభర, అమరావతి :** ఆంధ్రప్రదేశ్‌లో పలువురు ఐపీఎస్ అధికారులు బదిలీ అయ్యారు. శుక్రవారం రాత్రి డీజీపీ ద్వారకా తిరుమలరావు బదిలీ ఉత్తర్వులను జారీ చేశారు. సత్య ఏసుబాబు డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించారు. గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా గరుడ్ సుమిత్ సునీల్‌ను, ఏపీఎస్పీ 16వ బెటాలియన్ కమాండెంట్‌గా కేవీ మురళీకృష్ణను, పార్వతీపురం ఎస్‌డీపీవోగా అంకిత మహవీర్ నియమించారు.విజయవాడ డీసీపీ గా కేఎం మహేశ్వర్ రాజు, గ్రేహౌండ్స్ గ్రూప్ కమాండర్‌గా సునీల్ షరాన్, గుంతకల్లు ఎస్ఆర్‌పీగా రాహుల్ మీనా (రైల్వే పోలీసు), ఇంటెలిజెన్స్ ఎస్పీగా నచికేత్ విశ్వనాథ్, చింతూర్ ఏఎస్పీగా పంకజ్ కుమార్ మీనా, అనంతపురం ఎస్పీగా పి. జగదీశ్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ఏర్పాటు చేయాలి

**ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం: బాలకృష్ణ**



**విశ్వంభర, హిందూపురం:** సత్య సాయి జిల్లా హిందూపురంలో ఎమ్మెల్యే బాలకృష్ణ అన్న క్యాంటీన్లను రెండు చోట్ల ప్రారంభించారు. స్వయంగా పేదలకు భోజనాన్ని వడ్డించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు."స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్ లోని బసవతారకం ఆసుపత్రిలో జెండా వందనం చేసి తల్లిని స్మరించుకున్నాను. ఈ రోజు ఎన్టీఆర్ పేరుతో ఏర్పాటైన అన్న క్యాంటీన్లను ప్రారంభించి అన్న పేరు స్మరించుకున్నాను. రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ తిరిగి అధికారంలోకి రావడం.. అన్న క్యాంటీన్లను పునఃప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉంది. పేదలకు మూడు పూటలా కడుపునిండా భోజనం అందించాలనే ఉద్దేశంతో రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే వంద అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశాం. భవిష్యత్తులో మరిన్ని అందుబాటులోకి తీసుకొస్తాం. రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పటికీ సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి చంద్రబాబు అమలు చేస్తున్నారు""హిందూపురం అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.90 కోట్లు మంజూరు చేస్తారు. భవిష్యత్తులో కూడా మరిన్ని నిధులు వస్తాయి. హిందూపురం అంటే చంద్రబాబుకు ఎనలేని అభిమానం. అందుకే పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేశారు. జిల్లాకు సత్యసాయి పేరు అలానే ఉంచి.. జిల్లా కేంద్రంగా హిందూపురాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తాం" అని బాలకృష్ణ పేర్కొన్నారు.

# విశాఖ ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నిక

**విశ్వంభర, అమరావతి:** విశాఖ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఉప ఎన్నికలో వైసీపీ అభ్యర్థి బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఎన్నికల అధికారులు అధికారికంగా బొత్స ఎన్నికను ప్రకటించారు. ఆయన మూడేళ్లపాటు ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు. విశాఖ కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ నుంచి ఎమ్మెల్సీగా ఎన్నికైనట్లు సర్టిఫికెట్ తీసుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ బీ ఫారం ఇచ్చి పోటీకి ప్రోత్సహించిన పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌కు , సహకరించిన వైసీపీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పోటీ నుంచి కూటమి ప్రభుత్వం తప్పుకోవడంతో రంగంలో మొత్తం ఇద్దరే నామినేషన్లు దాఖలు చేశారు. వైసీపీ అభ్యర్థిగా, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ , స్వతంత్ర అభ్యర్థిగా షఫీ ఉల్లా నామినేషన్ నామినేషన్ వేశారు. బుధవారం స్వతంత్ర అభ్యర్థి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. దీంతో బొత్స ఎన్నిక ఏకగ్రీవం అయ్యింది. ఏపీలో జరిగిన సార్వత్రిక ఎన్నికకు ముందు వైసీపీ ఎమ్మెల్సీ శ్రీనివాస్ రాజీనామా చేసి జనసేనలో చేరడంతో అయితే పార్టీ ఫిరాయింపులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ వైసీపీ అధిష్టానం అప్పటి మండలి చైర్మన్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసింది. వాటిని పలు దఫాలుగా పరిశీలించి చివరకు ఎమ్మెల్సీపై అనర్హత వేటు వేశారు. దీంతో ఖాళీ అయిన విశాఖ ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేశారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో వైసీపీకి 600 మంది ఎంపీటీసీ, జడ్పీటీసీలు, కార్పొరేటర్ల సంఖ్యాబలం ఉంది. కూటమికి 200 పైగా మాత్రమే సభ్యులున్నారు. ఈ ఎన్నికల్లో పోటీ చేయాలని భావించిన కూటమి ప్రభుత్వం చివరకు హుందాగా రాజకీయాలు చేద్దామని, ఎవరిని ప్రలోభ పెట్ట వద్దని సూచిస్తూ ఎన్నికల్లో పోటీ వద్దంటూ చంద్రబాబు స్పష్టం చేయడంతో కూటమి బరిలో నిలువ లేదు.



## నా కొడుకు అమాయకుడు.. అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారు

### మాజీ మంత్రి జోగి రమేశ్



**విశ్వంభర, అమరావతి:** రాజకీయాల్లో విశ్వసనీయత ఎంతో అవసరమని, ఎవరికి కూడా అధికారం శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తు పెట్టుకోవాలని మాజీ మంత్రి జోగి రమేశ్ సూచించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం కక్షపూరిత రాజకీయాలకు పాల్పడుతుందని విమర్శించారు. అగ్రిగోల్డ్ భూములను అక్రమంగా కొనుగోలు చేయలేదని, కావాలంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్, సత్యప్రసాద్ వద్దకు వెళ్లి స్వయంగా తానే వివరిస్తానని పేర్కొన్నారు.కక్ష ఉంటే నాపై తీర్చుకోవాలని, అమాయకుడైన నా కొడుకుపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం దారుణమని ఆరోపించారు. వైఎస్ జగన్ పై టీడీపీ నాయకులు ఇష్టం వచ్చినట్లు మాట్లాడడంతో నిరసన తెలిపేందుకు వెళితే నాపై దాడి చేసి, మళ్లీ నా మీదనే కేసు పెట్టారని వెల్లడించారు. రాజకీయాల్లో విలువల గురించి మాట్లాడే చంద్రబాబుకు, కూటమి నేతలకు విలువ లేదని దుయ్యబట్టారు.ఏపీ ప్రజలు కూటమికి అసెంబ్లీలో భారీ మెజారిటీ ఇచ్చారని, ఇచ్చిన సమయాన్ని ప్రజల అభివృద్ధి, సంక్షేమానికి వినయోగించుకోవాలని సూచించారు. అభం, శుభం తెలియని నా కొడుకుపై అక్రమ కేసులు పెట్టడం సరైనది కాదని అన్నారు. రేపు మళ్లీ అధికారంలోకి వస్తామన్న విషయాన్ని గుర్తించాలని తెలిపారు.

## ఏపీలో మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్



**విశ్వంభర, అమరావతి:** కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ(సీఐఐ) డైరెక్టర్ జనరల్ చంద్రజిత్ బెనర్జీ.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సీఐఐ ద్వారా అమరావతిలో గ్లోబల్ లీడర్ షిప్ సెంటర్ (జీఎల్సీ) ఏర్పాటుపై చర్చించారు. ఆర్థికాభివృద్ధిపై టాస్క్ ఫోర్స్ సిఫార్సులకనుగుణంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, సీఐఐ ఇండస్ట్రీ ఫోరమ్ ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు సమావేశం అనంతరం సీఎం చంద్రబాబు ఎక్స్లో పోస్టు చేశారు. సీఐఐ మల్టీ స్కిల్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్, సీఐఐ మోడల్ కెరీర్ సెంటర్ వంటి కార్యక్రమాల ద్వారా ఏపీ యువతలో నైపుణ్యాలు, ఉపాధిని పెంపొందించడంపై దృష్టి పెడతామని సీఎం తెలిపారు.

## 17న దేశవ్యాప్తంగా వైద్య సేవలు బంద్

### ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర నాయుడు



**విశ్వంభర, విశాఖపట్నం:** కోల్ కతాలో ట్రైనీ డాక్టర్పై హత్యాచారానికి నిరసనగా 17న దేశవ్యాప్తంగా అన్ని ఆసుపత్రుల్లో వైద్య సేవలను నిలిపివేయనున్నట్లు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) నిర్ణయించిందని రాష్ట్ర అధ్యక్షుడు జయచంద్ర నాయుడు తెలిపారు. విశాఖలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐఎంఏ ఆధ్వర్యంలో శనివారం చేపట్టనున్న నిరసన కార్యక్రమాల వివరాలను తెలిపారు. కోల్కతా ఘటనపై సత్వరమే న్యాయ విచారణ జరిపించి దోషులను కఠినంగా శిక్షించాలని, వైద్య విద్యార్థిని కుటుంబానికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**గుంటూరులో వైద్యుల నిరసన...**


కోల్కతా ఘటనను నిరసిస్తూ గుంటూరులో వైద్యులు నిరసన తెలిపారు. గుంటూరు జిల్లాలో 17న ఉదయం 6 గంటల నంచి 18వ తేదీ ఉదయం 6గంటల వరకు వైద్య సేవలు నిలిపివేస్తున్నట్టు ప్రకటించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు డాక్టర్లకు రక్షణ కల్పించాలని వైద్యులు బూసిరెడ్డి నరేంద్ర, నందకిశోర్, విజయలక్ష్మి డిమాండ్ చేశారు. "కొవిడ్ అప్పుడు దేవుళ్లు అన్నారు.. ఇప్పుడు దాడులు చేస్తున్నారు. ప్రజలంతా నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలపాలి. బాధిత వైద్యురాలి అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో జరపాలి. వైద్యులకు పరిశుభ్రమైన, భద్రత ఉన్న ప్రదేశం కల్పించాలి. అందరూ సంఘటితంగా పోరాడాలి" అని పిలుపునిచ్చారు.

## వాగులో గల్లంతైన ఉపాధ్యాయురాలు

**విశ్వంభర,పార్వతీపురం :** ఏపీలోని పార్వతీపురం మన్యం జిల్లాలో విషాదం చోటు చేసుకుంది. ప్రభుత్వ ఉపాధ్యాయురాలు వాగులో కొట్టుకుపోయింది. మరొకరు చెట్టు కొమ్మ సహాయంతో ప్రాణాలు కాపాడుకున్న ఘటన సాలూరు మండలం పరాయివలస ఒట్టిగెడ్డ వాగులో చోటు చేసుకుంది. గ్రామంలో ఏకలవ్య పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు ఆర్తి , హాస్టల్ వార్డెన్ మహేశ్ బైక్‌పై వాగు దాటుతుండగా ప్రవాహానికి ఇద్దరు కొట్టుకు పోయారు. ప్రవాహంలో కొంతదూరం వెళ్లిన తరువాత మహేశ్ చెట్టు కొమ్మ సహాయంతో సురక్షితంగా ఒడ్డుకు చేరుకోగా టీచర్ ఆర్తి వాగులో గల్లంతయ్యారు.విషయం తెలుసుకున్న గ్రామస్తులు వాగులో గాలించిన ఫలితం కనిపించ లేదు. ఘటనపై జిల్లా మంత్రి సంధ్యారాణి స్పందించి ఉపాధ్యాయురాలి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు.

# పద్మావతి అమ్మవారి ఆలయంలో వైభవంగా వరలక్ష్మీ వ్రతం

### స్వర్ణరథంపై ఊరేగింపు





**తిరుపతి:** తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. తెల్లవారుజాము నుంచే సహస్రనామార్చన, నిత్యార్చన, మూలవర్లకు, ఉత్సవర్లకు అభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని బంగారుచీరతో అలంకరించారు. విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, కలశస్థాపన, అమ్మవారి ఆరాధన, అంగపూజ, లక్ష్మీ సహస్రనామార్చన, అష్టోత్తర శత నామావళి నిర్వహించారు.రోజా, చామంతి, మల్లె, సంపంగి, తులసి, పన్నీరు ఆకు, మరువము, తామరపూలు, వృక్షి వంటి సాంప్రదాయ పుష్పలతో అమ్మవారిని ఆరాధించారు. ఈ సందర్భంగా అమ్మవారికి 9 గ్రంథులతో(నూలుపోగు) అలంకరించారు. ఒక్కో గ్రంథిని ఒక్కో దేవతకు గుర్తుగా ఆరాధించారు. అనంతరం 12 రకాల నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు.రాత్రి అమ్మవారిని స్వర్ణరథంపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగించి భక్తులలకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈ సందర్భంగా టీటీడీ ఈవో జె.శ్యామల రావు , చంద్రగిరి ఎం.ఎల్.ఏ పులివర్తి నాని , జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, ఆలయ డిప్యూటీ ఈవో గోవింద రాజన్, భక్తులు పాల్గొన్నారు.

**భక్తులను విశేషంగా ఆకట్టుకున్న వ్రత మండపం**

టిటిడి ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో ఏర్పాటు చేసిన వ్రత మండపం భక్తులను విశేషంగా అకట్టుకుంది. 15 మంది సిబ్బంది, 2 టన్నుల సంప్రదాయ పుష్పాలు, పది రకాల 20 వేల కట్ ఫ్లవర్స్ తో మూడు రోజుల పాటు శ్రమించి అమ్మవారి ఆలయం, ఆస్థానమండపం, వ్రత మండపాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ద్రాక్ష, బత్తాయి, పైనాపిల్, మొక్కజొన్న వంటి ఫలాలు, వివిధ సంప్రదాయ పుష్పాలతో వ్రత మండపాన్ని రూపొందించారు.

## భారత గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానందకు షాక్..

**విశ్వంభర, స్పోర్ట్స్:** భారత యువ గ్రాండ్‌మాస్టర్ ఆర్.ప్రజ్ఞానందకు ఊహించిన షాక్ తగిలింది. ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నమెంట్‌లో ఈ యంగ్‌స్టర్ తీవ్రంగా నిరాశపరుస్తూ పదో స్థానానికి పరిమితమయ్యాడు. ప్రపంచ టెస్ టోర్నీలో వరల్డ్ నంబర్ 1 మాగ్నస్ కార్ల్‌సన్‌కు ముచ్చెమటలు పట్టించిన ప్రజ్ఞానంద సెయింట్ లూయిస్‌లో జరుగుతున్న ఈ చెస్ టోర్నీలో సత్తా చాటలేకపోయాడు.ఎనిమిది మ్యాచుల్లో ఒక్కదాంట్లోనూ ప్రజ్ఞానంద గెలవలేకపోయాడు. దాంతో, 18 పాయింట్లు గెలవాల్సిన చోట నాలుగు పాయింట్లతో అడ్డడుగున నిలిచాడు. ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్‌లో ప్రజ్ఞానంద ఎత్తులు ఫలితమివ్వలేదు. మూడింటా ఓడి.. మరో మూడు మ్యాచులను డ్రా చేసుకున్న భారత గ్రాండ్‌మాస్టర్ ఆఖరి రోజు కూడా నిరాశపరిచాడు. ఏడో రౌండ్‌లో లినియెర్ డిమింగెజ్ చేతిలో ఓడిపోయాడు. ఆ తర్వాత మరో అమెరికా ఆటగాడు హికరు నకమురాపై కూడా ప్రజ్ఞానంద పైచేయి సాధించలేకపోయాడు.అయితే.. ఫ్రాన్స్ ఆటగాడైన అలిరెజా ఫిరౌజాతో మ్యాచ్ డ్రా చేసుకొని పరువు కాపాడుకున్నాడు. ఈ పరిస్థితుల్లో ప్రజ్ఞానంద ముందంజ వేయాలంటే బ్లిట్జ్ రౌండ్‌లో అసాధారంగా ఆడాల్సి ఉంటుంది. ప్రస్తుతం టూర్ ర్యాంకింగ్స్‌లో మూడో స్థానంలో ఉన్న అతడు అద్భుంగా ఆడితే భారత్‌కే చెందిన డి.గుకేశ్‌కు పోటీగా మారుతాడు. నాలుగో స్థానంలో ఉన్న గుకేశ్ త్వరలో జరుగబోయే సింక్వెఫీల్డ్ కప్‌లో ఆడనున్నాడు.

# పారా ఒలింపిక్స్ పతాకధారులుగా భాగ్యశ్రీ జాధవ్, సుమత్ అంతిల్

**విశ్వంభర, స్పోర్ట్స్ :** పారిస్ ఒలింపిక్స్ ముగిసి ఐదు రోజులు గడిచిపోయాయి. మరో రెండు వారాల్లో పారిస్ వేదికగా మళ్లీ క్రీడలు జరగనున్నాయి. ఈసారి పారాఒలింపిక్స్కు ఆతిథ్యం ఇవ్వనుంది. ఆగస్ట్ 28 నుంచి ఈ గేమ్స్, ప్రారంభమవుతాయి. భారత్ నుంచి 84 మంది అథ్లెట్లు పోటీపడనున్నారు. పారాఒలింపిక్స్ ప్రారం వేడుకల్లో భారత పతాకధారులుగా భాగ్యశ్రీ జాధవ్, సుమిత్ అంతిల్ను ఎంపిక చేస్తూ ఐవోఏ ప్రకటించింది. మహారాష్ట్రకు చెందిన భాగ్యశ్రీ జాదవ్ షాట్పుట్ క్రీడాకారిణి. ఎఫ్ 34 కేటగిరీలో నిలకడైన ప్రదర్శ ఇస్తోంది. జావెలిన్తో స్టార్ సుమిత్ అంతిల్ ఎఫ్ 64 కేటగిరీలో ప్రపంచ రికార్డును నెలకొల్పాడు టోక్యో ఒలింపిక్స్లో 68.55 మీటర్లు విసిరాడు. గత టోక్యో పారాఒలింపిక్స్లో 54 మంది బరిలో దిగగా.. 5 స్వర్ణాలు, 8 రజతాలు, 6 కాంస్యాలు సాధించింది. మొత్తం 19 పతకాలతో 24వ స్థానంలో నిలిచింది. ఈసారి మరిన్ని పతకాలు లక్ష్యంగా భారత్ బరిలోకి దిగనుంది.




**ఈసారి ఎవరెవరంటే?**

**ఆర్చరీ:** హర్విందర్ సింగ్, రాకేశ్ కుమార్, శ్యామ్ సుందర్ స్వామి, పూజ, సరిత, షీతల్ దేవి

**అథ్లెటిక్స్:** దీప్తి జీవాంజి, సుమిత్ అంతిల్, సందీప్, అజీత్ సింగ్, సుందర్ సింగ్ గుర్జార్, రింకు, స్వదీప్, యోగేశ్ కథునియా, ధరంబీర్, అమిత్ కుమార్, నిషాద్ కుమార్, రామ్ పాల్, మరియప్పన్ తంగవేలు, శైలేష్ కుమార్, శరద్ కుమార్, సచిన్ సర్జేరావు ఖిలారి, మహమ్మద్ యాసెర్, రోహిత్ కుమార్, ప్రీతి పాల్, భాగ్యశ్రీ మాధవ్రావు జాధవ్, మను, ప్రవీణ్ కుమార్, రవి రొంగలి, సందీప్ సంజయ్ గుర్దార్, అరవింద్, దీపేశ్ కుమార్, ప్రవీణ్ కుమార్, దిలీప్ మహదు గవిట్, సోమన్ రానా, హొకటో సేమ, సాక్షి కసానా, కరమ్ జ్యోతి, రక్షిత రాజు, అమిషా రావత్, భవనాబెన్, సిమ్రన్, కంచన్ లఖాని

బ్యాడ్మింటన్: మనోజ్ సర్కార్, నితేశ్ కుమార్, కృష్ణ నగర్, శివరాజన్ సోలైమలై, సుహాస్ యతిరాజ్, సుకాంత్ కాదమ్, తరుణ్, మానసి జోషి, మన్దీప్ కౌర్, పాలక్ కోహ్లి, మనీషా రామదాస్, తులసిమతి మురుగేశన్, నిత్యశ్రీ శివన్

**కనావో:** ప్రాచీ యాదవ్, యశ్ కుమార్, పూజా ఝా

**సైక్లింగ్:** అర్షద్ షైక్, జ్యోతి గడేరియా

**బ్లైండ్ జూడో:** కపిల్ పర్మార్, కోకిలా

**పవర్ లిఫ్టింగ్:** పరమ్ జీత్ కుమార్, అశోక్, శకినా ఖతున్, కస్తూరి రాజమణి

**రోయింగ్:** అనిత, నారాయణ కొంగనపల్లె

**షూటింగ్:** అమిత్ అహ్మద్ భట్, అవని లేఖర, మోనా అగర్వాల్, నిహాల్ సింగ్, మనీశ్ నర్వాల్, రుద్రాంక్ష్ ఖండేల్వాల్, సిద్ధార్థ్ బాబు, శ్రీహర్ష దేవరద్ది రామకృష్ణ, స్వరూప్ మహావీర్, రుబినా ఫ్రాన్సిస్

**స్విమ్మింగ్:** సుయాశ్ నారాయణ్ జాధవ్

**టేబుల్ టెన్నిస్:** సోనాల్బెన్ పటేల్, భవినాబెన్ పటేల్



## ఢిల్లీ హైకోర్ట్ ఆర్డర్‌ను సవాల్ చేసిన డబ్ల్యూఎఫ్ఐ

### ఐఓఏ కమిటీ పెత్తనంపై గుర్రు

**విశ్వంభర, స్పోర్ట్స్:** ఒలింపిక్స్ ముగియడంతో భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ) కీలక నిర్ణయం తీసుకుంది. ఢిల్లీ హైకోర్ట్ ఆర్డర్‌ను సవాల్ చేసేందుకు సిద్ధమైంది. రెజ్లింగ్ సమాఖ్యపై భారత ఒలింపిక్ సంఘానికి చెందిన అడ్ హక్ కమిటీ జోక్యం కొనసాగుతుందని హైకోర్టు చెప్పడమే అందుకు కారణం. దాంతో, తమపై ఐఓఏ కమిటీ పెత్తనం ఏంటని? రెజ్లింగ్ సమాఖ్య గుర్రుగా ఉంది. ఈ విషయాన్ని కోర్టులో తేల్చుకోవాలని డిసైడ్ అయ్యామని శుక్రవారం డబ్ల్యూఎఫ్ఏ వెల్లడించింది.డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల తర్వాత రెజ్లర్ల అభ్యర్థన మేరకు ఢిల్లీ హై కోర్టు మధ్యంతర ఉత్తర్వులను జారీ చేసింది. డబ్ల్యూఎఫ్ఐ అధికారాలకు కళ్లెం వేస్తూ నిర్ణయాధికారిన్ని ఐఓఏకు చెందిన అడ్‌హక్ కమిటీకి అప్పగించింది. దాంతో, రెజ్లింగ్ సమాఖ్య సొంతంగా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది. అందువల్ల కోర్టును ఆశ్రయించాలని సంజయ్ సింగ్ బృందం ఆలోచిస్తోంది.

'హై కోర్టు ఆర్డర్‌ను మేము ద్విసభ్య ధర్మాసనం దృష్టికి తీసుకెళ్తాం. ఇప్పటికే అడ్‌హక్ ప్యానెల్‌ను ఐఓఏ రద్దు చేసింది. ఈ విషయమై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్, అంతర్జాతీ ఒలింపిక్ కమిటీని కూడా మేము సంప్రదిస్తాం. ఎందుకంటే.. బయటి సంస్థల, వ్యక్తుల జోక్యం కారణంగా అథ్లెట్ల ప్రదర్శనపై ప్రభావం పడుతుందని ఇవి హెచ్చరించాయి' అని సంజయ్ సింగ్ తెలిపాడు.

**బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా..**

మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బ్రిజ్ భూషణ్‌కు వ్యతిరేకంగా కుస్తీ వీరులు ఉద్యమించిన విషయం తెలిసిందే. వినేశ్ ఫోగాట్, భజ్‌రంగ్ పూనియా, సాక్షి మాలిక్‌ల పోరాటంతో బ్రిజ్ భూషణ్‌పై వేటు పడింది. అనంతరం జరిగిన డబ్ల్యూఎఫ్ఐ ఎన్నికల్లో అతడి సన్నిహితుడు సంజయ్ సింగ్ గెలుపొందాడు. దాంతో, ఆందోళన వ్యక్తం చేసిన రెజ్లర్లు భారత ఒలింపిక్ సంఘాన్ని ఆశ్రయించారు. ఫలితంగా ఐఓఏ ఒక అడ్‌హక్ కమిటీని ఏర్పాటు చేసి డబ్ల్యూఎఫ్ఐ ఏకపక్ష ధోరణికి ముకుడతాడు వేసింది.

### ఇషాన్ నిబంధనలు పాటించాల్సిందే: జైషా

**విశ్వంభర, స్పోర్ట్స్ :** భారత యువక్రికెటర్ ఇషాన్ కిషన్ మళ్లీ దేశవాళీ క్రికెట్లో రీ ఎంట్రీ ఇవ్వనున్నాడు. సెప్టెంబర్లో ప్రారంభం కానున్న దులీప్ ట్రోఫీలో 'టీమ్-డి' తరఫున బరిలోకి దిగనున్నాడు. సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి బీసీసీఐ అతడిని తొలగించడంతో.. దేశవాళీ క్రికెట్ ఆడటం ఇషాన్కు అనివార్యమైంది. దీనిపై తాజాగా ఓ చర్చాకార్యక్రమంలో బీసీసీఐ కార్యదర్శి జై షా స్పందించారు. జాతీయ జట్టులో స్థానం సంపాదించాలంటే ఎవరైనా నిబంధనలు పాటించాల్సిందేనని స్పష్టం చేశారు.

తాజాగా జరిగిన ఓ చర్చా కార్యక్రమంలో.. మళ్లీ భారత జట్టులోకి ఇషాన్ రావాలంటే ఎలాంటి ప్రక్రియ ఉంటుందంటూ జైషాను ప్రశ్నించగా.. ఎవరైనా

# టీమిండియాకు ఆడాలంటే..



కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందేనని ఆయన బదులిచ్చారు. ఈ సందర్భంగా టీమ్ ఇండియా మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ చెప్పిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. " దులీప్ ట్రోఫీలో యువ క్రికెటర్లకు అవకాశమివ్వాలని ద్రావిడ్ సలహా ఇచ్చారు. తద్వారా మేటి ఆటగాళ్లను గుర్తించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఇషాన్ మళ్లీ జాతీయ జట్టుకు ఆడాలనుకుంటే.. కచ్చితంగా నిబంధనలు పాటించాల్సిందే. దేశవాళీ క్రికెట్ ఆడాల్సిందే" అని జై షా బదులిచ్చారు.ప్రయాణాలు ఎక్కువగా చేయడం వల్ల కుంగుబాటుకు గురైన తనకు విశ్రాంతి కావాలని గతేడాది చివర్లో బీసీసీఐకి ఇషాన్ విన్నవించుకున్నాడు. అనుమతి తీసుకున్నాక దుబాయ్ వెళ్లి పార్టీల్లో పాల్గొనడం మేనేజ్మెంట్ను ఆగ్రహానికి గురి చేసింది. దేశవాళీలో ఆడాలని సూచించినా.. ఇషాన్ పెడచెవిన పెట్టి ఐపీఎల్ కోసం సిద్ధమవడంతో సెంట్రల్ కాంట్రాక్ట్ నుంచి తప్పించింది. ఇషాన్ కిషన్ చివరిసారిగా 2022లో దేశవాళీ క్రికెట్ ఆడాడు. గతేడాది నవంబర్లో ఆస్ట్రేలియాతో జరిగిన టీ20 సిరీస్ ఆడిన ఇషాన్.. ఆ తర్వాత దక్షిణాఫ్రికాతో జరిగిన టోర్నీకి ఎంపికైనప్పటికీ.. వ్యక్తిగత కారణాలతో బయటకు వచ్చేశాడు.నిజానికి తొలుత ఝార్ఖండ్ జట్టు జాబితాలో ఇషాన్ కిషన్ పేరు లేదు. అయితే, అతడు దేశవాళీలో ఆడాలని నిర్ణయించుకున్నట్లు ఝార్ఖండ్ స్టేట్ క్రికెట్ అసోసియేషన్కు సమాచారం అందించిన తర్వాత జట్టులో అతడి పేరు చేర్చారు. ఇషాన్ కిషన్ గతేడాది 2 టెస్టులు, 17 వన్డేలు,11 టీ20లు ఆడాడు. 2023 వన్డే ప్రపంచకప్ జట్టులోనూ సభ్యుడిగా ఉన్నాడు. శుభ్ మన్ గిల్ అస్వస్థతకు గురైనప్పుడు 2 సార్లు ఓపెనర్గానూ దిగాడు.

## 2027 నాటికి మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదగనున్న భారత్

- భారత్ వృద్ధిరేటు ఆశించిన దానికన్నా మెరుగ్గా ఉంది
- ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గీతా గోపీనాథ్ ఆశాభావం



**విశ్వంభర, బిజినెస్:** భారత్ వృద్ధి రేటు ఆశించిన దాని కన్నా మెరుగ్గా ఉందని, 2027 నాటికి ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ అవతరిస్తుందని ఐఎంఎఫ్ తొలి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గీతా గోపీనాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో భారత్ అంచనాలకు మించి వృద్ధి రేటు నమోదు చేసిందని అన్నారు. ప్రైవేట్ వినిమయం కూడా పుంజుకుంటున్నదని పేర్కొన్నారు.రుతుపవనాలు ఆశాజనకంగా ఉండటంతో 2024-25 ఆర్థిక సంవత్సరానికి భారత్ వృద్ధి రేటు అంచనాను 7 శాతంగా ఐఎంఎఫ్ అంచనా వేసింది. ఆర్థిక సర్వేలో కేంద్ర ప్రభుత్వం అంచనాలు 6.5 శాతం కంటే ఐఎంఎఫ్ వృద్ధి రేటు అంచనా అధికం కావడం గమనార్హం. 2027 నాటికి భారత్ ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఎదుగుతుందని ఐఎంఎఫ్ అంచనా వేసింది. గత ఏడాది ప్రైవేట్ వినిమయ వృద్ధి 4 శాతం కాగా, గ్రామీణ వినిమయంలో పెరుగుదలతో ఈ ఏడాది ప్రైవేట్ వినిమయం మెరుగవుతుందని అంచనా వేస్తున్నామని గీతా గోపీనాథ్ పేర్కొన్నారు.ఓ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆమె పలు వివరాలు వెల్లడించారు. ద్విచక్ర వాహన విక్రయాలు, కన్జూమర్ గూడ్స్ విక్రయాలు ఊపందుకోవడం గమనించవచ్చని చెప్పారు. రుతుపవనాలు సానుకూలంగా ఉండటంతో పంటల దిగుబడులు గణనీయంగా పెరిగే అవకాశం ఉందని అన్నారు. వ్యవసాయ ఆదాయాలు పెరిగితే గ్రామీణ వినిమయం ఊపందుకుంటుందని చెప్పారు. ఈ కారణాలతో తాము భారత వృద్ధి రేటును అప్‌గ్రేడ్ చేశామని గీతా గోపీనాథ్ వివరించారు.

## సెబీ చైర్ పర్సన్ మాధవి పురీ బుచ్ నిబంధన ఉల్లంఘన నిజమే?!

**విశ్వంభర, బిజినెస్:** దేశీయ స్టాక్ మార్కెట్ల నియంత్రణ సంస్థ 'సెబీ' చైర్‌పర్సన్ మాధవి పురీ బుచ్ నిబంధనలను ఉల్లంఘించినట్లు తెలుస్తున్నది. 2017లో సెబీ హోల్ టైం సభ్యురాలిగా చేరినప్పటి నుంచి 2022లో సెబీ చైర్‌పర్సన్‌గా నియమితులైన తర్వాత గత ఏడేండ్లుగా మాధబీ పురీ బుచ్.. రెగ్యులేటరీ నిబంధనలను ఉల్లంఘించారని అధికార పత్రాల్లో సమాచారం వెల్లడిస్తోంది.భారత కుబేరుడు గౌతం అదానీ ఆధ్వర్యంలో అదానీ గ్రూప్ సంస్థల్లో పెట్టుబడులు, అవకతవకలపై యూఎస్ షార్ట్ సెల్లింగ్ కంపెనీ హిండెన్ బర్గ్ రీసెర్చ్ చేసిన ఆరోపణలపై సెబీ దర్యాప్తు చేసింది. ఈ విషయంలో మాధబీ పురీ బుచ్ 'పరస్పర విరుద్ధ ప్రయోజనాలు' నిబంధనను ఉల్లంఘించినట్లు ఆ సాక్ష్యాధారాలు చెబుతున్నాయి. ఆఫ్ షోర్ కంపెనీల ద్వారా అదానీ గ్రూప్ కంపెనీల షేర్ల విలువ కృత్రిమంగా పెంచుతున్నారని, ఆస్తులకు మించిన రుణాలు తీసుకున్నారని హిండెన్ బర్గ్ ఆరోపించింది. దీంతో గతేడాది జనవరి నుంచి ఫిబ్రవరి వరకూ అదానీ గ్రూప్ సంస్థల మార్కెట్ క్యాపిటలైజేషన్ నష్టపోయినా ఇప్పుడిప్పుడే రికవరీ సాధిస్తున్నది. అదానీ గ్రూప్ లావాదేవీలపై దర్యాప్తు నిర్వహించింది. ఆరోపణలకు ఆధారాలు చూపాలంటూ హిండెన్ బర్గ్ రీసెర్చ్ సంస్థకు సెబీ నోటీసులు జారీ చేసింది. దీనికి ప్రతిగా విదేశాల్లోని అదానీ అనుబంధ సంస్థల్లో సెబీ చైర్‌పర్సన్ మాధబీ పురీ బుచ్, ఆమె భర్త ధావల్ బుచ్ పెట్టుబడులు పెట్టారని హిండెన్ బర్గ్ ఆరోపించింది. దీనిపై ఈ నెల 11న ప్రకటన చేసిన మాధబీ పురీ బుచ్ దంపతులు.. హిండెన్ బర్గ్ తమ వ్యక్తిత్వ హననానికి పాల్పడుతున్నదని ఆరోపించారు. తాము పరస్పర విరుద్ధ ప్రయోజనాలకు పాల్పడటం లేదని పేర్కొన్నారు.సింగపూర్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా పార్టనర్స్,



భారత్ కేంద్రంగా పని చేస్తున్న అగోరా అడ్వైజరీ సంస్థలను మాధబీ పురీ బుచ్ దంపతులు నిర్వహిస్తున్నారని హిండెన్ బర్గ్ ఆరోపించింది. సెబీలో హోల్ టైం మెంబర్ గా 2017లో చేరిన మాధబీ పురీ బుచ్.. 2022లో సంస్థ చైర్ పర్సన్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడేండ్ల కాలంలో అగోరా అడ్వైజరీ సంస్థలో 99 శాతం వాటాలు బుచ్ దంపతులవే. దీని ద్వారా రూ.3.71 కోట్ల ఆదాయం సంపాదించారని రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీల వద్ద నమోదైన సమాచారాన్ని ప్రముఖ వార్తా సంస్థ బయట పెట్టింది. సెబీ పూర్తికాల సభ్యులుగా నియమితులైన తర్వాత ఆఫీస్ ఆఫ్ ప్రాఫిట్ గానీ, వేతనం గానీ, ఇతర వృత్తి నైపుణ్య కార్యక్రమాల ద్వారా ప్రొఫెషనల్ ఫీజులు పొందడం 2008 సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. 2019లో యూనీ లివర్ నుంచి రిటైరైన తర్వాత తన భర్త ధావల్ బుచ్ సదరు కంపెనీలను తన కన్సల్టెన్సీ వ్యాపార లావాదేవీలకు వాడుకుంటున్నారని సెబీకి తెలిపినట్లు మాధవి పురీ బుచ్ తెలిపారు. దీనిపై సెబీ అధికారిక ప్రతినిధి స్పందించలేదు.

## ఎబ్కోలో మెజారిటీ వాటాను కొనుగోలు చేసిన వార్ బర్గ్ పింకస్

**విశ్వంభర, బిజినెస్:** గ్లోబల్ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ 'వార్బర్గ్ పింకస్'.. ఫర్నీచర్ ఫిట్టింగ్స్, ఆర్కిటెక్చరల్ హార్డ్వేర్ విభాగంలో ప్రముఖ భారతీయ సంస్థ అయిన 'ఎబ్కో ప్రైవేట్ లిమిటెడ్' మెజారిటీ వాటాను కొనుగోలు చేసినట్లు కంపెనీ ఈ రోజు (శుక్రవారం) తెలిపింది. ఎబ్కో ప్రైవేట్ లిమిటెడ్ విలువ రూ.3,000-3,200 కోట్లు. ఇప్పటి నుంచి 'ఎబ్కో' మైనారిటీ వాటాను కలిగి ఉన్నప్పటికీ, భవిష్యత్తులో సంస్థ కార్యకలాపాల్లో చురుకుగానే వ్యవహరిస్తామని తెలిపింది. 1963లో స్థాపితమయిన 'ఎబ్కో' భారత్లో పురాతన ఫర్నీచర్ ఫిట్టింగ్స్, ఆర్కిటెక్చరల్ హార్డ్వేర్ బ్రాండ్లలో ఒకటి. ముంబై కేంద్రంగా కంపెనీ బెడ్, వార్డ్రోబ్ ఫిట్టింగ్స్, కిచెన్ సిస్టమ్స్, యాక్సెసరీస్, ఆఫీస్ ఫర్నీచర్ ఫిట్టింగ్స్, విండో/డోర్ హార్డ్వేర్, ఫర్నీచర్ లైట్ల విభాగాల్లో విస్తృత శ్రేణి ఉత్పత్తులను అందజేస్తుందని సంస్థ తెలిపింది. కంపెనీ దేశవ్యాప్తంగా 5500కు పైగా రిటైల్ టచ్పాయింట్లను కలిగి ఉంది. సంస్థకు మహారాష్ట్రలో మూడు తయారీ ప్లాంట్లు ఉన్నాయి. భారత్లో జనాభాకు అనుకూలంగా రియల్ ఎస్టేట్ మార్కెట్ పెరుగుతున్నందున భవిష్యత్తులో ఫర్నీచర్ మాడ్యులరైజేషన్ వృద్ధి మెరుగ్గా ఉంటుందని 'వార్బర్గ్ పింకస్ ఇండియా', ఎండీ అనిష్ సరాఫ్ తెలిపారు.

## రూ.67 వేల కోట్ల ఆర్డర్‌ను విన్ అయిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్..!

**విశ్వంభర, బిజినెస్:** హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ షేర్లు ఈరోజు 3 శాతం పెరిగాయి. బీఎస్ఈలో షేర్ ప్రైస్ రూ. 4,787.70కి చేరుకుంది. భారత వైమానిక దళం నుంచి అదనపు తేజస్ తేలికపాటి యుద్ధ విమానాల కోసం కంపెనీ రూ. 67,000 కోట్ల విలువైన కొత్త ఆర్డర్‌ను విన్ అయినట్లు నివేదికలు రావడంతో స్టాక్ ర్యాలీ కనిపించింది. రూ.67,000 కోట్ల అంచనాతో ఈ ఏడాది చివరి నాటికి కాంట్రాక్టు ఖరారు అయ్యే అవకాశం ఉంది. ఫిబ్రవరి 2021లో సంతకం చేసిన 83 విమానాల కోసం రూ. 48,000 కోట్ల కాంట్రాక్టు హెచ్ఏఎల్ విన్ అయింది.దేశీయంగా అభివృద్ధి చెందిన సాంకేతికతతో దాని యుద్ధ విమానాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకుంది కంపెనీ. స్వదేశీ విమానాలతో తన కార్యాచరణ సామర్థ్యాలను పెంచుకోవడంలో IAF నిబద్ధతను ఈ కొత్త ఆర్డర్ ఇచ్చినట్లు తెలుస్తోంది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) కోసం జెఫరీస్ 'కొనుగోలు' సిఫార్సును జారీ చేసింది. ఒక్కో షేరుకు రూ.5,725 టార్గెట్ ధరను నిర్ణయించింది. HAL Q1 ఆదాయం అంచనాలను మించి 3% పెరిగిందని బ్రోకరేజ్ హైలైట్ చేస్తుంది.మార్జిన్లు 440 బేసిస్ పాయింట్లు తగ్గి 22.8%కి తగ్గడంతో EBITDA తక్కువగా ఉందని పేర్కొంది. రాబోయే 3-5 సంవత్సరాల్లో రెండంకెల వృద్ధిని సాధించడంలో విశ్వాసాన్ని అందించే బలమైన ఆర్డర్ పుస్తకాన్ని ఉటంకిస్తూ, హెచ్ఏఎల్ భవిష్యత్తుపై జెఫరీస్ ఆశాజనకంగా ఉన్నట్లు పేర్కొంది. ప్రస్తుత మార్జిన్ అస్థిరత ఉన్నప్పటికీ, మెరుగైన రాబడితో ద్వితీయార్థంలో మార్జిన్‌లు మెరుగుపడతాయని అంచనా వేసింది. UBS హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL)పై 'కొనుగోలు' రేటింగ్ ఇచ్చింది.ఒక్కో షేరుకు రూ. 5,700 టార్గెట్ ధరను నిర్ణయించింది.

# భారీ లాభాల్లో సూచీలు

### మదుపర్ల సంపద రూ.7లక్షల కోట్లు జంప్


**ముంబయి:** దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు, ఐటీ స్టాక్స్లో కొనుగోళ్ల మద్దతుతో సూచీలు పరుగులు పెట్టాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థకు సంబంధించి వెలువడిన ద్రవ్యోల్బణ గణాంకాలు మాంద్యం భయాలను పారదోలింది. ఇది ప్రపంచ మార్కెట్లలో పాజిటివ్ సంకేతానికి కారణమైంది. దీంతో ఇంట్రాడేలో సెన్సెక్స్ దాదాపు 1400 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ మళ్లీ 24,500 ఎగువన స్థిరపడింది. ఒక్క సెషన్లో మదుపర్ల సంపద రూ.7 లక్షల కోట్ల మేర పెరిగింది. బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ రూ.444.3 లక్షల కోట్ల నుంచి రూ.451 లక్షల కోట్లకు చేరింది.సెన్సెక్స్ ఉదయం 79,754.85 పాయింట్ల (క్రితం ముగింపు 79,105.88) వద్ద లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల జోరు



కొనసాగింది. దీంతో ఇంట్రాడేలో 80,518.21 వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1331 పాయింట్ల లాభంతో 80,436.84 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 397 పాయింట్ల లాభంతో 24,541 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 83.80 వద్ద స్థిరపడింది. సెన్సెక్స్ 30 సూచీలో టెక్ మహీంద్రా, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా, టీసీఎస్, అల్ట్రాటెక్ సిమెంట్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. సన్ఫార్మా ఒక్కటే స్వల్పంగా నష్టపోవడం గమనార్హం. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 79.78 వద్ద, బంగారం ఔన్సు 2,502 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**ఇవీ కారణాలు..**

* జులై నెలకు సంబంధించి వెలువడిన అమెరికా వినియోగదారుల ధరల సూచీ ఆధారిత ద్రవ్యోల్బణం 3 శాతం లోపే నమోదు కావడం గమనార్హం. 2021 తర్వాత ఈ స్థాయికి రావడం ఇదే తొలిసారి. దీంతో యూఎస్ ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు బలపడ్డాయి.
* గురువారం అమెరికా మార్కెట్లు భారీ లాభాల్లో ముగిశాయి. దీంతో ప్రపంచ మార్కెట్లతో పాటు మన మార్కెట్ సూచీలూ లాభాల్లో పయనించాయి. ముఖ్యంగా మన ఐటీ స్టాక్స్ రాణించాయి.
* సెన్సెక్స్, నిఫ్టీ ఇటీవల నష్టాలు ఎదుర్కొన్నాయి. ఆగస్టు నెలలో 2.5 శాతం దాకా నష్టపోయాయి. దీంతో కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు దిగడం సూచీలకు కలిసొచ్చిందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.




## బాలీవుడ్‌పై కన్నేసిన శ్రీలీల

కథల ఎంపికలో జోరు చూపిస్తోంది అందాల తార శ్రీలీల. ఇప్పటికే 'భగవంత్ కేసరి', 'గుంటూరు కారం' లాంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు చేరువైన ఈమె.. ఇప్పుడు బాలీవుడ్‌లోనూ తన నటనను నిరూపించుకోవడానికి సిద్ధమైంది. బాలీవుడ్ కథానాయకుడు సిద్దార్థ్ మల్హోత్రా 'మిట్టి' అనే చిత్రంలో నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. బల్వీందర్ సింగ్ దీన్ని తెరకెక్కిస్తున్నారు. ఇప్పుడీ సినిమాలో కథానాయికగా శ్రీలీల ఎంపికైనట్లు సమాచారం. 'కుటుంబ భావోద్వేగాలతో కూడిన యాక్షన్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ కథ విన్న వెంటనే సిద్దార్థ్ సరసన నటించడానికి అంగీకారం తెలిపింది శ్రీలీల. ఈ చిత్రంతో తన బాలీవుడ్ ప్రయాణం ప్రారంభం కాబోతున్నందుకు చాలా ఉత్సాహంగా ఉందీమె. ప్రస్తుతం ప్రీ-ప్రొడక్షన్ దశలో ఉన్న ఈ సినిమా చిత్రీకరణను అక్టోబరులో మొదలు పెట్టడానికి సన్నాహాలు చేస్తున్నార'ని చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం 'రాబిన్‌హుడ్', 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమాలతో బిజీగా ఉంది శ్రీలీల.

## అనిల్ రావిపూడితో వెంకటేశ్ సినిమా

వెంకటేశ్ కథానాయకుడిగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కుతోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై శిరీష్, దిల్‌రాజు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. 'ఎఫ్2', 'ఎఫ్3' సినిమాల తర్వాత ఈ ముగ్గురి కాంబోలో వస్తున్న చిత్రమిది. ఐశ్వర్య రాజేశ్, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ సినిమా ఇటీవలే పొల్లాచ్చిలో కొత్త షెడ్యూల్‌ను ప్రారంభించుకున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్ర సెట్లోకి వెంకటేశ్ అడుగు పెట్టారు. ఈ మేరకు చిత్ర బృందం ఓ మేకింగ్ వీడియోని పంచుకుంది. దీన్ని బట్టి ఈ ప్రస్తుత షెడ్యూల్‌లో వెంకీతో పాటు మిగిలిన ప్రధాన తారాగణంపై కుటుంబ నేపథ్య సన్నివేశాలు తెరకెక్కిస్తున్నట్లు అర్థమవుతోంది. ఈ చిత్రంలో వెంకటేశ్ మాజీ పోలీసు అధికారిగా కనిపించనున్నారు. తన అందమైన భార్య.. మాజీ ప్రియురాలు మధ్య జరిగే క్రైమ్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ సినిమా ఉండనుంది. ఇది వచ్చే ఏడాది సంక్రాంతి సందర్భంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సినిమాకి భీమ్స్ సిసిరోలియో సంగీత మందిస్తుండగా.. సమీర్ రెడ్డి ఛాయాగ్రాహకుడిగా వ్యవహరిస్తున్నారు.



## ఆర్ఆర్ఆర్‌లో రామ్‌చరణ్ నటన అదుర్స్

### ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో ప్రశంసలు

భారతీయ సినిమా స్థాయిని ప్రపంచానికి చాటి చెప్పిన చిత్రం 'ఆర్ఆర్ఆర్'. ఈ సినిమాతో రామ్ చరణ్ , ఎన్టీఆర్‌లకు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు వచ్చింది. పలువురు హాలీవుడ్ ప్రముఖులు గతంలో ఈ సినిమాను ప్రశంసించగా.. తాజాగా ఫ్రెంచ్ హీరో లూకాస్ బ్రావో.. రామ్ చరణ్‌ను మెచ్చుకున్నారు. ప్రస్తుతం ఈ వీడియోను ఆయన అభిమానులు షేర్ చేస్తున్నారు. దీంతో ఎక్స్‌లో 'ఆర్ఆర్ఆర్' పేరు దేశవ్యాప్తంగా ట్రెండింగ్‌లోకి వచ్చింది. ఆర్ఆర్ఆర్'లో మెయిన్ హీరో రామ్ చరణ్ నటన అద్భుతం. ఎంట్రీ సీన్, ఎమోషనల్ సన్నివేశాల్లో బాగా నటించారు. యాక్షన్ సీక్వెన్స్‌లలోనూ ఆకట్టుకున్నారు' అని ప్రశంసించారు. ఎస్.ఎస్.రాజమౌళి ( దర్శకత్వంలో రామ్‌చరణ్, ఎన్టీఆర్ కథానాయకులుగా నటించిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా '2022లో విడుదలైన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద రూ.1300 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్లాక్ బస్టర్‌గా నిలిచింది. ఆస్కార్ అవార్డుల్లోనూ సత్తా చాటిన సంగతి తెలిసిందే. ప్రస్తుతం రామ్ చరణ్ 'గేమ్ ఛేంజర్'తో బిజీగా ఉన్నారు. శంకర్ దర్శకత్వంలో పొలిటికల్, యాక్షన్ నేపథ్యంలో సాగే పవర్‌ఫుల్ కథాంశంతో సిద్ధమవుతోంది. ఇందులో రామ్ చరణ్ ద్విపాత్రాభినయంలో కనిపించనున్నట్లు సమాచారం. కియారా అద్వాణీ హీరోయిన్‌గా కనిపించనుండగా.. అంజలి, శ్రీకాంత్, సునీల్, ఎస్.జె.సూర్య, సముద్రఖని, నవీన్ చంద్ర తదితరులు కీలకపాత్రలు పోషిస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.

## సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో టబు

'కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను' అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంత మైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ విలలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది.కథ విన్న వెంటనే... ఎలాంటి సందేహం లేకుండా సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రలో నటించడానికి అంగీకరించాను అంటోంది బాలీవుడ్ సీనియర్ నాయిక టబు. ఎంతో మంది అగ్రతారల సరసన నటించి మెప్పించిన ఈ భామ.. త్వరలో 'డ్యూన్:ప్రాఫెసీ' అనే హాలీవుడ్ వెబ్‌సిరీస్‌తో రాబోతుంది. విజయవంతమైన 'డ్యూన్' వెబ్‌సిరీస్‌కి ప్రీక్వెల్‌గా డెనిస్ విలలెనెయువ్ రూపొందిస్తున్న సిరీస్ ఇది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆమె.. ఇందులోని తన పాత్ర గురించి కొన్ని ఆసక్తికర సంగతులను పంచుకుంది. ఇందులో సిస్టర్ ఫ్రాన్సెస్కా పాత్రను పోషించడం మంచి అనుభవం. ఈ పాత్ర కోసం నన్ను సంప్రదించినప్పుడు ఒక్క నిమిషం కూడా ఆలోచించకుండా అంగీకరించాను. బలమైన, తెలివైన, ఆకర్షణీయమైన పాత్ర ఇది. ఒక నటికి ఇలాంటి పాత్రల్లో నటించినప్పుడు చాలా సంతృప్తిగా ఉంటుంది. మునుపెన్నడూ ఇలాంటి భిన్నమైన పాత్రను పోషించలేదు. ఇది ఈ సిరీస్‌కే ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది. ఇలాంటి ఓ గొప్ప కథతో ప్రేక్షకులను పలకరించడం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నానని చెప్పుకొచ్చింది. మనిషి మనుగడకు ముప్పు తెచ్చే శక్తులతో హర్కొనెస్ సిస్టర్స్ ఎలా పోరాడారనే కథాంశం ఆధారంగా దీన్ని రూపొందించారు.







## మరో సినిమాపై చిరు దృష్టి

కథానాయకుడు చిరంజీవి ప్రస్తుతం 'విశ్వంభర'తో సెట్స్‌పై గడుపుతున్న సంగతి తెలిసిందే. వశిష్ఠ తెరకెక్కిస్తున్న ఈ సోషియో ఫాంటసీ థ్రిల్లర్ ఇప్పటికే ముగింపు దశకు చేరుకుంది. ఈ నేపథ్యంలోనే దీని తర్వాత చిరు చేయనున్న ప్రాజెక్ట్ ఏదన్నది అందరిలో ఆసక్తి రేకెత్తిస్తోంది. అయితే ప్రస్తుతం సినీ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం మోహన్‌రాజా దర్శకత్వంలో చిరు ఓ సినిమా చేసేందుకు పచ్చజెండా ఊపినట్లు తెలుస్తోంది. దీనికి బి.వి.ఎస్ రవి కథ అందిస్తున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ఈ స్క్రిప్ట్ పనులు ముగింపు దశకు చేరుకున్నాయని.. ఈ ఏడాదిలోనే ఈ చిత్రాన్ని పట్టాలెక్కించనున్నారని వార్తలొస్తున్నాయి. నిర్మాతగా చిరు తనయ సుస్మిత కొణిదెల వ్యవహరించనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నెల 22న చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌పై స్పష్టత వచ్చే అవకాశముంది.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com